


శ్రీనగర్: ఏడేళ్ల బాలిక అసిఫాను దారుణంగా హత్యాచారం చేసిన ఘటనను నిరసిస్తూ బుధవారం ధర్నా చేస్తున్న కాశ్మీరీలు

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!



సంపుటి: 62 • సంచిక: 15 • గురువారం 25 జనవరి 2018 • విజయవాడ * పేజీలు: 22 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

**ముహూర్తం** శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: శుద్ధ అష్టమి ఉ. 10.40 వరకు, అనంతరం నవమి; నక్షత్రం: భరణి తె. 5.40 వరకు, అనంతరం కృత్తిక; అమృతకాలం: రా. 11.00 నుండి 12.30 వరకు; వర్జ్యం: మ. 1.44 నుండి 3.17 వరకు; దుర్ముహూర్తం: ఉ. 10.00 నుండి 10.48 వరకు, మ. 2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ. 1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ. 6.00 నుండి 7.30 వరకు;



## ఫిరాయిస్తే పదవులా?

• రాజీనామా చేయాలి • ఆపై గెలిచి రావాలి • లేదా చట్టాన్ని మార్చాలి • బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు సంచలనం • వైకాపా ఎమ్మెల్యేలు, మంత్రులపై వ్యాఖ్యలు • బీఏసీ చైర్మన్ బుగ్గనతో కలిసి ప్రెస్‌మీట్

వివరాలు 7 లో...

# ఏపీకి ఎయిర్‌బస్!

• మార్గం మరింత సుగమం
• కొనసాగుతున్న కసరత్తు
• స్వాగతించిన చంద్రబాబు
• సీఈవో డిర్క్‌హోక్‌తో భేటీ
• అన్నివిధాల సహకరిస్తామని హామీ
• పలు కంపెనీలతో చర్చోపచర్చలు
• దావోస్‌లోనూ అన్నదాత ఆలోచనే
• కరవు నియంత్రణకు ఆధునిక విధానాలు



**అమరావతి, ఆంధ్రప్రభ :** రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక ఎయిర్‌బస్ ప్రాజెక్టు రావడానికి మార్గం మరింత సుగమం అయింది. ఇందుకు సంబంధించిన కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. భారత్‌కు చెందిన ప్రతిష్టాత్మక టాటా సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌ను స్థాపించి సీ-295 రకం రవాణా విమానాల తయారీని చేపట్టేందుకు ఎయిర్‌బస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా గత ఏడాది కొన్ని నిర్దిష్ట ప్రతిపాదనలతో ఆంధ్రప్రదేశ్ ముందుకు వచ్చింది. దీనిపై విస్తృతంగా చర్చలు జరిగాయి. ఇందుకు సంబంధించిన అనుమతులు, ఇంతర అంశాలపై అధికారులు సవివరంగా ఎయిర్‌బస్‌కు తెలిపారు. కాగా దావోస్‌లో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసిన ఎయిర్‌బస్ సీఈవో డిర్క్‌హోక్ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. అనుమతులను సమకూర్చుకునే ప్రయత్నంలో ఉన్నట్టు వివరించారు. ఈ ఏడాది చివరినాటికి ప్రాజెక్టును సాకారం చేయనున్నట్టు చెప్పారు. ఇందుకు తాము అన్నివిధాలా సహకరిస్తామని చంద్రబాబు హామీ ఇస్తూ, ఎయిర్‌బస్ రాకను స్వాగతించారు. వివిధ దేశాల్లో ఇప్పటికే ఉన్న తమ తయారీ యూనిట్లను సందర్శించాల్సిందిగా డిర్క్‌హోక్ సీఎం చంద్రబాబును ఆహ్వానించారు. కాగా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరుస సమావేశాలతో బిజీబిజీగా గడిపారు. వివిధ కంపెనీల యాజమాన్యాలతో, సీఈఓలతో భేటీ అయ్యారు. భారీగా వెల్లువెత్తుతున్న పెట్టుబడులపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ యూనిట్ల స్థాపనకు వున్న అవకాశాలను వివరించారు. పలువురు బహుళజాతి సంస్థల ప్రతినిధులను ఆంధ్రప్రదేశ్‌కు ఆహ్వానించారు. ఎయిర్‌క్రాఫ్ట్, ఐటి, రవాణా,

2వ పేజీలో...

## పెట్టుబడులకు స్వర్గధామం

• ప్రపంచ ఇన్నోవేషన్ వ్యాలీగా ఏపీ • నిర్దిష్ట విధానాలే అభివృద్ధికి ప్రాతిపదిక • 20 శాతం వృద్ధిరేటే లక్ష్యం • లాజిస్టిక్, నాలెడ్జ్ హబ్‌లుగా తీర్చిదిద్దుతాం • దావోస్ సదస్సులో సీఎం

2

దోషి... దోషి... దోషి!



## లాలూకు ఐదేళ్ల జైలు

• దాణా కుంభకోణం మూడో కేసులో సీబీఐ కోర్టు తీర్పు • మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా కూడా దోషి • ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులకు రూ.5 లక్షల జరిమానా • న్యాయం కోసం పోరాడుతాం: తేజస్వీ యాదవ్

వివరాలు 5 లో...

అత్యద్భుత విజువల్ వండర్

# పద్మావత్‌కు ఛాందస సెగ



**(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

దేశంలోనే ఇటీవల కాలంలో మరే చిత్రం వివాదాస్పదం కాలేదు. నిర్మాణ సమయం నుంచి సెట్టింగ్స్ దగ్ధం, నటులు, సాంకేతిక నిపుణులపై దాడులు, కోర్టు కేసులు, ధర్నాలు, హర్తాళ్ళు, ఉద్యమాలు, హెచ్చరికలు, ఆఖరకు థియేటర్ల యాజమాన్యాల్నుంచి సహాయ నిరాకరణలు.. భారత సర్వోన్నత న్యాయస్థాన ప్రమేయం చిత్ర యూనిట్‌కు, చిత్రాన్ని ప్రదర్శించే థియేటర్లకు రక్షణ కల్పించాలన్న ఆదేశం.. ఇలా ఇంతటి విపత్కర పరిస్థితుల నడుమ చారిత్రక నేపథ్యంతో కూడిన పద్మావత్ చిత్రం గురువారం థియేటర్లలోకి రానుంది. ఆత్మగౌరవం, పౌరుషం, రాజకీయ చాణక్యాలకు ప్రతీకగా రాణి పద్మావతిని రాజ్‌పుత్ వీరులు పరిగణిస్తారు. శత్రువును చీల్చి చెండాడ్డం లేదా ఆత్మార్పణకు పాల్పడ్డం ఈ రెండే పద్మావతికి తెలిసిన రాజకీయ చాణక్యాలు. అతి గొప్ప సౌందర్యరాశిగా పద్మావతిని కవి మాలిక్ మహ్మద్‌జైసి చిత్రీకరించారు. ఈ కథకు చారిత్రక ఆధారాల్లేవు. కానీ 1313 ప్రాంతంలో ఇది జరిగినట్లుగా సూఫీ కవి జైసి 1550వ ప్రాంతంలో అరబ్బీ కవితావిధానంలో పద్మావతిపై ఓ కథనం రాశారు. ఇది దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకొచ్చింది. అందానికి, అత్యద్భుత గుణగణాలకు ప్రతీక రాణి పద్మావతి. ఆమె సింహల యువరాణి. వేటకొచ్చిన చిత్తోర్ సంస్థానాదీశుడు రతన్‌సింగ్ ఆమెను చూస్తాడు. ఇరువురు ప్రేమలో పడతారు. కొంతకాలానికి చిత్తూర్ కోటపై అల్లావుద్దీన్ ఖిల్జీ తన అపార సైన్యంతో దాడిచేస్తాడు. అతని సైన్యం ముందు రతన్‌సింగ్ రాజ్యం నిలబడలేకపోతుంది. ఈ దశలో రాజీ ప్రతిపాదన జరుగుతుంది. కనీసం ఒకసారి పద్మావతి సౌందర్యాన్ని తనను చూడనివ్వమంటూ ఖిల్జీ ప్రతిపాదిస్తాడు. అయితే అందుకు రతన్ సింగ్, పద్మావతిలు అంగీకరించరు. యుద్ధానికే ముందుకురుకుతారు. ఈ దశలో పద్మావతితో పాటు మరికొంతమంది రాజపుత్ మహిళలు తమకు తాము ఆత్మార్పణం చేసుకుంటారు. శత్రువుల చేతికి చిక్కడం కంటే వీరవనితలుగా అశువులు బాయడం మేలని ఈ నిర్ణయం తీసుకుంటారు. ఈ కథ వెలువడినప్పట్నుంచి రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పద్మావతి వీరనారిగా ప్రసిద్ధి చెందారు. ఆధునిక యువతకు కూడా పద్మావతి ఒక ఐకాన్‌గా రూపొందారు. అలాంటి పద్మావతి కథను చిత్రంగా తీస్తున్నారన్న వార్త పట్ల రాజ్‌పుత్‌లు ఎలాంటి స్పందన

• ఆందోళనల నడుమ నేడు విడుదల
• తీవ్రస్థాయిలో వివాదాస్పదం
• కేసులు... ఉద్యమాలు... దాడులు
• సుప్రీం ఆదేశించినా ఆగని దౌర్జన్యాలు
• చరిత్రను వక్రీకరించలేదు
• మనోభావాలకు విఘాతం కలగలేదు
• అద్భుతమంటున్న రివ్యూలు

3వ పేజీలో...



3

అలనాటి నటి

## కృష్ణకుమారి ఇక లేరు

కేన్సర్‌తో బాధపడుతూ బెంగళూరులో కన్నుమూత
సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి

## గజల్ శ్రీనివాస్‌కు షరతులతో బెయిల్

8

## రూ.88 వేల కోట్లతో బ్యాంకులకు టానిక్

6



# నా వ్యూహాలు వేరు!

• పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు • సీట్లు ఇస్తేనే సామాజిక న్యాయం రాదు • మార్పుకోరే యువత కావాలి • నాపై విమర్శలు, దాడులను భరిస్తా • జై తెలంగాణ సామాజిక మార్పుకోసం సంకేతం • తెలంగాణ పర్యటనలో పవన్‌కల్యాణ్

**(ఆంధ్రప్రభ న్యూస్ నెట్‌వర్క్)**

జనసేనకు ముఖ్యంగా తనకు రకరకాల వ్యూహాలు ఉంటాయని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎత్తుగడలు వేస్తుంటానని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. సామాజికన్యాయం కేవలం అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు ఇస్తే రాదని సమాజంలో ఉన్న బడుగు, బలహీన అట్టడుగు వర్గాల సంక్షేమానికి జనసేన కృషి చేస్తుందని చెప్పారు. జిల్లాల పర్యటనల్లో భాగంగా బుధవారం మూడోరోజు ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలకు చెందిన జనసేన పార్టీ సమన్వయ కర్తల సమావేశంలో పవన్ కళ్యాణ్ ఉద్విగ్న ప్రసంగం చేశారు. బాధ్యతతో కూడిన రాజకీయ వ్యవస్థ రావాలంటే జనసేనకు ఉడుకు నెత్తురున్నా, సలసల కాగుతున్న యువత కావాలని చెప్పారు. మార్పును కోరే యువత జనసేనకు కావాలని, గుండెల నిండా అన్నా మేమున్నామంటూ కదంతొక్కే ఆడపడుచులు జనసేనకు అవసరమని చెప్పారు. అందుకే తాను ఎంతో బాధ్యతగా ఉంటానని మెత్తగా,

7వ పేజీలో...

ఔరా..!




# విద్యుత్ సంస్కరణలు అనివార్యం?!



• నెరవేరని లక్ష్యాలు
• కొరవడిన ముందు చూపు
• నష్టాలపాలవుతున్న డిస్కమ్‌లు
• డిమాండ్ లేనప్పుడు టారిఫ్ తగ్గాలి
• నిపుణుల సూచనలు

**అమరావతి, ఆంధ్రప్రభ:** విద్యుత్ రంగంలో మరో దఫా సంస్కరణలు అవసరమని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ రంగంలో పోటీ తత్వాన్ని పెంచేందుకు 1998లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంధన రంగాన్ని జెన్కో, ట్రాన్స్‌కో, డిస్క మ్, విద్యుత్ టారిఫ్ నిబంధన నియంత్రణ కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. విద్యుత్ రంగం పోటీతత్వంతో పనిచేస్తూ అంతిమంగా వినియోగదారులకు చౌక ధరలకు కరెంటు అందించడమే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేశారు. 1993లో ఈ సంస్కరణలు అమలయ్యాక ఏడాదికి ఒక శాతం చొప్పున పంపిణీ నష్టాలు, విద్యుత్ చౌర్యం తగ్గించా లన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. కానీ, సంస్కరణల లక్ష్యా లు ఇప్పటిదాకా నెరవేరలేదు. పైగా సంస్థల మధ్య పోటీ పెరగడం పెడదోవ పట్టి తమ విభాగం బాగుండాలి.. లాభాల్లోకి రావాలని అనే ధోరణితో ఉన్నాయి. ఫలితం గా ఒక వ్యవస్థపై మరో వ్యవస్థ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. అయితే అంతిమంగా ఏక మొత్తంలో ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ ను సేకరించి,

7వ పేజీలో...

## చిన్న, మధ్య పరిశ్రమలకు భూకేటాయింపులేవీ?!

• మల్లవల్లి కారిడార్‌లో ప్రతిష్టంభన
• 450కి పైగా ఎమ్మెస్ఎంఈల ఒప్పందం
• రెండేళ్లయినా అన్నీ అడ్డంకులే
• పునరాలోచనలో పారిశ్రామిక వేత్తలు

**అమరావతి, ఆంధ్రప్రభ :** మల్లవల్లి ఇన్నో వేటివ్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో పరిశ్రమల స్థాపన ఇప్పట్లో కార్యరూపం దాల్చేలా లేదు. ఇక్కడ చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన హైదరాబాద్ పారిశామికవేత్తలు పునరాలోచనలో పడ్డారు. అధికారుల తీరుతో విసిగి వేసారిన వీరు ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. విశాఖలో

7వ పేజీలో...







ముఖ్యమంత్రి చంద్రబాబు వేదాంత కంపెనీ అనిల్ అగర్వాల్‌తో భేటీ. సీఐఐ డెలిగేట్స్‌తో సీఎం, మంత్రి లోకేష్

# ఏపీకి ఎయిర్‌బస్!

(మొదటిపేజీ తరువాయి)

వ్యవసాయ, త్రీడీ ప్రింటింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి అంశాలపై సి.ఇ.ఒ.లతో చర్చించారు. రాష్ట్రంలో అపారమైన వనరులున్న దృష్ట్యా పెట్టుబడులకు ముందుకు రావాలంటూ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రికి వివిధ సంస్థల అధినేతలు చంద్రబాబు బృందానికి బ్రహ్మరథం పడుతుండటంతో నూతనోత్సాహం నెలకొంది.

### నన్యాంగ్ వైస్ ప్రెసిడెంట్ భేటీ

ముఖ్యమంత్రితో భేటీ అయిన నన్యాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ సుబ్రా సురేశ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని స్మార్ట్ క్యాంపస్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇప్పటికే 60 శాతం ప్రక్రియ పూర్తయిందని, అంతర్గత రవాణా యావత్తూ అటానమస్, విద్యుత్ వాహనాలేనని, ఫలితంగా 35 శాతం వినియోగం తగ్గిందని తెలిపారు. తాము అమలు చేస్తున్న బెస్ట్ ప్రాక్టిసెస్‌ను పరిశీలించడానికి ఈసారి సింగపూర్ పర్యటనలో క్యాంపస్‌ను సందర్శించాలని కోరారు. తమది ప్రపంచంలోనే ఎకోఫ్రెండ్లీ క్యాంపస్ అని ఆయన అభివర్ణించారు. రాష్ట్రం మొత్తాన్ని స్మార్ట్ రాష్ట్రంగా మార్చాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ ప్రగతి రియల్ టైమ్ గవర్నెన్స్ తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఫైబర్ గ్రిడ్‌తో పాటు 6000కు పైగా వర్చ్యువల్ క్లాస్‌రూమ్‌లు, డ్రోన్ల వినియోగం, క్లౌడ్ హబ్ పాలసీ, 20 వేలకు పైగా ఉన్న సీసీ కెమెరాల వినియోగానికి సంబంధించి ముఖ్యమంత్రి వివరించడం జరిగింది.



యుపీఎల్ సంస్థ సీఈవో ష్రాఫ్, ఇతర అధికారులతో ముఖ్యమంత్రి భేటీ

### కరవు నియంత్రణకు యుపీఎల్ విధానం

భూమిలోని నీటిని గ్రహించి క్షామం ఏర్పడిన సందర్భంలో నీటిని విడుదల చేసే ఉత్పత్తులకు శ్రీకారం చుట్టిన యుపీఎల్ లిమిటెడ్ గ్లోబల్ కంపెనీ సీఈవో జై ష్రాఫ్ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. కరవును నియంత్రించేందుకు తమ విధానం తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఉత్పాదకతను 30 నుంచి 40 శాతం వరకు పెంచగలదని అన్నారు. ఫెర్టిలైజర్‌తో మిళితం చేసి ఉండే ఈ ఉత్పత్తి ద్వారా 30 శాతం ఎరువుల వినియోగం ఆదా అవుతుందని, తమ ఉత్పత్తులన్నీ రైతాంగానికి ఉపకరించేవేనని ముఖ్యమంత్రి వివరించారు. సమర్థవంతంగా నీటి నిర్వహణ, వ్యవసాయ కూలీల సంఖ్యను తగ్గించడం ద్వారా ఖర్చును నియంత్రించడం జరుగుతోందని అన్నారు. కాగా తైవాన్ సైనిక సహకారంతో తమ సంస్థ డ్రోన్ టెక్నాలజీని తాము అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను యుపీఎల్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. ఏపీని ఒకసారి సందర్శించాలని, తమ ఉత్పత్తులను ప్రయోగశాలగా చేసుకోవాలని సూచించారు.

### బ్లాక్ చైన్ టెక్నాలజీ సంస్థ ఏర్పాటుకు కృషి

దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బ్లాక్ చైన్ టెక్నాలజీకి చెందిన ఎథేరియం వ్యవస్థాపకుడు లుబిన్ ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏదైనా విశ్వవిద్యాలయంలో బ్లాక్ చైన్ టెక్నాలజీ సంస్థను ఏపీ ప్రభుత్వం, ఎథేరియం సంయుక్తంగా నెలకొల్పాలని చంద్రబాబు ప్రతిపాదించారు. ఐటీ శాఖ మంత్రి లోకేష్ వచ్చే వారం న్యూయార్క్‌లో పర్యటించినప్పుడు ఎథేరియం కార్యాలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. భారతదేశంలో ఎక్కడ కూడా బ్లాక్ చైన్ టెక్నాలజీ కోర్సు లేదని ఒక యూనివర్సిటీని ఎంపిక చేసుకుంటే మూడు నెలల కోర్సు ప్రారంభించవచ్చని చెప్పారు.

### సర్కారు చొరవ భేష్: వేదాంత చైర్మన్

దావోస్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని వేదాంత చైర్మన్ అనిల్ అగర్వాల్ కలుసుకున్నారు. పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవను ప్రశంసించారు. విశాఖలో రెండు టవర్ల నిర్మాణంలో ఉన్నామని ఇప్పటికే భూమి కేటాయింపు, అవసరమైన అనుమతులు వచ్చాయని, బోస్టన్ తరహాలో దేశంలో ఒక విశ్వవిద్యాలయం టౌన్ షిప్‌ను నెలకొల్పే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వాధికారులు ఎంతో బాధ్యతతో, ఉత్సాహంతో పనిచేస్తున్నారని, ఇలాంటి ప్రభుత్వంతో కలిసి పనిచేయడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని అనిల్ అగర్వాల్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ తమ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాన్ని, టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చారు. విశ్వవిద్యాలయ ప్రాజెక్టు అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సంస్థ నుంచి ఒకరిని ప్రత్యేకంగా నియమించాలని ముఖ్యమంత్రి కోరారు.

### హెచ్‌పీ త్రీడీ ప్రింటింగ్ హెడ్‌తో భేటీ

కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్‌పీ త్రీడీ ప్రింటింగ్ హెడ్ స్టీఫెన్ నీగ్రోతో కూడా భేటీ అయ్యారు. ఇప్పటికే వైజాగ్, మెడ్‌టెక్ జోన్‌లో నూతన తరం త్రీడీ ప్రింటింగ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. హెచ్‌పీ సంస్థ తమ కేంద్రాలను ఆంధ్రప్రదేశ్‌లో విరివిగా ఏర్పాటు చేసి ప్రజలకు త్రీడీ ప్రింటింగ్ అనుభూతిని తెలియజేయాలని సీఎం సూచించారు. కాగా హెచ్‌పీ ప్రతినిధులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు వచ్చే రెండు నెల్లలో భారత పర్యటనలో భాగంగా అమరావతి వస్తామని స్టీఫెన్ వెల్లడించారు. ఈ భేటీలో సంస్థ ప్రతినిధులు మెటల్ గేర్ వీల్ తయారీ, త్రీడీ ప్రింటింగ్ పై ముఖ్యమంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి వెంట దావోస్ పర్యటనలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఐటీ, పంచాయితీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో జాస్తి కృష్ణకిషోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోగ్యరాజ్, వ్యవసాయ శాఖ సలహాదారు టి.విజయకుమార్‌లు కూడా పాల్గొన్నారు.

# పెట్టుబడులకు స్వర్గధామం

- ప్రపంచ ఇన్నోవేషన్ వ్యాలీగా ఏపీ
- నిర్దిష్ట విధానాలే అభివృద్ధికి ప్రాతిపదిక
- 20% వృద్ధిరేటే లక్ష్యం
- లాజిస్టిక్, నాలెడ్జ్ హబ్‌లుగా తీర్చిదిద్దుతాం
- దావోస్ సదస్సులో ముఖ్యమంత్రి




భవిష్యత్ సాంకేతికతలపై జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

**అమరావతి, ఆంధ్రప్రభ:** దక్షిణాసియాకు ముఖ ద్వారంగా ఆంధ్రప్రదేశ్‌ను అతిపెద్ద లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ముందున్న తక్షణ కర్తవ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఏపీని నాలెడ్జ్ హబ్‌గా, ఇన్నోవేషన్ సెంటర్‌గా మార్చాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, అందరి సహకారం లభించినట్లయితే నిర్దేశించుకున్న 20 శాతం వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకోగలమనే ధీమాను వ్యక్తం చేశారు. బుధవారం దావోస్‌లో జరిగిన సీఐఐ రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఏ.పి ని ఇన్నోవేషన్ వ్యాలీ ఆఫ్ ది వరల్డ్‌గా మార్చే దిశగా పురోగమిస్తున్నామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. తమది పసిపాపలా ఎదగాల్సిన కొత్త రాష్ట్రమని, అయితే సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవంతో ఒడిదుడుకులను ఎదుర్కొంటామనే ధీమా వుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉన్న అవకాశాలు, విభిన్న స్వభావాలతో కూడుకున్నవని చెప్పారు. సీఐఐతో తమకు సుదీర్ఘమైన అనుబంధం వుందని పేర్కొంటూ, ఏపీలో ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేయాలని ఆహ్వానించారు. రెండు దశాబ్దాల క్రితం తాను ఐటీ రంగాన్ని ప్రోత్సహించి హైటెక్ సిటీని, సైబరాబాద్‌ను నిర్మించడం జరిగిందని, అప్పట్లో కొద్ది మంది వ్యాపార వేత్తలకు, ఉన్నత వర్గాలకు మాత్రమే టెక్నాలజీ అందుబాటు లోవుండేదన్నారు. అయితే తాజాగా పరిస్థితులలో గణనీయమైన మార్పులు సంభవించాయని, కొద్దిమందికే పరిమితమైన టెక్నాలజీ తాజాగా ఎక్కడ చూసినా విస్తరించిందని చంద్రబాబు నాయుడు గుర్తు చేశారు. అమరావతిని కూడా తమ ప్రభుత్వం నిర్మించుకోవాల్సి ఉందని, ఇబ్బందులు ఎదురౌతున్నా అందరి స్ఫూర్తిని పొంది పురోగమిస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ నిల్వ సామర్థ్యం సమకూర్చుకునే టెక్నాలజీ మీద దృష్టి సారించడం జరిగిందని, అపరిమితమైన సౌర, ఇంధన వనరులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పరిమితమైన టెక్నాలజీ ప్రస్తుతం ఎక్కడ చూసినా విస్తరించిందని, గతంలోనూ విద్యుత్ రంగ సంస్కరణలను తీసుకువచ్చా మని, ప్రస్తుతం రెండవ తరం విద్యుత్ సంస్కరణలను చేపడుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. విద్యుత్‌ను అతి చౌకగా అందించే విధానాల మీద దృష్టిని కేంద్రీకరించడం జరిగిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను సూర్యోదయ రాష్ట్రంగా పిలుచుకుంటున్నామని, సౌర శక్తిని సమర్థవంతంగా వినియోగించుకోగలిగితే అత్యంత చౌకగా విద్యుత్ లభించే అవకాశముందన్నారు. ప్రస్తుతం రెండంకెల వృద్ధి రేటుతో ముందుకు సాగుతున్నామని, 15 సంవత్సరాల పాటు 20 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అమరావతిని ప్రపంచంలోని ఉత్తమ నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దుకుంటున్నామని పట్టణీకరణ సవాళ్ళకు సమాధానంగానే జల, హరిత నగరంగా నిర్మిస్తున్నామన్నారు.

### నవ్యావిష్కరణలు అనివార్యం

నవ్యావిష్కరణలు జన జీవన విధానాన్నే మార్చి వేస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి సానుకూల వాతావరణం ఉందని, మరో అడుగు ముందుకు వేసి ఈజ్ ఆఫ్ లివింగ్‌కు అనుగుణంగా ఫలితాలు సాధించాలన్నారు. దావోస్ పర్యటనలో భాగంగా ఇంటరాక్టివ్ లంచాన్ కార్యక్రమంలో టెక్నాలజీ ఫర్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ఇప్పుడు కల్పించాల్సింది సంతృప్తిగా జీవించే అనుకూల వాతావరణం అని నొక్కి చెప్పారు. పూర్వీకులు ఇచ్చిన భౌతిక సంపదను వారసత్వంగా భావించకూడదని, జ్ఞాన సంపదతో రాత్రికి రాత్రే అద్భుతాలు చేయవచ్చని స్పష్టం చేశారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయని అన్నారు. ప్రాధాన్యత కలిగిన రంగాలను ఏడు మిషన్‌లుగా విభజించి ఒక దార్శనిక పత్రాన్ని రూపొందించుకున్నామని, 5 క్యాంపెయిన్లు, 5 గ్రిడ్‌లుగా తీసుకొని ప్రగతికి దిశను నిర్దేశించుకున్నామని చంద్రబాబు వివరించారు. అన్ని విభాగాల్లోనూ కష్టాలను ఎదుర్కొంటున్నామని, వీటిని తొలగించి ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి ఇంటిని ఫైబర్ గ్రిడ్‌తో అనుసంధానం చేశామని, ప్రపంచంలోనే అతి పెద్ద వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కలిగిన రాష్ట్రంగా అవతరించామని, కేవలం రెండు డాలర్ల వ్యయంతో టెలిఫోన్, టివి, వైఫై సదుపాయాలు కల్పిస్తున్నామని చంద్రబాబు చెప్పారు. భూదార్ ద్వారా భూమికి సంబంధించిన సమాచారంపై కేంద్రీకరించామని, సమగ్ర ఆర్థిక నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేశామని, ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం సేకరించామని, తద్వారా సంక్షేమ పథకాల ఫలాలు పారదర్శకంగా లబ్ధిదారులకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎక్కడా లేని విధంగా లాక్‌డ్ హౌస్ మేనేజ్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చి భద్రతను కల్పిస్తున్నామని, అంతర్జాతీయ స్థాయిని అందుకునే విధంగా ప్రణాళికా రచన చేశామని, ప్రజలే ముందు నినాదంతో 1100 నెంబర్ కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. పాలన, సంక్షేమం విషయంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిని అందుకునే విధంగా లక్ష్యాలను పెట్టుకున్నామని, ఇది అద్భుతమైన ఫలితాలను ఇస్తోందన్నారు. విజబుల్ గవర్నెన్స్, ఇన్విజబుల్ గవర్నెన్స్ తమ విధానమంటూ 1100 కాల్ సెంటర్ ద్వారా రోజుకు 1.5 మిలియన్ ప్రజలకు కాల్ చేయగలమని గుర్తు చేశారు. రియల్ టైమ్ డెసిషన్ మేకింగ్, రియల్ టైమ్ మానిటరింగ్, రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా తమ రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 2022 నాటికి దేశంలోని మూడు అత్యుత్తమ రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 నాటికి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా మారడమే లక్ష్య మన్నారు. 2050 నాటికి ప్రపంచ పెట్టుబడులకు ఏపీని అత్యుత్తమ గమ్య స్థానంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

### సక్సెస్‌ఫుల్ సీఎం

రహేజా గ్రూప్ ప్రతినిధి రవి రహేజా మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం మొదటిసారి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశానని తెలిపారు. అప్పట్లో తనకు అంతగా విశ్వాసం ఏర్పడలేదని, కానీ రహేజా మైండ్ స్పేస్ సెంటర్ ఏర్పాటుకు చూపిన చొరవ, అందించిన సహకారం, చేసిన కృషి తన అభిప్రాయాన్ని మార్చివేసిందన్నారు. ఇప్పుడు విజయవంతమైన ముఖ్యమంత్రి ఎవరంటే తాను చంద్రబాబునాయుడు పేరే మొదట చెబుతానని రవి రహేజా అన్నారు.

### ప్రతి అర్జీ పరిష్కారం కావాల్సిందే

ప్రభుత్వానికి ప్రజల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రతి అర్జీ కూడా పరిష్కారం అయి తీరడమే తమ నినాదమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో భాగంగా బుధవారం జరిగిన ప్యానెల్ డిస్కషన్ లో మాట్లాడుతూ అన్ని వ్యవస్థలను ఒక దగ్గరకు చేర్చడం, తక్కువ ఖర్చుతో ప్రతి ఒక్కరు అత్యంత ఆనందదాయకమైన జీవనం సాగించేవిధంగా చూడడమే లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలందరు అత్యున్నతమైన జీవనాన్ని సాగించే క్రమంలో అవసరమైన ఆరోగ్యం, విద్యుత్, ఆదాయం వంటి భద్రతలు కల్పించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందు ఉన్న తక్షణ ప్రాధామ్యాలు అన్నారు.

# నాలెడ్జ్‌హబ్‌గా ఆంధ్రా

- యూనివర్సిటీల వీసీల విధానాలు బాగున్నాయి
- ఇన్నోవేషన్‌లో విద్యార్థులు సమర్థవంతంగా ముందుండాలి
- ఈఎస్‌ఎల్ గవర్నర్ నరసింహన్



**విశాఖపట్నం, ప్రభ న్యూస్:** సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థి లోకాన్ని తీర్చి దిద్దాలని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. విద్యార్థి దశలోనే వారిని ప్రతిభావంతులుగా తీర్చదిద్దడంతో పాటూ సమాజానికా సేవ రంగంలోనూ వారి ప్రమేయంపెరిగేలా చేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం విశాఖపట్నం ఆంధ్ర విశ్వకళాపరిషత్ సెనేట్ హాలులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లోని యూనివర్శిటీలకు చెందిన ఉప కులపతులతో సమావేశం అయ్యానని చెబుతూ తనకు పూర్తి సంతృప్తి లభించిందన్నారు. వీసీల సమావేశం తనకు పూర్తి ఆనందాన్ని పంచిందన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాతి 43 నెలల్లో రాష్ట్రంను అన్ని రంగాల్లోనూ సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏకైక లక్ష్యం రాష్ట్రంను నాలెడ్జి హబ్‌గా తీర్చిదిద్దాలని అంటూ ఆయన గుర్తు చేశారు. ప్రాథమిక మాధ్యమిక విద్యలతో పాటూ ఉన్నత విద్యా విధానం అత్యంత ప్రాముఖ్యత కూర్చుకున్నదని చెప్పారు. విద్యార్థులు విద్యతో పాటూ నైపుణ్యంను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనానెరు. వీరంతాసేవా కార్యక్రమాలతో సమాజానికి ఉపయోగపడడం ముఖ్యమైన విషయంఅన్నారు. నూతన రంగాల్లో కొత్త కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు. సృజనాత్మ కంగా ఆలోచించడం, ఓడీఎఫ్, స్వచ్ఛ భారత్, రక్తదానం వంటి స్వచ్ఛంద సేవల్లో పాల్గొనేలా విద్యార్థులను తీర్చి దిద్దాలని సూచించారు. ఇదే కోణంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని విశ్వ విద్యాలయాల ఉప కులపతులూ చేసిన ప్రెజెంటేషన్ తనకు పూర్తి సంతోషాన్నిచ్చిందన్నారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటూ ఇటు విద్యా శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా ఉన్నత విద్య విషయంలో మంచి ప్రాధాన్యతను ఇస్తున్నారని అభినందించారు. డిజిటలైజేషన్‌తో పాటూ డిజిటల్ గ్రంధాలయాలనూ నిర్వహించడం చేస్తున్నారని చెప్పారు. త్వరలో విద్యార్థుల ప్రతిభను తెలుసుకునేందుకు వీలుగా బయోమెట్రిక్ హాజరును కూడా ప్రవేశపెడుతున్నట్లుగా గవర్నర్ నరసింహన్ వెల్లడించారు. మంచి ర్యాంకులను రాష్ట్రంలోని యూనివర్శిటీలు సాధించాలని ఇన్నోవేషన్‌లో విద్యార్థులు ఈసంవత్సరం మంచి స్థానంలో నిలవాలని ఆశించారు. మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ గవర్నర్‌గా విద్యపట్ల తనకున్న ఆపేక్షను వీసీల సమావేశంలో నరసింహన్ వెలుబుచ్చారనిచెప్పారు. కొత్త రాష్ట్రంలో కొత్త సంస్కరణలు, ఆర్థిక కేటాయింపులూ గురించి నరసింహన్ వీసీల సమావేశంలో చర్చించారని చెబుతూ సామాజిక సేవలతో విద్యార్థులను మమేకం చేసే అంశంలో రెండు మూడు నెలల్లో నివేదికను ఇస్తామన్నారు. ఆకస్మిక తణిఖీలు ప్రతి విశ్వ విద్యాలయంలోనూ జరుపుతానని పేర్కొన్న గవర్నర్ అభిరుచిని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇదే సమావేశంలో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ వియరాజు, ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు, ఇంక్యేబేషన్ సెంటర్ సీఈఓ ఆచార్య వల్లి కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో సానుకూల పరిస్థితులు

- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెం:1: మంత్రి లోకేష్




ఇన్వెస్ట్ ఇండియా లాంజ్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌లో సానుకూల పరిస్థితులు వలనే అనేక కంపెనీలు వస్తున్నాయని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. దావోస్ పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ బుధవారం ఇన్వెస్ట్ ఇండియా లాంజ్‌లో తయారీ రంగం అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగం అభివృద్ధి, తయారీ రంగం అభివృద్ధికి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. నూతన పాలసీలు తీసుకొచ్చి అనేక రాయితీలు కల్పిస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నెంబర్ వన్‌గా ఉన్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అన్ని అనుమ తులు త్వరగతిన ఇస్తున్నామని, వెనుకబడిన జిల్లా అయిన అనంతపురంకు కియా వచ్చిందని, అపోలో, హోండా, ఇసుజు లాంటి సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఉన్న పూర్తి స్థాయి ఎకోసిస్టమ్ తీసుకొచ్చేం దుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, రెండు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. ఫాక్స్ కాన్, సెల్ కాన్, కార్బన్, డిక్సన్ లాంటి కంపెనీలు ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించాయని, సెల్ ఫోన్ తయారీలో బ్యాటరీ నుండి పూర్తి స్థాయి మొబైల్ తయారీ వరకు ఉన్న అన్ని కంపెనీలను రాష్ట్రా నికి తీసుకొస్తున్నా మన్నారు. పారిశ్రామిక అభివృద్ధి, తయారీ రంగం అభివృద్ధి చెందాలంటే క్లస్టర్ మోడల్ అమలు చేయాలని, అప్పుడే పూర్తిస్థాయి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పారిశ్రామికాభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుం టున్న నిర్ణయాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే దేశంలో తయారీ రంగం అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందు తుందన్నారు.

అనంతరం ఇండస్ట్రియల్ ప్రమోషన్స్ అడిషన్ సెక్రటరీ అతుల్ చతుర్వేది మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న విధానం అందరికి ఆదర్శంగా ఉందని, అందుకే పెద్ద పెద్ద కంపెనీలు ఏపీకి వెళ్తున్నాయన్నారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలను మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలు చెయ్యాలని అప్పుడే దేశంలో తయారీ రంగం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈసమావేశంలో ఇన్వెస్ట్ ఇండియా సీఈవో దీప్ బాగ్లా, పిడబ్ల్యూసి మనీష్ అగర్వాల్‌తోపాటు వివిధ దేశాల పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

# అత్యాధునిక టెక్నాలజీతో రైతులకు రుణాలు

- దావోస్‌లో సంజీవ్ బజాజ్‌తో లోకేష్




బజాజ్ ఫిన్ సెర్వ్ ఎండీ సంజీవ్ బజాజ్‌తో లోకేష్ భేటీ

ఆంధ్రప్రదేశ్‌లో పంట బీమా, రైతులకు రుణాలు అందచేసేందుకు అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నామని రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ మంత్రి లోకేష్ అన్నారు. బుధవారం దావోస్‌లో బజాజ్ ఫిన్ సెర్వ్ మ్యానేజింగ్‌డైరెక్టర్ సంజీవ్ బజాజ్‌తో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. మాట్లాడుతూ రాజధాని అమ రావతి ప్రాంతంలో ల్యాండ్ రికార్డ్లు అన్ని బ్లాక్ చైన్ టెక్నాలజీ కిందకి తీసుకొస్తున్నామ న్నారు. దీనివల్ల ల్యాండ్ రికార్డులు ట్యాంప రింగ్ జరిగే అవాకాశం ఉండదన్నారు. ల్యాండ్ రికార్డ్స్ అన్ని బ్లాక్ చైన్ ఫ్లాట్ ఫార్మ్‌పైకి తీసుకరావటంతో రుణాలు అతి తక్కువ సమయంలో పొందే అవకాశం వచ్చిందన్నారు. విశాఖ పట్టణంలోఫిన్‌టెక్ వ్యాలీ ఏర్పాటు చేశామని, ఫైనాన్షియల్ టెక్నాలజీ సేవలు అందిస్తున్న కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. అనంతరం స్పందించిన సంజీవ్ బజాజ్ ఏపీ ప్రభుత్వం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పంట బీమా, రుణాలు తదితర అంశాల్లో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని స్పష్టంచేశారు.

# ఘనంగా శ్రీ శారదాపీఠం వార్షికోత్సవం

- దీక్షలూ, పూజాధికాలు, హోమాలతో ఆధ్యాత్మిక శోభ
- స్వరూపానందేంద్ర స్వామి అనుగ్రహ భాషణం, ఆశీస్సులు



**విశాఖపట్నం, ప్రభ న్యూస్:** విశాఖ శ్రీ శారదా పీఠం వార్షికోత్సవం బుధవారం అత్యంత ఆధ్యాత్మికయుక్తంగా జరిగింది. పీఠాధిపతి శ్రీ స్వరూపాందేంద్ర సరస్వతీ ఆశీర్వాదంతో బాల స్వామి పర్యవేక్షణలో ఉదయం నుంచి ప్రారంభమైన వార్షకోత్సవ వేడుకల్లో దీక్షాధారణలు, గణపతి పూజ, పుణ్యాహ వాచన, పంగవ్యప్రాసన, అగ్నమధనం, లక్ష్మీగణపతి హోమం, యజుర్వేద సహిత హోమాలు నిర్వహణతో విశాఖ శ్రీ శారదా పీఠం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుని భక్తజనులకు కన్నులపండువు చేసింది. స్వరూపానందేంద్ర స్వామి అనుగ్రహ ప్రసంగం చేశారు. నిష్ణాతులైన పండితులకు స్వర్ణ కంకణధారణ చేశారు. ఇక్కడి నూతన స్వర్ణ మండపంలో శ్రీ శారదా చంద్రమౌళేశ్వరులకు విశేష అభిషేక అర్చలను జరిపారు. బాలసరస్వతీ నాట్య బృందం సభ్యులుచే సంప్రదాయ నృత్య ప్రదర్శనలూ భక్తులు తిలకించారు. పీఠం ట్రస్టీలు సన్యాసిరావు, ప్రకాశరావు, చల్లా రామారావు, శ్రీనివాస్, పీఠం ధర్మాధికారి జి. కామేశ్వర శర్మ, ఆస్థాన పండితులు కృష్ణశర్మ, వ్యాపార వేత్త తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

# పద్మావత్‌కు ఛాందస సెగ!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించలేదు. కానీ అత్యంత క్రూరుడైన మహ్మదీ య చక్రవర్తి ఖిల్జీ, పద్మావతిల మధ్య ఓ పాటను చిత్రీకరిస్తున్నారన్న వార్త వార్ని ఆవేశానికి గురి చేసింది. దీంతో రాజ్‌పుత్రులు రెచ్చిపోయారు. కర్నిసే న పేరిట చిత్రానికి వ్యతిరేకంగా ప్రదర్శనలిచ్చారు. షూటింగ్ జరుగుతున్న సమయంలోనే రెండుసార్లు దాడులు చేశారు. ఓ సారి షూటింగ్ నిమిత్తం వేసిన టెంట్‌లను దగ్ధం చేశారు. ఇలాంటి పాటలేవీ తమ చిత్రంలో లేవని ఎంతగా దర్శక, నిర్మాతలు స్పష్టం చేసినా వీరి ఆగ్రహం చల్లారలేదు. చివరకు ఈ చిత్రా న్ని ప్రదర్శించేందుకు వీల్లేదంటూ పట్టుబట్టారు. రాజ స్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో ప్రభుత్వం కూడా దీనిపై స్టేలు విధించింది. ఇటీవల ముగిసిన గుజరాత్ ఎన్నికల్లో పద్మావతి చిత్రం కూడా ఓ ప్రధాన ప్రచా రాస్త్రంగా మారింది. ఉత్తర భారతం మొత్తం ఈ వివాదంతో కొన్ని రోజులు స్థంభించిపోయింది. ఇప్పటికే పలుసార్లు చిత్రాన్ని వాయిదావేశారు. చివరకు సర్వో న్నత న్యాయస్థానానిక్కూడా ఈ వివాదం చేరింది. సుప్రీంకోర్టు అయితే ఏకంగా ఈ చిత్రాన్ని బ్యాన్ చేయడం కుదరదంటూ తేల్చిచెప్పింది. అవసరమైన రక్షణ చర్యలు చేపట్టే బాధ్యత రాష్ట్రాలదేనని స్పష్టం చేసింది. ఓ వైపు అభ్యంతరకర సన్నివేశాల్లేవు.. రాజ్‌పుత్‌ల మనోభావాల్ని ఏమాత్రం దెబ్బతీసే ప్రయత్నం జరగలేదంటూ నిర్మాణ సంస్థలు పదే పదే మొత్తుకు న్నాయి. కానీ వివాదాం మాత్రం చల్లారలేదు. ఆఖరకు దేశ చరిత్రలోనే ఇంతవరకు ఏ చిత్రానికి వేయని రీతిలో పద్మావత్‌కు సరికొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో చిత్రంలోని దృశ్యాల్లేవు. పోస్టర్ పొడవున వివరణలే నిండిపోయాయి. ఈ చిత్రం సూఫీకవి జయాసి రచనకు మక్కి మక్కి కాపీ అని ఈ పోస్టర్లలో స్పష్టం చేశారు. అలాగే ఖిల్జీ, పద్మావతిల మధ్య ఎలాంటి స్వప్న సన్నివేశాలు గాని, డ్యూయెట్లుగాని లేవని స్పష్టం చేశారు. రాజ్‌పుత్‌ల ధైర్య సాహసాల్ని ప్రపంచానికి తెలియజెప్పే ప్రయత్నాన్ని ఈ చిత్రంలో చేశామన్నారు. చిత్రంలో రాణిపద్మావతి పట్ల అత్య ంత వినయవిధేయతలు, గౌరవ భావాలు ప్రదర్శిం చామన్నారు. సెన్సార్ సూచించిన ఐదు సవరణలను చేసామన్నారు. ఈ చిత్రం భారతీయులందరూ గర్వించే విధంగా ఉంటుందంటూ ఈ పోస్టర్‌లో వివరణి చ్చారు. ఇలాంటి పోస్టర్ రిలీజవడం దేశ సినీ చరిత్రలో ఇదే ప్రథమంగా పరిశీలకులు పేర్కొంటున్నారు. కాగా ఇప్పటికే ఈ చిత్రం ప్రీమియర్‌లు విడుదలయ్యాయి. దీన్ని ఒక చిత్రంగాగాక ఓ కాన్వాస్‌పై వేసిన పెయింట్ తరహాలో దర్శకుడు సంజయ్‌లీలా బన్సాలీ తీర్చిదిద్దినట్లు ప్రాథమిక రివ్యూలు వెల్లడించాయి. చరిత్రనెక్కడా వక్రీకరించలేదని, ఈ చిత్రంలో ఎవరి మనోభావాలకు విఘాతం కలగలేదని కూడా రివ్యూ లు తేల్చాయి. ఒక్కసారిగా థియేటర్లోని ప్రేక్షకులంతా 13వ శతాబ్దంలోకి తరలిపోయామన్న భావన వ్యక్తం చేసేలా చిత్రమున్నట్లు విమర్శకులు తేల్చారు. దీన్నొక అత్యద్భుత, సాంకేతిక విజువల్ వండర్‌గా పేర్కొ న్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు పద్మావతి చిత్రం తన పేరును పద్మావత్‌గా మార్చుకుని గురువారం ప్రపంచవ్యాప్తంగా విడుదలౌతోంది. అయితే గుజరాత్‌లో మాత్రం ఈ విడుదలను నిలిపేశారు. అక్కడి మల్టీప్లెక్స్ థియేటర్ల సంఘ ప్రతినిధులు ఈ చిత్రాన్ని విడుదల చేసేదిలేదంటూ భీష్మించారు. అయినప్పటికీ గుజరాత్‌లో మంగళవారం నుంచి థియేటర్ల దహనకాండ సాగుతోంది. కొన్ని థియేటర్ల ముందున్న వాహనాల్ని కర్ణిసేన సభ్యులుగా భావి స్తున్న దుండగులు కొందరు దగ్ధం చేసారు. ఇలా చిత్రాన్ని ప్రదర్శిస్తే థియేటర్లకు కూడా నష్టం తప్పదని హెచ్చరించారు.

గతంలో విశ్వరూపం, ఉత్తమ విలన్ వంటి తమిళ చిత్రాలు కూడా అనేక వివాదాల్ని ఎదుర్కొన్నా యి. ముఖ్యంగా కులమత విబేధాలు రాజేస్తాయన్న ఆరోపణలకు గురయ్యాయి. చివరకు న్యాయస్థానాల ప్రమేయంతోనే ఈ చిత్రాలు విడుదల కావాల్సొచ్చిం ది. పద్మావత్ విషయంలో మత ఛాందసం మరింత తీవ్రంగా తన ప్రభావాన్ని చూపించింది. బన్సాలీ గతంలో అత్యద్భుత చిత్రరాజాల్ని తీర్చిదిద్దారు. చరిత్రను కళ్ళ ముందు తీర్చిదిద్దారు. మతాలు, ప్రాంతీయత భావాలు ఇకముందు కూడా చిత్ర కథలో కథనాల్ని మనోభావాల పేరిట నియంత్రించే ప్రయ త్నం సాగితే భవిష్యత్‌లో చారిత్రక, యదార్ధ నేపథ్యం గల చిత్రాల నిర్మాణానికి మరెవరూ సాహసించరని విమర్శకులు వాపోతున్నారు.

## బాబు అంతా షో...
# ఆయన్ను నమ్మొద్దు

- గడిచిన నాలుగు సంవత్సరాల్లో సీఎం చేసిందేమీ లేదు
- ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేర్చలేకపోయారు
- వైసీపీ అధికారంలోకి వస్తే పేదలందరికీ న్యాయం
- మెరుగైన ఉచిత వైద్యాన్ని నూరుశాతం అందిస్తాం
- నాయుడుపేట బహిరంగసభలో వైఎస్ జగన్



**నెల్లూరు, ప్రభన్యూస్ బ్యూరో:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంతా షో చేస్తూ... మరోసారి రాష్ట్రప్రజలను మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని దయచేసి ఆయన మాటలు నమ్మి మరోసారి నష్టపోవద్దని... వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఆయన బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో తన రెండవరోజు పాదయాత్రను పెళ్ళకూరు మండలం రాజుపాళెం నుంచి ప్రారంభించారు. ఉదయం 9 గంటలకు రాజుపాళెం నుంచి సిరసంబేడు మీదుగా నాయుడుపేట పట్టణానికి చేరుకున్నారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక బస్టాండుసెంటరులో ఏర్పాటుచేసిన బహిరంగసభలో ఆయన ప్రజలనుద్దేశించి సుదీర్ఘంగా ప్రసంగించారు. కిక్కిరిసిన అభిమానుల మధ్య ఆయన తనదైన శైలిలో మరోసారి సీఎంపై విమర్శల వర్షం కురిపించారు. గడిచిన నాలుగు సంవత్సరాల్లో టీడీపీ పరిపాలనపై నిప్పులు చెరిగారు. అభివృద్ధి చేయడం చేతకాని బాబు జిమ్మిక్కులు చేస్తూ మరోసారి రాష్ట్ర ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నం చేయబోతున్నారన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు కావస్తున్నా కనీసం అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టును కూడా నిర్మించలేకపోయాడని, కేవలం 22 సార్లు విదేశీ పర్యటనలకువెళ్ళి రాష్ట్రాన్ని సింగపూర్, మలేషియా, చైనా తరహాలో అభివృద్ధి చేస్తానని గొప్పలు చెబుతున్నాడే తప్ప ఆచరణలో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదన్నారు. సినీ నిర్మాత రాజమౌళితో రాజధాని నిర్మాణానికి సలహా తీసుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సినిమా సెట్టింగ్‌కి, రాజధాని నిర్మాణానికీ అసలు పోలిక ఉందా అని ఆయన ఈ సందర్భంగా బాబుపై ధ్వజమెత్తారు. గతంలో రాజశేఖర్ రెడ్డి జిల్లాలో ఎస్ఈజెడ్‌లను నెలకొల్పితే టీడీపీ వారు సాధించినట్లుగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీసిటీ, మేనకూరు, మాంబట్టు సెజ్‌లు గతంలోనే వైఎస్ ప్రారంభించారని అయితే అందులో స్థానికులకు ఉపాధి కల్పించి నిరుద్యోగులకు అండగా ఉండాల్సిన తెలుగుదేశం ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ప్రాధాన్యతనిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా అధికారంలోకి వస్తే నిరుద్యోగులందరికీ ఉపాధి కల్పించడంతో పాటు పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పి వాటిలో 75 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇస్తామన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యం అందేలా మార్పులు చేస్తామన్నారు. రాష్ట్రంలోనే కాక పొరుగు రాష్ట్రాల్లో కూడా ఈ పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందేలా చూస్తామన్నారు. ఎటువంటి రోగానికైనా వెయ్యి రూపాయలు దాటితే ఖచ్చితంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం అందించేలా చర్యలు చేపడుతామన్నారు. అలాగే చికిత్స అనంతరం రోగులకు విశ్రాంతి అవసరమైతే ఆ సమయంలో కూడా వారికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తామన్నారు. ప్రధానంగా వరి పంటకు ఎంతో ప్రాధాన్యత కలిగిన నెల్లూరుజిల్లాలో కేవలం ప్రభుత్వం తీసుకున్న తప్పుడునిర్ణయాల వల్ల వరి విస్తీర్ణం సగానికి సగం పడిపోయిందన్నారు.

గతంలో లక్ష హెక్టార్లలో పండించే వరి నేడు 39వేల హెక్టార్లకే పరిమితమైందన్నారు. అందుకు కారణం సోమశిల జలాలు సూళ్ళూరుపేట నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో అందించలేకపోవడమే అని ఆయన ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అలాగే పులికాట్ అభివృద్ధిని గాలికి వదిలేశారని ఫలితంగా 30 వేల మంది మత్స్యకారులు తమ వృత్తికి దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. పులికాట్ ముఖద్వారాల అభివృద్ధిపై ఎప్పటికప్పుడు ప్రకటనలు చేస్తున్నారే తప్ప నేటి వరకు పూడిక తీసిన దాఖలాలే లేవని ఆయన విమర్శించారు. అంతకుముందు ఆయన పాదయాత్రలో భాగంగా పై రెండు గ్రామాల్లో ప్రజలను పేరుపేరునా పలకరిస్తూ నవరత్నాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ముస్లిం మైనారిటీ నాయకులు జగన్‌ని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్ రెడ్డి, వరప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే కలివేటి సంజీవయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## అలనాటి నటి కృష్ణకుమారి ఇకలేరు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ సినీ బ్యూరో:** అలనాటి ప్రముఖ నటి కృష్ణకుమారి బుధవారం ఉదయం తుది శ్వాస విడిచారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని తన నివాసంలో కన్ను మూశారు. మరో ప్రముఖ నటి షావుకారు జానకికి స్వయాన సోదరి అయిన కృష్ణకుమారి 1933 మార్చి 6న బంగాల్‌లో జన్మించారు. 1951 లో ఆమె సినీరంగ ప్రవేశం జరిగింది. నవ్వితే నవరత్నాలు ఆమెకు తొలి చిత్రం. పల్లెపడుచు, బంగారు పాప, ఇలవేల్పు, భార్యాభర్తలు, కులగోత్రాలు, లక్షాధికారి, బందిపోటు వంటి చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళం వంటి భాషల్లో దాదాపు 110 చిత్రాల్లో ఆమె నటించారు. ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు తదితర ప్రముఖ హీరోల సరసన పలు చిత్రాల్లో నటించడంతో పాటు తనదైన అభినయంతో ఆమె ప్రేక్షకులను మెప్పించారు. కృష్ణకుమారి మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తంచేశారు. ఆమె అంత్యక్రియలు గురువారం బెంగళూరులో జరగనున్నట్లు సమాచారం.

# మరింత పటిష్టంగా సమర్థ ఇంధన కార్యక్రమం

- ఎనర్జీ స్టార్ బిల్డింగ్‌లుగా ప్రభుత్వ భవనాలు
- గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో ప్రాథమికంగా అమలు
- 50 శాతం విద్యుత్ మిగులు లక్ష్యం
- పెండింగ్ విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించండి
- సీఎస్ దినేష్‌కుమార్



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌లో సమర్థ ఇంధన కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా అమలు చేసేందుకు ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ (ఈఈఎస్ఎల్), ఎంవోపీ, భారత ప్రభుత్వం కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలన్నింటినీ దశల వారీగా ఎనర్జీ స్టార్ బిల్డింగ్‌లుగా తయారుచేస్తారు. ఇందులో భాగంగా మొదటి దశ లో రాష్ట్రంలోని ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ శాఖల్లోని పాఠశాలలు, వసతి గృహాలను ఎన ర్జీ స్టార్ బిల్డిం గ్‌లుగా మార్చనున్నారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్, ఈఈఎస్ఎల్ ఎండీ సౌరభ్ కుమార్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ దినేష్ పర్చూరి, ఈఈఎస్ఎల్ అధికారులు, రాష్ట్ర గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖలు ఏపీసీడ్ కోతో త్రైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్నాయి. గిరిజన సంక్షేమ శాఖలో రూ.11.35కోట్ల వ్యయంతో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన చేసేందుకు నిర్ణయించారు. దీని ద్వారా ఏడాదికి 12.14 మిలియన్ యూనిట్ల మేర ఆదా చేసి రూ. 8.5 కోట్ల మేర ఆర్థికంగా లబ్ది పొందాలని నిర్ణయించింది. ఏపీ సీడ్‌కో సమన్వయంతో ఎనర్జీ స్టార్ బిల్డింగ్ కార్యక్రమం చేపట్టడం ఒక మంచి పరిణామమని ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్‌చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ భవనాలను అనుసంధానించడం ద్వారా విద్యుత్ బిల్లుల్లో సాలీనా 30 శాతం మేర తగ్గించే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖలో 750 భవనాల్లో ఈ సమర్థ ఇంధన భవనాలుగా తయారుచేయాలని గుర్తించామని చెప్పారు. ఇందుకోసం రూ. 11.35 కోట్లమేర ఖర్చుకాగలదని అంచనా వేసిన ట్లు తెలిపారు. ఈ విధంగా చేయడం ద్వారా 50 శాతం మేర విద్యుత్ ఆదా చేయవచ్చని ప్రాథమికంగా అంచనా వేసిటన్లు తెలిపారు. రాష్ట్రప్రభు త్వంలోని వివిధ శాఖల నుండి దాదాపు రూ. 3 వేల కోట్ల మేర విద్యుత్ బకాయిలు న్నాయని, ఈ పరిస్థితుల్లో డిస్కంలు నాణ్యమైన విద్యుత్ అందించడం కష్టసా ధ్యమవుతుందని చెప్పారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రంలోని అన్ని శాఖలు తమతమ విద్యుత్ బకా యిలను వెను వెంటనే డిస్కంలకు చెల్లించాలని ఆదేశించిన సంగతిని దినేష్ కుమార్ ప్రస్తావించారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం నిర్ణయిం చిన సమర్థ ఇంధన పొదుపుచర్యలను పాటిస్తూనే సంబంధిత శాఖల అధిపతులు, కలెక్ట ర్లు తమ తమ శాఖల పరిధిలో పెండింగ్ బిల్లులను సత్వరమే చెల్లించేలా చర్యలు తీసు కోవాలని సూచించారు. అంతే కాకుండా అన్ని శాఖల్లోనూ ఎనర్జీ కన్జర్వేషన్ సెల్స్ ఏర్పాటుచేయాలని తెలిపారు. ఏపీ సీడ్‌కో మరియు విద్యుత్ శాఖలను సమన్వయప రుస్తూ సమర్థ ఇంధన పాలసీని పటిష్టంగా అమలు పర్చేందుకు ఒక నోడల్ అధి కారిని నియమించాలన్నారు.

ఈ విధంగా చేయడం ద్వా రా ఎటువంటి ఆర్థికపరమై న లావాదేవీలు లేకుండానే సమర్థ ఇంధ న అమలు చేయడం సాధ్యమవుతుందని చెప్పారు. దేశంలోనే అత్యం త శక్తి వంతమైన రాష్ట్రంగా ఏపీని తయారు చేయాలనే ముఖ్యమంత్రి ఆశయాన్ని సాధించేందుకు ఈ విధానం ఎంతగానో ఉప కరిస్తుందని దినేష్ కుమార్ స్పష్టంచేశారు. ఈఈఎస్ఎల్ ఎండీ సౌరబ్ కుమార్‌మాట్లాడుతూ, ఈఈఎస్ఎల్, భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్ట డం శుభ పరిణామమన్నారు. దీని ద్వారా సమర్థ ఇంధన కార్యకలాపాల నిర్వహనలో ఏపీకి దేశంలోనే గుర్తింపు వస్తుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జాతీయ స్థాయి లో ఉజాలా, ఏజీడీఎస్ఎమ్, పవన్, ఈఈ ట్యూబ్ వంటి సమర్థ ఇంధన పద్ధతులను ఈఈఎస్ఎల్ సహకారంతో విజయవంతంగా అమలు చేస్తున్న సంగతిని అం దరూ గుర్తెరగాలన్నారు. ఏపీలో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు తో జాతీయ స్థాయిలో సమర్థ ఇంధన పద్ధతికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. బుధవారం జరిగిన ఈ ఒప్పంద పత్రాలపై గిరిజన సంక్షేమ శాఖ తరపున సాంఘీక సంక్షేమ శాఖ కార్య దర్శి శ్రీరాములు, దక్షిణ భారత ఈఈఎస్ఎల్ ఇన్‌ఛార్జి సావిత్రి సింగ్, విజయవాడ ఈఈఎస్ఎల్ రీజనల్ మేనేజర్ శశికాంత్, ఏపీసీడ్‌కో అధికారులు బి శ్రీలక్ష్మి, జి రమేష్ బాబులు సంతకాలు చేశారు.

## ఉక్కు ఉద్యమానికి
# బీజం పడింది ప్రొద్దుటూరులోనే

- స్టీల్ ప్లాంట్ సాధన సమితి అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి
- మార్చ్‌ఫర్ స్టీల్ ప్లాంట్ పేరుతో భారీ ర్యాలీ




**ప్రొద్దుటూరు, ప్రభన్యూస్:** కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని విభజన చట్టంలో పేర్కొన్నారని, కానీ ప్రభుత్వాలు ఆదిశగా గత నాలుగు సంవత్సరాలుగా మొగ్గు చూపకపోవడంతో ఉక్కు ఫ్యాక్టరీ కోసం శాంతి యుత ఉద్యమాలు నిర్వహించాలనే తలంపుతో శాంతియుత ఉక్కు ఉద్యమం ప్రొద్దుటూరు కేంద్రంగా ప్రారంభమైందని స్టీల్ ప్లాంట్ సాధన సమితి అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో స్టీల్ ప్లాంట్ సాధన సమితి ఆధ్వర్యంలో మార్చ్‌ఫర్ స్టీల్ ప్లాంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన బ్రాంచి వద్ద నుండి ప్రారంభమై గాంధీరోడ్డు, విజయకుమార్ సర్కిల్, టి.బి.రోడ్డు, రాజీవ్‌సర్కిల్, శివాలయం రోడ్డు మీదుగా పుట్టపర్తి సర్కిల్ వరకు సాగింది. ఈ ర్యాలీలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు, వ్యాపారులు, రైతులు, అన్ని వర్గాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలిపారు. అనంతరం పుట్టపర్తి సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో స్టీల్ ప్లాంట్ సాధన సమితి అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటైతే కడప జిల్లాలోనే కాక సీమలోని నాలుగు జిల్లాల యువత ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు విభజన చట్టంలోని హామీనే అని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ గురించి రాయలసీమ ప్రజా ప్రతినిధులు చట్టసభల్లో ప్రస్తావించి ఉక్కు ఫ్యాక్టరీ కోసం పోరాటం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సీమ యువత ఉపాధి, బంగారు భవిష్యత్తును గురించి ఆలోచించే ప్రొద్దుటూరు నుండి తాను స్టీల్ ప్లాంట్ కోసం శాంతియుత ఉద్యమాన్ని ప్రారంభించానని పేర్కొన్నారు. గతంలో తాను ఈ స్టీల్ ప్లాంట్ సాధన సమితిని కేవలం 10 మందితో ప్రారంభించానని, ప్రస్తుతం తనకు వేలాది మంది ఉక్కు సైనికులు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఇక్కడి ప్రజల, యువత ఆకాంక్షస్టీల్ ప్లాంట్ అని ప్రభుత్వాలు ఇకనైనా ముందుకు వచ్చి స్టీల్ ప్లాంట్‌ను కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ సాధన సమితి ఉపాధ్యక్షులు అమరనాథరెడ్డి, కార్యదర్శి ఖలందర్, యువజన విభాగం నాయకులు ఓబుళరెడ్డి, ప్రొద్దుటూరు అంజుమన్ అహలే ఇస్లాం కమిటీ అధ్యక్షులు వి.ఎస్.ముక్తియార్, మైనార్టీ నాయకులు మహమూద్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బుశెట్టి రామ్మోహన్‌రావు, క్రుష్మా రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షులు కుంచం వెంకటసుబ్బారెడ్డి, సాహితీవేత్త జింకా సుబ్రమణ్యం, క్రుష్మా జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ప్రజా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విశ్వశాంతికి అమరావతిలో బౌద్ధ సమ్మేళనం

- ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు విజయవాడలో ఏర్పాటు
- బుద్ధిజంతో రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి
- బౌద్ధ బిక్షువుల అఖండ స్మరణతో ప్రపంచ రికార్డు
- మంత్రి భూమా అఖిలప్రియ



**అమరావతి, ఆంధ్రప్రభ:** విశ్వశాంతికి నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో బౌద్ధ సమ్మేళనం ఏర్పాటు చేశామనీ, సమ్మేళనానికి ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ భిక్షువులు, సన్యాసులు హాజరవుతున్నట్లు పర్యాటక పర్యాటక శాఖా మంత్రి భూమా అఖిల ప్రియ వెల్లడించారు. బుద్ధిజంతో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిల ప్రియ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బౌద్ధ క్షేత్రాలన్నింటినీ అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా బౌద్ధ భిక్షువులతో అమరావతిలో భారీ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా విజయవాడలో వచ్చేనెల 3 నుంచి 5 వరకు మూడ్రోజుల పాటు జరిగే బౌద్ధ భిక్షువుల సమ్మేళనంలో పలు కార్యక్రమాలను చేపట్టడం జరుతుగుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఫిబ్రవరి 4న రెండు వేలమంది బౌద్ధ భిక్షువులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్లో అఖండ నామస్మరణతో ప్రపంచ రికార్డు సృష్టించనున్నట్లు మంత్రి వివరించారు. విశ్వశాంతి కోసం ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు చెప్పారు. బౌద్ధ ధర్మానికి పుట్టినిల్లు అయిన అమరావతి కేంద్రంగా విజయవాడలో జరిగే మూడ్రోజుల కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి భారీగా బౌద్ధ భిక్షువులు, ప్రముఖులు తరలివస్తారన్నారు. వీరంతా అమరావతి బౌద్ధస్థూపంతోపాటు నాగార్జునకొండ, తొట్లకొండ, అనుపు వంటి బౌద్ధారామాలన్నీ సందర్శించడంతో విదేశీ టూరిజానికి ఇది ఎంతో ఉపకరిస్తుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 3న ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయనీ, ఇందులో బౌద్ధ గురువుల సందేశాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 4న విశ్వశాంతి కోసం బౌద్ధ భిక్షువులు ప్రార్థనలు చేస్తారనీ, ఇందులో 2 వేల మంది బౌద్ధులు పాల్గొంటారని చెప్పారు. కొలంబో నుంచి తొలి బౌద్ధ సన్యాసిని భిక్కున్ని కుసుమ కనాడా వస్తు న్నారనీ, అలాగే సింగపూర్ నుంచి సిరిరామ, యూఎస్ఏ నుంచి ప్రజ్వాల్ రత్న, ముంబయి నుంచి రాజేష్ ధాబ్రే, చైనా, బుద్ధగయ, ధర్మశాల, బెంగుళూర్ తదితర ప్రాంతాల నుంచి కూడా బౌద్ధ సన్యాసులు హాజరవుతారని వివరించా రు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు హాజరై ప్రార్థనల్లో పాల్గొనాలని కోరారు.

నవ్యాంధ్రప్రదేశ్‌లో పర్యాటకశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బౌద్ధ ఉత్సవాలకు ప్రజలంతా సహకరించాలన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పలు కార్యక్రమాల గురించి వివరించారు. కర్నూలులో ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాతో భారీ సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అలాగే అహోబిలంలో కూడా నరసింహస్వామి ఉత్సవాలను జరుపుతామన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు అలిబాబా సంస్థతో ఫిబ్రవరి 10న ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బౌద్ధ క్షేత్రాల్లో మౌళిక వసతులు కల్పించేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించిందన్నారు. సమావేశంలో పాల్గొన్న పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా మాట్లాడుతూ అమరావతి బౌద్ధ ఉత్సవాల ద్వారా విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పర్యాటక శాఖలో అభివృద్ధి రేటు 11 శాతం పెరిగిందన్నారు. విజయవాడలో నిర్వహించే బౌద్ధ ఉత్సవాలకు హుబ్లీ, ధర్మశాల, బుద్ధగయ, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చే బౌద్ధ భిక్షువుల కోసం 100 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటక శాఖ ఎండీ హిమాన్షు శుక్లా తెలిపారు.

# వైభవంగా లేపాక్షి ఉత్సవాలు

- ముగింపు వేడుకలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ప్రత్యేక ఆకర్షణగా హేమమాలిని, శివమణి: ఎమ్మెల్యే బాలకృష్ణ



ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

**అమరావతి, ఆంధ్రప్రభ:** గతేడాది కంటే ఏమాత్రం తీసిపో కుండా లేపాక్షి ఉత్సవాలను నిర్వహించాలని హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ సూచించారు. గతేడాది కంటే సాంస్కృతిక ఉత్సవాల్లో కొత్తదనం కనిపించాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా లేపాక్షి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతపురం జిల్లా లేపాక్షిలో మార్చి 9,10 తేదీల్లో రెండు రోజుల పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఉత్సవాల కార్యాచరణ, ప్రణాళికపై విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం పర్యాటక అధికారులు, అనంతపురం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో బాలకృష్ణసమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేపాక్షిలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా 20 గదులకు తక్కువ కాకుండా వసతి గృహాన్ని నిర్మించాలని పర్యాటక అధికారులకు సూచించారు. ఇందుకు 2017-18 బడ్జెట్‌లో అవసరమైన నిధులను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండో రోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు ఏ ఒక్కరికీ ఇబ్బంది లేని రీతిలో ఆహ్లాదకరమైన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కార్యక్రమానికి ముందుగా జలహారతి నిర్వహించి వేడుకలు ప్రారంభించాలని పేర్కొనగా సమావేశం అంగీకారం తెలిపింది. పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ సంప్రదాయక విలువలు పాటిస్తూనే లేపాక్షి ఉత్సవాలను వైవిధ్యభరితంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో తొలి రోజు ప్రముఖ సినీనటి హేమమాలిని, రెండో రోజు శివమణి పాల్గొనే విధంగా చర్యలు చేపట్టామన్నారు. లేపాక్షి ఉత్సవాల్లో సినీతారలు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని చెపుతూ ఇప్పటికే మహేష్‌బాబు, తమన్నా తదితరులను సంప్రదించామన్నారు. వారు వచ్చేది లేనిదీ ఇంకా తెలియజేయలేదని ఆయన చెప్పారు. కార్యక్రమాన్ని ఐదు జోన్లుగా విభజించి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ మేనేజింగ్‌డైరెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ మొదటి రోజు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానుండగా, రెండో రోజు ముగింపు కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్, అనంతపురం జాయింట్ కలెక్టర్ రమామణి, పర్యాటక, సాంస్కృతి శాఖ ఆర్‌డి జి.గోపాల్, ఇఇ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### వివాదం రేపిన ఎమ్మెల్యే బాలకృష్ణ సమీక్ష
### ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చొని సమీక్ష నిర్వహణ



నందమూరి బాలకృష్ణ ఏమి చేసినా సంచలనమే. సినిమా అయినా, రాజకీయమైనా బాలకృష్ణకు ఒకటే. అటువంటి మరో సంచలనానికి బాలకృష్ణ తాజాగా బుధవారం తెరలేపారు. ఇంతకీ నందమూరి నటసింహం చేసిన సంచలనమేమిటంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుర్చీలో కూర్చొని అధికారులతో సమీక్ష చేయడం. ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలోకి బాలకృష్ణ వెళ్లారు. మామూలుగా అయితే సీఎం లేనప్పుడు క్యాంపు కార్యాలయం మూసివేసి ఉంటుంది. సెక్యూరిటీ ఎవరినీ లోపలికి అనుమతించరు. అటువంటిది బాలకృష్ణ సీఎం ఛాంబర్‌లో లేపాక్షి పుస్తకాలపై సమీక్షపెట్టారు. ఆ సమీక్షకు బాలకృష్ణ అధ్యక్షత వహించగా రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖా మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావుతోపాటు పలువురు ఐఏఎస్ అధికారులు కూడా హాజరయ్యారు.

క్యాంపు క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించిన బాలకృష్ణచంద్రబాబు కూర్చొనే అధికారిక కుర్చీలో కూర్చొని సమీక్ష ప్రారంభించారు. ముఖ్యమంత్రి కూర్చొని సమీక్షలు నిర్వహించే సీట్లో బాలకృష్ణ కూర్చోవడాన్ని చూసి ఉన్నతాధికారులు ఖంగుతిన్నారు. ఏం చెప్పాలో వారికి అర్థం కాలేదు. ఇంతలో మంత్రి దేవినేని అక్కడకు వచ్చారు. సీఎం కుర్చీలో కూర్చొన్న బాలకృష్ణను చూసి మంత్రికూడా ఏమీ మాట్లాడలేక పోయారు. మామూలూగా అయితే ఓ ఎమ్మెల్యే అధికారులతో సమీక్షచేయడం సాధ్యం కాదు. సమీక్షలను కేవలం ముఖ్యమంత్రి, మంత్రులు మాత్రమే చేస్తారు. ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడాలంటే మంత్రుల సమీక్షల్లోనే మాట్లాడాలి. నియోజకవర్గంలో అయితే అధికారులతో మాట్లాడవచ్చు. నిజానికి బుధవారం నిర్వహించిన సమీక్షపర్యాటకశాఖకు సంబంధించినది. దీనిని మంత్రి అఖిల ప్రియ చేయాల్సి ఉంది. కానీ దానికి భిన్నంగా బాలకృష్ణ సమీక్ష చేయడం, దానికి మంత్రి దేవినేనితోపాటు ఇతర ఉన్నతాధికారులు హాజరవడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. కాగా, ఈ అంశంపై స్పందించేందుకు ఉన్నతాధికారులు సుముఖత వ్యక్తం చేలేదు. ముఖ్యమంత్రి కుర్చీ కాకుండా వేరే కుర్చీలో కూర్చొని మాత్రమే సమీక్ష చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి.

## సంతాపం

సినీనటి కృష్ణకుమారి మృతి దురదృష్టకరమని ఆయన అన్నారు. తన తండ్రిగారు సహా అనేక మంది గొప్ప నటులతో ఆమె నటించినట్లు పేర్కొన్నారు. తాను బెంగుళూరు వెళ్లినప్పుడల్లా ఆమెను కలిసేవాడినని చెపుతూ ఆమె మృతి పట్ల తన ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
గురువారం 25 జనవరి 2018

# మోడీ గళంతో కదలిక!

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదికపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ చేసిన ప్రసంగం అందరిలో కదలిక తెచ్చింది.ఆలోచనల్లో పడవేసింది. అంతర్జాతీయంగా మానవాళి మనుగడను సవాల్ చేస్తున్న ఉగ్రవాదం ఎంత ప్రమాదకరమైనదో, సంపన్న దేశాలు అనుసరిస్తున్న స్వీయ రక్షణ విధానాలు కూడా అంతటి ప్రమాదకరమైనవేనన్నదే ఆయన ప్రసంగం అంతరార్థం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన అంతర్జాతీయ సంస్థలు ఏడు దశాబ్దాలు దాటినా కొన్ని దేశాల అదుపాజ్ఞలలో కొనసాగడం నానాటికీ విస్తరిస్తున్న మానవ నాగరికతకు చేటు తెస్తాయన్న వాస్తవం ఆయన హెచ్చరికలో ఉంది. ముఖ్యంగా, ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు ఇప్పటికీ అగ్రరాజ్యం, దాని మిత్ర దేశాల అధీనంలోనే ఉన్నాయి. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఈ సంస్థల్లో ప్రాతినిధ్యం లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న లోటు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం మన దేశం సాగిస్తున్న యత్నాలను చైనా మినహా ఆ మండలిలో శాశ్వత సభ్యత్వం గల దేశాలన్నీ స్వాగతిస్తున్నాయి. పాకిస్తాన్ కోసం చైనా వ్యతిరేకిస్తోంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి వర్ధమాన దేశాల పట్ల చూపుతున్న వివక్ష కూడా ప్రపంచ ఆర్థిక వేదికపై చర్చించాల్సిన ప్రధానాంశం. అభివృద్ధి చెందిన దేశాల అజమాయిషీలో తయారైన అజెండా ప్రకారమే అక్కడ చర్చించడం గడిచిన నలభై ఎనిమిది సంవత్సరాల నుంచి సాగుతున్న తతంగం. ఈ వేదికపై అభివృద్ధి చెందిన, సంపన్న దేశాల నాయకుల ప్రసంగాలు, ఈ వేదికపై ఆమోదించే తీర్మానాలు షరా మామూలుగానే ఉంటున్నాయి. మోడీ ప్రస్తావించిన ఉగ్ర వాదం, స్వీయ రక్షణ విధానం, భూతాపం ఈనాడు యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తున్న ప్రధాన సమస్యలు. ఆయన దేశాల మధ్య పెరుగుతున్న అసమానతల గురించి ప్రస్తావించారు. తన ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) గడిచిన ఇరవై సంవత్సరాల్లో బాగా పెరిగిందన్న మాట నిజమే కానీ, అదే సందర్భంలో అసమానతలు పెరిగిన వాస్తవాన్ని ఆయన కాదనలేరు. ప్రపంచ వేదికపై అగ్రరాజ్యం, సంపన్న దేశాల విధానాలు వర్ధమాన దేశాల ఎదుగుదలకు ఏవిధంగా గుదిబండగా తయారయ్యాయో వివరించడమే ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రపంచ దేశాల్లో అంతా ఒకటేనన్న భావన కనుమరుగు కావడాన్ని గురించి మోడీ వివరించిన తీరు దావోస్ సదస్సు ప్రతినిధులను ఆలోచింపజేసేదే. ఏవిధమైన ప్రయాణ సౌకర్యాలు, సమాచార మార్పిడి సౌలభ్యాలూ లేనప్పుడే అంతా కలిసి ఉన్నాం. ఇప్పుడు ఇలాంటి సౌకర్యాలు ఎన్ని ఉన్నా ఒంటరి తనాన్ని అనుభవించడం మనిషిలో, దేశాల్లో వచ్చిన మార్పునకు సంకేతం. ఇదే విషయాన్ని ప్రధాని చాలా సూటిగా వివరించారు. భూమి మీద సంపద ఏ కొన్ని దేశాలదో, ఏ కొన్ని ప్రాంతాలదో కాదు. మానవాళి కోసమేనన్న విశ్వజనీన సూత్రాన్ని విస్మరించడంవల్లనే సమస్యలు ఉత్పన్నమవుతున్న మాట వాస్తవం. చమురు ఉత్పత్తులను తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఆ విషయం ప్రస్తావించారు. ఉగ్రవాదం అనేది నాగుపాము వంటిదనీ, ఉగ్రవాదంలో తక్కువ, ఎక్కువ ప్రమాదకరమైనది లేదన్న వాస్తవాన్ని మన దేశం మొదటి నుంచి స్పష్టం చేస్తూనే ఉంది. దానిని గ్రహించడానికి అగ్రరాజ్యమైన అమెరికాకు రెండు దశాబ్దాలు పట్టింది. తనదాకా వస్తే గాని తెలియదన్న చందంగా వ్యవహరించిన అమెరికా పాక్‌ని ఇప్పుడిప్పుడే హెచ్చరిస్తోంది. స్వీయ వాణిజ్య అవసరాల కోసం తలపెట్టిన ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు పాకిస్తాన్‌ని వెనకేసుకొస్తున్న చైనా భ్రమలు తొలగిపోయే రోజు ఎంతో దూరంలో లేదు. ఆర్థికాంశాల పై చర్చించే వేదిక పై ఈ సమస్యల ప్రస్తావన అవసరమా?అన్న సందేహం ఎవరికైనా కలగవచ్చు. ఆధునిక కాలంలో ఇవన్నీ ఒకదానికొకటి ముడిపడి ఉండటం వల్లనే ప్రధాని ప్రస్తావించారు. భూతాపం అంశం కూడా. పారిస్‌లో కుదిరిన ఒప్పందం నుంచి తమ దేశం ఉపసంహరించుకుంటుందన్న ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆర్థిక కోణం నుంచే చేశారు. ఉద్గారాలను తగ్గించేందుకు చర్యలుతీసుకుంటే నిరుద్యోగ సమస్య ఏర్పడుతుందని ఆయన బహిరంగంగానే అన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ప్రాధాన్యం అమెరికన్లకేనంటూ ఆయన పదే పదే స్పష్టం చేయడం కూడా ఆర్థిక కోణం నుంచి చేసిందేనన్నది సుస్పష్టం. ఐసిస్ సంస్థ పోగు చేసిన అపారమైన సంపద ఉగ్రవాదుల దాడుల కోసమేననడానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. ఆర్థికాంశాల్లో దేశాల మధ్య, దేశాల్లోని వివిధ వర్గాల మధ్య అంతరాలు తగ్గినప్పుడే మానవ సమాజం సంక్షోభాల నుంచి విముక్తమవుతుంది. మోడీ ప్రస్తావించిన ఈ 3 అంశాలు ఆర్థిక వేదికపై కదలిక తెచ్చాయి.

# స్వతంత్రతలోనూ సర్వోన్నతమే!

సుప్రీంకోర్టును తెలుగులో సర్వోన్నత న్యాయ స్థానం అని అంటున్నాం. దిగువ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ నెలకొని ఉన్న న్యాయస్థానాల్లో పరిష్కారం కాని కేసులు సుప్రీంకోర్టుకు వెళ్తుంటాయి. న్యాయం కోరే వారికి పరిష్కారానికి చివరి అవకాశం సుప్రీంకోర్టులోనే లభిస్తుంది. ప్రతిదేశంలోనూ సుప్రీంకోర్టు ఉంటుంది. రాజ్యాంగం మూల స్తంభాల్లో ఒకటైన న్యాయవ్యవస్థ సర్వస్వతంత్రమైనది. మన పొరుగున ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో సుప్రీంకోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాలు, తొలగింపులలో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటుంది. పాకిస్తాన్ అధ్యక్షునిగా జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ కొనసాగిన కాలంలో సుప్రీంకోర్టు, న్యాయ మూర్తులను తొలగించే అధికారాన్ని అధ్యక్షునికి దఖలు పడేట్టు రాజ్యాంగాన్ని మార్చి వేశాడు. మన దేశంలో అటువంటి ప్రయత్నాలు ఎమర్జెన్సీ కాలంలో జరిగినా, ప్రజాస్వామ్యవాదుల చైతన్యస్ఫూర్తి వల్ల ఫలించలేదు. మన దేశంలో న్యాయవ్యవస్థకు అంతటి విశిష్టస్థానం ఉంది. కొద్ది రోజుల క్రితం సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన నలుగురు న్యాయమూర్తులు చరిత్రలో కనీ వినీ ఎరుగని విధంగా మీడియా ముందుకు వచ్చి, సుప్రీంకోర్టు పనితీరుపై విమర్శలు చేయడంతో సుప్రీంకోర్టు వార్తల్లోకి వచ్చింది. మన దేశంలో సుప్రీం కోర్టు పూర్వాపరాలను గురించి సింహావలోకనం....

1921 నుంచి 1964 వరకూ మధ్య కాలంలో మన న్యాయవ్యవస్థ గురించి పరిశీలించినప్పుడు పది ముఖ్యమైన సంఘటనలు ప్రస్తావనకు వస్తాయి.ఈ పదింటిని వరుస క్రమంలో పరిశీలించినట్టయితే, మొదటిగా సర్ హరిసింగ్ గౌర్ తీర్మానం గురించి చెప్పుకోవల్సి ఉంటుంది. 1921లో కేంద్ర శాసనసభలో ఆయన ప్రవేశపెట్టిన ఈ తీర్మానంలో స్వదేశీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పాలనా పరంగా మా వ్యవహారాలను మాకు వదిలి వేయమని బ్రిటిష్ పాలకులను కోరడం అప్పుడే ప్రారంభమైంది. భారత జాతీయ నాయకులు కూడా బ్రిటిష్ పాలకులపై అప్పుడే ఒత్తిడి ప్రారంభించారు. భారత దేశంలో కేంద్రీకృత న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం గురించి వారు బ్రిటిష్ పాలకుల దృష్టికి తెచ్చారు.

బ్రిటిష్‌పాలనలో హైకోర్టుల్లో పరిష్కారం కాని కేసులను లండన్‌లోని ప్రీవీ కౌన్సిల్‌కి పంపేవారు. మన న్యాయ వాదులే అక్కడికి వెళ్ళి వాదించేవారు. ఆరోజుల్లో లండన్‌కే కాదు, మరే విదేశానికి వెళ్ళాలన్నా ఓడల్లోనే ప్రయాణం. ఎక్కువ రోజులు పట్టేది. కేసుల పరిష్కారం మరింత జాప్యమయ్యేది. అందువల్ల హైకోర్టుల్లో పరిష్కారం కాని కేసుల విచారణకు దేశంలోనే అత్యున్నత న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఆ రోజుల్లో న్యాయ వాదులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులను బ్రిటిష్ పాలకులకు తీసుకునివచ్చారు. ఆ ప్రయత్నంలో భాగంగానే గౌర్ కేంద్ర శాసనసభలో తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆయనకు మద్దతుగా మరికొందరు వాదించారు. వారి ప్రయత్నాలు ఫలించలేదు. ప్రీవీ కౌన్సిల్ అధికారాలను తగ్గించడం ద్వారా భారత ప్రయోజనాలు మెరుగవుతాయన్న నమ్మకం ఆనాటి నాయకులకు కలగకపోవడమే ఇందుకు కారణం. ప్రీవీ కౌన్సిల్ విశ్వసనీయతకూ, నిష్పాక్షికతకూ పేరొందడంతో దాని పట్ల ఆ నాటి నాయకులకు నమ్మకం ఉండేది.

మరో పరిణామం 1930లో చోటుచేసుకుంది. లండన్‌లో జరిగిన ఇండియన్ రౌండ్ టేబిల్ సమావేశంలో తొలిసారిగా సమాఖ్య స్ఫూర్తి ప్రస్తావన వచ్చింది. భారత దేశంలోని రాష్ట్రాల తరఫు ప్రతినిధి ఈ సమావేశంలో ఈ ప్రస్తావన చేశారు. బ్రిటిష్ పాలనలో ఉన్న భారత దేశంలోని ప్రావిన్స్‌ల(రాష్ట్రా ల) హైకోర్టుల తీర్పులపై అప్పీళ్ళకు భారత



**1921 నుంచి 1964 వరకూ మధ్య కాలంలో మన న్యాయవ్యవస్థ గురించి పరిశీలించినప్పుడు పది ముఖ్యమైన సంఘటనలు ప్రస్తావనకు వస్తాయి.ఈ పదింటిని వరుస క్రమంలో పరిశీలించినట్టయితే, మొదటిగా సర్ హరిసింగ్ గౌర్ తీర్మానం గురించి చెప్పుకోవల్సి ఉంటుంది. 1921లో కేంద్ర శాసనసభలో ఆయన ప్రవేశపెట్టిన ఈ తీర్మానంలో స్వదేశీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పాలనా పరంగా మా వ్యవహారాలను మాకు వదిలి వేయమని బ్రిటిష్ పాలకులను కోరడం అప్పుడే ప్రారంభమైంది.**

దేశంలోనే ఫెడరల్ కోర్టు ఒకదానిని ఏర్పాటు చేయాలని ఆయన ఆ ప్రస్తావనలో కోరారు. రాజ్యాంగాన్ని స్థానిక పరిస్థితులకు అన్వయింపజేయడానికి ఫెడరల్ కోర్టు ఉండాల్సిన అవసరం గురించి ఆయన నొక్కి వక్కాణించారు. ఈ విషయమై స్థూలంగా కుదిరిన అంగీకారం పూర్తిగా ఫెడరల్ పరిమితులతో కేంద్ర ట్రిబ్యునల్ ఏర్పాటుకు నాంది పలికింది. అప్పిలేట్ పరిధి లేకుండా ఫెడరల్ కోర్టు కోసం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా యాక్ట్ ని 1935లో ఆమోదించారు. అప్పిలేట్ అధికారాలను ప్రీవీ కౌన్సిల్‌కే విడిచిపెట్టారు.

మూడో ప్రయత్నంగా 1937లో ఫెడరల్ కోర్టు ప్రారంభోత్సవం భారతీయ న్యాయ వ్యవస్థలో మైలురాయి లాంటిది. ఇద్దరు న్యాయమూర్తులు, ప్రధాన న్యాయమూర్తితో ఈ కోర్టు ఏర్పడింది. దీని పరిధి పరిమితి చాలా స్వల్పం. ఎడతెగని వివాదాల పరిష్కారం కోసం ప్రీవీ కౌన్సిల్‌కి తప్పని సరిగా వెళ్ళాల్సి వచ్చేది. కొద్ది సంవత్సరాల పాటు దీనిని ఎవరూ పరిగణనలోకి తీసుకోలేదు. నాలుగున్నర సంవత్సరాల వ్యవధిలో ఈ ఫెడరల్ కోర్టు 27 నిర్ణయాలను మాత్రమే తీసుకుంది. చాలా కీలకమైన తీర్పులపై దాఖలైన అప్పీళ్ళ జోలికి వెళ్ళలేదు. దేశద్రోహం, ప్రివెంటివ్ డిటెన్షన్, ప్రత్యేక క్రిమినల్ కోర్టుల తీర్పులు, ఆర్డినెన్స్‌ల జోలికి వెళ్ళలేదు. ఈ 27 నిర్ణయాల్లో ఒకటి తప్ప మిగిలిన వన్నీ ఏకగ్రీవమే. ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఉన్న బ్రిటిష్ జాతీయుడు, భారతీయ న్యాయమూర్తులతో కలవడంవల్ల ఇది సాధ్యమైంది. ఈ నిర్ణయాలు ఫెడరల్ కోర్టు నిష్పాక్షికతకూ, స్వేచ్ఛకూ నిదర్శనాలు. ప్రభుత్వాధికారులు ఏకపక్షంగా వ్యక్తుల హక్కుల జోలికి వెళ్ళకుండా నిరోధించినవి వీటిలో ఉన్నాయి. వీటితో ఈ కోర్టు పట్ల ఉన్నతమైన విశ్వసనీయత పెరిగింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో తీసుకున్న నిర్ణయాలు భారత దేశలో న్యాయవ్యవస్థ సర్వోన్నతకు అద్దం పట్టేవిగా ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దాని ప్రభావం ఫెడరల్ కోర్టు పనితీరుపై ఏమాత్రం పడలేదు. రెండేళ్ళ తర్వాత మాత్రం రాజ్యాంగ సభ ప్రీవీ కౌన్సిల్ పరిధి చట్టాన్ని రద్దు చేసింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండేళ్ళ వరకూ ఇందుకోసం ఆగారంటే, ప్రీవీకౌన్సిల్‌తో తెగతెంపులు చేసుకోవడానికి ఎంతో ఆలోచన చేశారన్నది స్పష్టమవుతోంది.

అన్ని కోణాల్లోంచీ పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. భారతీయ న్యాయవ్యవస్థను హడావుడిగా ఏర్పాటు చేయలేదు. భారతీయ న్యాయవ్యవస్థ సర్వోన్నతిని కాపాడేందుకు వీలుగా ఫెడరల్ కోర్టు చట్టంలో మార్పులు చేశారు. ఫెడరల్‌కోర్టు నిర్ణయాలను ప్రీవీ కౌన్సిల్ ఐదు సార్లు మాత్రమే తోసిపుచ్చిందంటే ఫెడరల్ కోర్టును ఎంత స్వతంత్రంగా, సర్వోన్నతంగా తీర్చి దిద్దారో అర్థం చేసుకోవచ్చు.

1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత ఫెడరల్ కోర్టు సుప్రీంకోర్టుగా అవతరించింది. ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులనే సుప్రీంకోర్టులో కొనసాగించినప్పటికీ, పరిధులు, అధికారాలూ కొనసాగించినప్పటికీ, ఫెడరల్ కోర్టుకూ, సుప్రీంకోర్టుకూ ఉన్న పోలికలు చాలా పరిమితమైనవి. సుప్రీంకోర్టు నిర్మాణంలో కూడా మార్పులు చేశారు.

మన న్యాయవ్యవస్థలో ముఖ్యమైన ఏడో పరిణామం....ఎకె గోపాలన్, మద్రాసు స్టేట్ మధ్య నడిచిన కేసుపై సుప్రీంకోర్టు నిర్ణయం. కొత్త రాజ్యాంగాన్ని సుప్రీంకోర్టు ఈ కేసు నుంచే అన్వయించడం ప్రారంభించింది. ప్రాథమిక హక్కుల ప్రమేయం ఉన్న తొలి కేసు కూడా ఇదే. ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టానికి సంబంధించిన తొలి కేసు కూడా ఇదే. దేశంలో ఒక వ్యక్తి దిగువ కోర్టులన్నింటినీ విడిచి పెట్టి తన ఫిర్యాదును నేరుగా సుప్రీంకోర్టుకు నివేదించిన కేసు ఇది. పార్లమెంటు ఆమోదించిన చట్టంలోని కొంత భాగం రాజ్యాంగ విరుద్ధంగా ఉందని సుప్రీంకోర్టు తన అధికారాన్ని వినియోగించి తొలిసారిగా స్పష్టం చేసింది. గోపాలన్ కేసులో సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాన్ని విదేశీ రచయితలు ప్రముఖంగా తీసుకున్నారు.

న్యాయవ్యవస్థలో చోటు చేసుకున్న మరో ముఖ్యమైన పరిణామం దురైరాజన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు. ప్రాథమిక హక్కులు, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రస్తావన ఇందులో ఉంది. సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులను ప్రస్తావించడం వల్ల ఇదిచాలా ప్రాముఖ్యాన్ని కలిగుంది. ప్రాథమిక హక్కులకే తొలి ప్రాధాన్యం ఉందనీ, ఆదేశిక సూత్రాలు దాని తర్వాతేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి ముఖ్యపరిణామం 1955లో రాజ్యాంగం నాలుగో సవరణ అంశానికి సంబంధించింది. ఆస్తిహక్కు పరిరక్షణకు సంబంధించింది. ప్రభుత్వం వ్యక్తుల ఆస్తులను స్వాధీనం చేసుకునే సందర్భాల్లో వాటి అవసరం ఏమేరకు ఉందో రుజువులు సమర్పించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది.

పదో పరిణామం...సుప్రీం కోర్టు రాజ్యాంగంలోని వివిధ అధికరణాలను అన్వయింపజేయడంలో మరింత ఉదారంగా వ్యవహరించడం1950లో ప్రారంభమైంది. రాజ్యాంగాన్నే ప్రమాణంగా తీసుకోవడం అన్ని కేసుల్లోనూ జరిగింది. ప్రాథమిక హక్కుల పరిరక్షణ, ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు మొదలైనవన్నీ రాజ్యాంగం పరిధిలోనే ఉండేట్టు చూడటం సుప్రీంకోర్టు తన పరమావధిగా పరిగణిస్తోంది. రాజ్యాంగాన్ని అన్వయించడంలో ఉదారత కనిపిస్తున్నప్పటికీ, మౌలిక సూత్రాలకు ఏమాత్రం భంగం కలగకుండా చూడటంలో సుప్రీంకోర్టు నిర్వహిస్తున్న పాత్ర అమోఘమైనది. బ్రిటిష్ వారి పాలనలో ఉన్న ఫెడరల్ కోర్టు కంటే భిన్నమైన రీతిలో పని చేస్తూ, తన ప్రాముఖ్యాన్ని నిలబెట్టుకుంటోంది. సుప్రీంకోర్టు పరిధి విస్తృతమైనది అయినప్పటికీ, దాని కన్నుగప్పిన వివాదాలు దాదాపుగా లేవనే చెప్పవచ్చు.

● ఎ.పి. స్వామి.



## పరిణామ సిద్ధాంతం- అధికారిక రాద్ధాంతం

కేంద్ర మానవ వనరుల శాఖ సహాయమంత్రి సత్యపాల్ సింగ్ డార్విన్ పరిణామ సిద్ధాంతం తప్పని సెలవిచ్చారు. దానికి ఆయన తెచ్చిన రుజువేమిటంటే ఆ సిద్ధాంతం చెప్తున్నట్టుగా కోతి నుండి మనిషి పుట్టాడన్నది ఎవరూ చూడలేదు, రాయలేదు కదా అన్నది. వాదన బాగానే ఉంది గానీ ఒక శాస్త్రీయ సిద్ధాంతం తప్పు అని నిరూపించడానికి వితండ వాదన ఒక్కటే సరిపోదు. ప్రత్యామ్నాయ వైఖరికి మద్దతుగా బలమైన, నిరూపించదగ్గ సాక్ష్యాలు కావాలి. ఆయన ఇంతటితో ఆగినా బాగుండేది. పాఠ్యాంశాల్లోంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించాలని ఏకాఏకీ తీర్మానించారు. అది బరితెగింపు. బాధ్యతా రాహిత్యం. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా ప్రభుత్వం కృషి చేయాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు చెప్తున్నాయి. అమాత్యులు అందుకు భిన్నంగా ప్రవర్తించరాదు. వెన్నెముక నిర్మాణ రీతులు, చేతులకు ఐదు వేళ్లుండడం లాంటి సారూప్యాలతో బాటు డీ యెన్ ఏ స్టడీస్ అన్నీ డార్విన్ ప్రతిపాదిత మానవ పరిణామ సిద్ధాంతాన్ని మరింత బలపరుస్తున్నాయి. అందుకు వ్యతిరేక వాదనలేవీ శాస్త్ర పరీక్షల గీటురాయికి నిలిచేవి కావు. శాస్త్ర విజ్ఞానమెప్పుడూ నేనేది చెప్తే అదే సత్యం అనదు. ససాక్ష్యంగా రుజువులుంటే మార్పునంగీకరిస్తుంది. ఆ సాక్ష్యాలు తిరుగులేకుండా నిరూపించదగినవిగా ఉండాలి. బాధ్యతాయుత పదవుల్లో ఉండే వ్యక్తులు ఆషామాషీగా మాట్లాడకుండా వుంటే అదే వారు శాస్త్ర విజ్ఞానానికి చేసే పెద్ద మేలు. (మంత్రి గారు కోతి నుండి మనిషి ఉద్భవించాడంటే నమ్మలేక పోవచ్చు. కానీ బుద్ధుల్లో మనిషి నుండి కోతిగా మారొచ్చనేది నమ్మి తీరాలి. మరి అదే .. పరిణామ సిద్ధాంతం. కాకపోతే ఉల్టాపల్టా)

● డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీ పురం.




## శక్తిమంతమైన ఓటు హక్కు

### ఎన్నికల సంఘం ఆవిర్భావ దినం

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమైన ఘట్టం. భారత్‌లాంటి పెద్ద దేశంలో ఎన్నికల నిర్వహణ క్రతువులాంటిదే. ఆ క్రతువును నిర్వర్తించడానికి 1950 జనవరి 25న ఒక వేదిక ఆవిర్భవించింది. అదే భారత ఎన్నికల సంఘం. ఈ రోజునే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పాటిస్తున్నారు. భారత రాజ్యాంగం 15వ భాగంలో 324 వ అధికరణం, ఎన్నికలసంఘం నిర్మాణం, అధికారాలు, విధులను ప్రస్తావించింది. ఇది స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకూ, పార్లమెంటు ఉభయ సభలకూ, రాష్ట్రశాసనసభలకూ, విధాన పరిషత్తులకూ ఎన్నికలు నిర్వహించడం దీని ప్రధాన విధి. అక్టోబర్ ఒకటో తేదీన మొదటిసారిగా ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించారు.

వీరు ఆరేళ్ళు గానీ, 65 ఏళ్ళ వయస్సు నిండేవరకు గానీ విధుల్లో ఉంటారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితోనూ, ఇతర ఇద్దరు కమిషనర్లకూ ఒక్కొక్కరికి సుప్రీం కోర్టు న్యాయమూర్తితో సమానమైన వేతనం లభిస్తాయి. మొదటి ఎన్నికల ప్రధాన కమిషనర్ సుకుమారుసేన్. ఆయన 1950 మార్చి 21నుంచి 1958 డిసెంబర్ 19 వరకు విధులను నిర్వహించారు. టిఎన్ శేషన్ హయాంలో ఎన్నికల కమిషన్ ప్రజానీకానికి చేరువైంది. ప్రతియేటా దేశవ్యాప్తంగా ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించి, ఓటు విలువ గురించి అవగాహన కల్పిస్తున్నారు. రాబోయేది ఎన్నికల కాలం, ఓటరు అప్రమత్తం కావాలి. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, బ్యాలెట్ల ద్వారా ఓటును వినియోగించుకుంటున్నాం. మనకు ఏ పార్టీ అభ్యర్థి నచ్చకున్నా నోటా బటన్ నొక్కవచ్చు. 1971వ సంవత్సరంలో పురుష ఓటర్ల సంఖ్య 60.89 శాతం ఉంటే 2014 నాటికి అది పెరిగి 67 శాతానికి చేరింది. మహిళా ఓటర్ల సంఖ్య 49.77 శాతం నుండి 66.32 శాతానికి పెరిగింది. ఎన్నికల కమిషన్ ఒత్తిడివల్లనే నూతన ఓటర్లు నమోదుపై దృష్టి సారిస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లలో తిరస్కార ఓటు హక్కును అమలు చేసిన దేశాలలో 14వ స్థానంలో మన దేశం నిలిచింది. 2009 సంవత్సరంలో ఈ నోటా (నన్ ఆఫ్ ది ఎబౌ) హక్కును తీసుకురావాలని ఎన్నికల సంఘం ప్రతిపాదించింది. 2013సెప్టెంబర్ నెలలో సుప్రీం కోర్టు రూలింగ్ మేరకు అమలులోకి వచ్చింది. ఓటుహక్కు వజ్రాయుధం లాంటిది. ఓటును మించిన శక్తి లేదు. విద్యార్థులకు ఓటర్ల దినోత్సవ ప్రాముఖ్యత గూర్చి వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. ఓటును ఎన్నికల సమయంలో శక్తివంతమైన ఆయుధంగా మరల్చుకొని నచ్చినవారికి ఓటు వేయచ్చు.

● కామిడి సతీష్‌రెడ్డి, పరకాల

## పెరుగుతున్న ఆర్థిక అసమానతలు

ప్రపంచీకరణ నూతన ఆర్థిక విధానాలు సంస్కరణల ఫలాలు కొద్దిమందికి పరిమితమవుతుంటే, పేద, మధ్యతరగతి ప్రజానీకం ఆదాయాలు భారీగా తగ్గిపోతున్నాయి. ఆక్స్ ఫామ్ సర్వే ఈ చేదు నిజాలను వెల్లడించింది. కేంద్ర ఆర్థిక విధానాల్లో తప్పిదాలను ఎత్తిచూపింది. దావోస్‌లో మోడీ ప్రసంగానికి కొన్ని గంటల ముందే వాస్తవాలను చెప్పింది. పాలకులు ఇప్పుడైనా కళ్లు తెరవాల్సిందే. ఈ నివేదిక ప్రకారం మోడీ ప్రభుత్వం దేశంలో అత్యధికులుగా ఉన్న పేద, మధ్యతరగతి ప్రజలకు కాకుండా సంపన్నులకే మేలు చేస్తుందని ఆందోళన చెందింది. ఆర్థిక అసమానతలు దినదినమూ పెరిగిపోతున్నాయి. భారత్‌లోని ఒక్క శాతం ధనికుల సంపద 2017లో రూ.20.9 లక్షల కోట్లు పెరిగింది. ఇది ఒకే సంవత్సరం కేంద్ర బడ్జెట్‌తో సమానం. ఒక్క శాతం మంది వద్ద దేశంలో దాదాపు 73 శాతం సంపద పోగవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే సమయంలో 67 కోట్ల మంది భారతీయుల సంపద కేవలం ఒక్క శాతం మాత్రమే పెరగటాన్ని సర్వే గుర్తించింది. 2017లో భారత్‌లో లక్షాధికారుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపింది. 2010 నుంచి భారత్‌లో బిలియనీర్ల సంపద ఏడాదికి సగటున 13 శాతానికి పెరిగిందని విశ్లేషించింది. పాశ్చాత్య దేశాలతో పాటు బారత్ పశ్చిమాసియా, బ్రెజిల్, బంగ్లాదేశ్, సోమాలియా, లిబియా, సిరియా ఆయా దేశాలలోనూ ఆదాయపరమైన ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి. బ్లూమ్ బర్గ్ తెలిపిన వివాదాల ప్రకారం 500మంది అంతర్జాతీయ కుబేరుల జాబితాలో 25మంది భారతీయులున్నారు. అంతర్జాతీయ జాబితాలో 20వ స్థానంలో రిలయన్స్ అంబానీ నిలిచారు. ఒక్క సంవత్సరంలో ఆయన ఆదాయం 76.3 శాతం 1704 కోట్ల డాలర్లు పెరిగి 4.001 కోట్ల డాలర్లకు చేరింది.



బ్లూమ్ బర్గ్ భారతీయ సంపన్నుల జాబితాలో ముఖేష్ అంబానీ తరువాత వరసగా లక్ష్మీమిట్టల్, ప్రేమ్‌జీ, శివనాడర్, పలోంజీ మిస్త్రీ, అజీం షింఫ్వీ, గౌతమ్. దిలీప్ ఆదానీలున్నారు. అత్యంత ధనికులు కావడానికి ముఖ్యకారణం స్టాక్ మార్కెట్లు పెరిగిపోవడమే అని బ్లూమ్ బర్గ్ విశ్లేషించింది. లబ్ధి పొందింది కూడా వీరే. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్, అలీబాబ టెన్సెంట్ కంపెనీల అధిపతులు, సాఫ్ట్ వేర్ స్మార్ట్ ఫోన్ సహాయంతో తమ వస్తువులను విస్తృతంగా ప్రచారంలో నిర్వహించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా కొనుగోలు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. అమెజాన్ అధినేత జెఫ్ బెజాస్. 3.402 కోట్ల డాలర్లు సంపద పెరిగాయి. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్‌ను రెండో స్థానానికి నెట్టి ప్రపంచ సంపన్నుడిగా ముందు వరసలో నిలిచారు. 2016లో బెజాస్ నికర విలువ 9.906 కోట్ల డాలర్లు, గేట్స్ విలువ 9.013 కోట్ల డాలర్లు. టెక్ సంస్థల ఆదాయం పెరిగిపోతోంది. పేద సంపన్న దేశాల్లో ప్రజల తలసరి ఆదాయాలు క్షీణించిపోతున్నాయి. కోట్లకు పడగలెత్తిన టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగాల కొరత సృష్టిస్తున్నాయి. దీంతో నిరుద్యోగం అంతులేకుండా పెరిగిపోతోంది. టెక్నాలజీ మారినప్పుడల్లా పాతవారి ఉద్యోగాలు కోల్పోవడం ఆనవాయితీగా మారిపోయింది. 1979లో జనరల్ మోటార్స్ సంస్థ అమెరికాలో 8,50,000 ఉద్యోగులను నియమిస్తే నేడు మైక్రోసాఫ్ట్ ప్రపంచవ్యాప్తంగా నియమించిన ఉద్యోగుల సంఖ్య గూగుల్‌లో 50 వేలమంది, ఫేస్‌బుక్‌లో ఐదువేల మంది పనిచేస్తున్నారు. మెకిన్స్ గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం కార్మిక శాఖలో 40 కోట్ల ఉద్యోగాలు 2030 సంవత్సరంలోపు ఊడిపోయి నిరుద్యోగులుగా మారతారు. 2017 లో బిలియనీర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 17 మంది కొత్తగా బిలియనీర్లు అవతరించారు. దీనిమూలంగా అపర కుబేరుల సంఖ్య 101 నుంచి 118 చేరింది. దేశంలో ధనికుల సంపద 4.89 లక్షల కోట్లు పెరిగింది. విద్యా, వైద్యం ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో 85 శాతం ఉపాధి కార్మిక రంగాల్ని భారత్ నమ్ముకుంటే ఎన్నో ఉద్యోగాలు కొత్తగా ఏర్పడతాయని సర్వే సూచించింది. సంక్షేమ పథకాలు అమలయ్యేలా చూడడం, వ్యవసాయాన్ని పరిరక్షించడం ద్వారానే ఆర్థిక అసమానతల్ని రూపుమాపేందుకు దోహదపడుతుందని సర్వే వివరించింది. ప్రపంచవ్యాప్తంగా సంపదలో 82 శాతం ధనవంతుల వద్దనే ఉంది. కేవలం ఒక శాతం మంది వద్దకు చేరిందని సర్వే అంటోంది. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. పేదలు మరింత పేదవాళ్లుగా మారుతున్నారని నివేదిక చేదు నిజాన్ని వెల్లడించింది. ప్రధాని నరేంద్రమోడీ గెలుపును విదేశీ స్వదేశీ సామ్రాజ్యవాదులు తమ తమ దోపిడీకి దర్జాగా వాడుకుంటున్నారు. భారత ప్రజల దోపిడీకి ప్రపంచ కార్పొరేట్ సామ్రాజ్యవాదానికి భారత్ కోటీశ్వరులకు ప్రధాని కావాలి. భారత దేశంలో 70 శాతం మంది ప్రజల్ని బిచ్చగాళ్లను చేశారు. రేషన్ షాపులలో, బ్యాంక్‌లలో, పెన్షన్ల కోసం ప్రభుత్వ దయాదాక్షిణ్యాల కోసం క్యూ కడుతున్నారు. పాలకులు ప్రజల్ని బిచ్చగాళ్లుగా మార్చివేసి తమ దోపిడీకి తెరలేపారు. 2017లో సాంకేతిక పరిజ్ఞానానికి అగ్రస్థానంలో ఉంది. రైతులు, నిరుద్యోగులు, కార్మికుల ఆత్మహత్యలు, ఆకలిచావులు పెరిగిపోతున్నాయి. సంస్కరణల పుణ్యమా అని నేడు ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతుంటే పాలకులు కులాలపేరిట డబ్బు వెదజల్లుతున్నారు. దేవుళ్ల పేరుతో ముడుపులు చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు గాఢ నిద్ర నుంచి మేల్కొని కార్పొరేట్లకు కొమ్ముకాయడం కాదు - పేదరికాన్ని నిర్మూలించడానికి అడుగులు వేయాలి.

● దామరపల్లి నర్సింహారెడ్డి, 9581358696

## రూ.204.5 కోట్ల లోటుతో తొలి బడ్జెట్




బడ్జెట్ అంటే ఆదాయ,వ్యయాల పట్టిక అని సూక్ష్మంగా అర్థం చెప్పుకోవచ్చు. ఆదాయాల్లో నికరాదాయాలు,అంచనాలు వేర్వేరుగాఉంటాయి. అంచనాలు అంటే, ఫలానా రంగంలో వనరుల ద్వారా ఇంత ఆదాయం లభించవచ్చని ఊహించి పేర్కొనడం.బడ్జెట్‌లు కేంద్రంలోనూ, రాష్ట్రా ల్లోనే కాదు,స్థానిక,పంచాయతీరాజ్ సంస్థల్లో కూడాఉంటాయి. ప్రభుత్వ,ప్రభుత్వేతర సంస్థల్లోనూ ఉంటాయి. సాధారణ బడ్జెట్‌ల గురించి టూకీగా....

స్వతంత్ర భారత దేశంలో తొలి సాధారణ బడ్జెట్‌ని 1947 నవంబర్ 26 వ తేదీన ఆనాటి ఆర్థిక మంత్రి ఆర్ కె షణ్ముగంచెట్టి ప్రవేశపెట్టారు. తొలి బడ్జెట్ లో ఆదాయం ఆదాయాన్ని రూ.171.15 కోట్లు మాత్రమే చూపించారు. ఆర్థిక లోటును 204.59 కోట్లుగా చూపించారు. 1951లో జాన్ మత్తాయ్ తొలి కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రణాళికా సంఘం ఏర్పాటుకు రోడ్డు మ్యాప్ ప్రకటించారు. దేశానికి అవసరమైన వనరులను ప్రణాళికా సంఘం అంచనా వేస్తుందని తొలి బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రణాళికా సంఘానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదటి అధ్యక్షునిగా వ్యవహరించారు. బడ్జెట్ ను వార్షిక ఆదాయ ప్రకటనగా రాజ్యాంగంలోని112 అధికరణంలో పేర్కొన్నారు.

అప్పట్లో ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన పార్లమెంటుకు సమర్పించేది. ఆ తర్వాత ఫిబ్రవరి నెలాఖరున ప్రవేశపెట్టడం ఆనవాయితీ అయింది. 2016 వరకూ అదే ఆనవాయితీ కొనసాగింది. బడ్జెట్‌తోపాటు ఆర్థిక బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. బడ్జెట్ ముందు రోజు ఆర్థిక సర్వేను పార్లమెంటుకు ప్రభుత్వం సమర్పిస్తుంది. పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టేది వార్షిక బడ్జెట్ అంటారు. తాత్కాలికంగా ప్రభుత్వ ఖర్చుల కోసం ప్రవేశపెట్టేది ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ అంటారు. తాత్కాలిక బడ్జెట్‌లో ఆదాయ, వ్యయాల పూర్తిపట్టికలు ఉంటాయి. 1959 -61 నుంచి 1963-64 వరకూ 1962-63 తాత్కాలిక బడ్జెట్ సహా అన్ని బడ్జెట్‌లను అప్పటి ఆర్థిక మంత్రి మొరార్జీ దేశాయ్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత జనతాపార్టీ హయాంలో ఆయన ప్రధానమంత్రిగా వ్యవహరించారు. కాంగ్రెస్‌లో తొలిసారి చీలిక వచ్చిన తర్వాత దేశాయ్ పాత కాంగ్రెస్‌లో కొనసాగడం, ఇందిరాగాంధీ నేతృత్వంలో కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఈ మార్పుల తర్వాత ఆర్థిక శాఖను ప్రధానమంత్రి ఇందిరాగాంధీయే తన ఆధీనంలో ఉంచుకున్నారు. మొరార్జీ దేశాయ్ మొత్తం 10 బడ్జెట్లను ప్రవేశపెట్టారు. తర్వాత పి.చిదంబరం తొమ్మిది బడ్జెట్‌లను ప్రవేశపెట్టి రెండో స్థానంలో నిలిచారు. అటు పిమ్మట ప్రణబ్ ముఖర్జీ (మాజీ రాష్ట్రపతి) 8 బడ్జెట్‌లనూ, యశ్వంత్ సిన్హా, యశ్వంతరావు చవాన్, సిడి దేశ్ ముఖ్ ఏడేసిసార్లు, మన్మోహన్ సింగ్, టిటి కృష్ణమాచారి ఆరేసి సార్లు బడ్జెట్‌లను ప్రవేశపెట్టారు. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరుణ్ జైట్లీ ఆర్థిక శాఖ మంత్రిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. మన దేశానికి 1947 ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యంవచ్చింది.స్వతంత్ర భారత దేశంలో మొదటి ఆర్థిక మంత్రి ఆర్ కె షణ్ముగంచెట్టి తొలి బడ్జెట్ ను 1948 మార్చి నెలాఖరు వరకూ ఆదాయం,అంచనాలతో ప్రవేశపెట్టారు. తొలి బడ్జెట్ లో ఆదాయం ఆదాయాన్ని రూ.171.15 కోట్లు మాత్రమే చూపించారు. ఆర్థిక లోటును 204.59 కోట్లుగా చూపించారు.

1951లో జాన్ మత్తాయ్ తొలి కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్‌ని ప్రవేశపెట్టారు.కేంద్ర ప్రణాళికా సంఘం ఏర్పాటుకు రోడ్డు మ్యాప్ ప్రకటించారు.దేశానికి అవసరమైన వనరులను ప్రణాళికాసంఘం అంచనావేస్తుందని తొలి బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రణాళికా సంఘానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మొదటి అధ్యక్షునిగావ్యవహరించారు.

## ఎల్.బి శాస్త్రి ఆర్ఎస్ఎస్ వ్యతిరేకి కాదు



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దేశ రెండవ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆర్ఎస్ఎస్ సైద్ధాంతికంగా ఎన్నడూ వ్యతిరేకించలేదని బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్.కే అద్వానీ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ వార పత్రిక ఆర్గనేజర్ 70 వ వార్షికోత్సవ సంచికలో రాసిన ప్రత్యేక వ్యాసంలో అద్వానీ ఎల్‌బి శాస్త్రీకి సంబంధించిన విషయాలను తెలియజేశారు. శాస్త్రిని అంకితమైన కాంగ్రెస్ మెన్‌గా అభివర్ణించిన అద్వానీ..నెహ్రూ లాగా శాస్త్రి ప్రవర్తించలేదన్నారు శాస్త్రి వ్యక్తిగత ఔన్నత్యమే ఆయన్ని దేశం గర్వించదగిన నాయకుడిని చేసిందన్నారు. శాస్త్రి ఎన్నడూ సిద్ధాంతపరమైన వైరుధ్యాలకు పోలేదని.. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు నాటి ఆర్ఎస్ఎస్ చీఫ్ గురు గొళ్వంకర్ ను తరుచూ సంప్రదించి దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చించేవారని తెలిపారు. 1960 లో తాను ఆర్గనైజర్‌లో అసిస్టెంట్ ఎడిటర్ గా చేరానని.. ఆ పత్రిక ప్రతినిధి హోదాలోతాను చాలాసార్లు శాస్త్రిని కలిశానని అద్వానీ వెల్లడించారు.

## నక్సల్స్ కాల్పుల్లో నలుగురు పోలీసులు మృతి

**రాయ్‌పూర్:** చత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లు మరోసారి రెచ్చిపోయారు. నారాయణ్‌పూర్ జిల్లాలోని అడవి ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో నలుగురు పోలీసులు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. ఇర్పానర్ గ్రామం సమీపంలోని అభుజ్‌మడ్ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేతగా పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా నక్సలైట్లు అకస్మాత్తుగా కాల్పులు జరిపినట్లు స్పెషల్ డీజీపీ డీఎం అశ్వతి తెలిపారు. తేరుకుని ఎదురుకాల్పులు జరిపేలోపే నలుగురు పోలీసులు ప్రాణాలొదిలారు.మృతులంతా జిల్లారెవెన్యూగార్డు పోలీసులుగా గుర్తించారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో నక్సల్స్ కాల్పులు జరిపినట్లు బస్కర్ రేంజ్ ఐజీ వివేకానంద్ సిన్హా తెలిపారు.

## సమాచార పరిపరక్షణకు చట్టం అవశ్యం

**న్యూఢిల్లీ:** దేశానికి సమాచార పరిరక్షణ చట్టం అత్యవసరమని పార్లమెంటరీ ప్యానల్ స్పష్టం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు సమాచారం పరిరక్షణ కోసం నూతన చట్టం అవసరమని పేర్కొంది. భారత్ డిజిటల్ కాలనీగా మారుతున్న నేపథ్యంలో చట్టం అవశ్యమని తెలిపింది. సమాచార పరిరక్షణ చట్టాన్ని పార్లమెంట్ లో ప్రవేశపెట్టాల్సిన అవసరముందని ఆర్థిక వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ముసాయిదా నివేదికలో పేర్కొంది. తమ సమాచారంపై వ్యక్తులు, యూజర్లు నియంత్రణ కలిగి ఉన్నప్పుడు కీలక విషయాలు బయటికిపొక్కవని సలహాఇచ్చింది.

## పవర్ కట్‌చేస్తే భారీ పెనాల్టీ

**డిస్కమ్‌లకు విద్యుత్ సవరణ బిల్లు షాక్: కేంద్ర మంత్రి ఆర్.కె.సింగ్**

**న్యూఢిల్లీ:** అప్రకటిత విద్యుత్ కోతలు విధించేడిస్కమ్‌లు మున్ముందు పెనాల్టీ కట్టాల్సి రావొచ్చు. అలాగే డిస్కమ్‌ల లైసెన్సులను ఐదేళ్లకు ఒకసారి పునరుద్ధరిస్తారు. ఇలాంటి నియమ, నిబంధనలతో కూడిన విద్యుత్ సవరణ బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెడతారు. ప్రస్తుతం డిస్కమ్‌లు జీవిత కాలానికి వర్తించేలా లైసెన్సు పొందుతున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతలకు అపరాధ రుసుము రూపేణా రూ.1,000 చెల్లించాలని ఉంది. కానీ ఇప్పటిదాకా ఏ ఒక్క డిస్కమ్‌పైన కూడా అలాంటి అపరాధ రుసుమును విధించిన దాఖలాలు లేవు.

ఇ-మొబిలిటీపై ఒక సదస్సుకు హాజరైన సందర్భంగా కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్.కె.సింగ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి డిస్కమ్‌ల లైసెన్సు పునరుద్ధరించాలనే ఒక నియమం సవరణ బిల్లులో ఉంది. తద్వారా సదరు డిస్కమ్ సరిపడ విద్యుత్ సరఫరా చేయగలదా లేదా అని నియంత్రణ వ్యవస్థ నిర్ధారిస్తుందని తెలిపారు. విద్యుత్ వినియోగం పెంపుదల కోసం కొత్తగా కరెంట్ కనెక్షన్ ఇవ్వడాన్ని నెల రోజుల నుంచి వారం రోజులకు తగ్గిస్తున్నట్టు మంత్రి చెప్పారు. విద్యుత్ కోతలపై భారీ పెనాల్టీ విధింపు 2019, ఏప్రిల్ నెల నుంచి అమల్లోకి వస్తుంది అని తెలిపారు.

# దోషి... దోషి... దోషి!

# లాలూకు ఐదేళ్ల జైలు



## దాణా కుంభకోణం మూడో కేసులో సీబీఐ కోర్టు తీర్పు

- మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా కూడా దోషే
- ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులకు రూ.5 లక్షల జరిమానా
- న్యాయంకోసం పోరాడుతాం: తేజస్వీయాదవ్

**రాంచీ:** దాణా కుంభకోణంలోని మరోకేసులో ఆర్జేడీ చీఫ్, బీహార్ మాజీ ముఖ్యమంత్రిలాలూ ప్రసాద్ యాదవ్, మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాకు కు సీబీఐ న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షతో రూ.5 లక్షల జరిమానా విధించింది.1990 కాలంలో చయిబసా కోశాగారం నుంచి 37 కోట్లు 62 లక్షల రూపాయాలు అక్రమంగా విత్ డ్రా చేయారన్న సీబీఐ ఆరోపణలతో ఏకీభవించిన న్యాయస్థానం మొత్తం 56 మందిని దోషులుగా తేల్చింది. ఈ కేసులో బీహార్ మాజీ మంత్రి నిశాద్, మాజీ పీఏసీ ఛైర్మన్ జగదీశ్‌శర్మ, మాజీ ఎమ్మెల్యేలు ధ్రువ్ భగత్, ఆర్.కే రాణా, పలువురు మాజీ ఐఎఎస్ అధికారులను సీబీఐ న్యాయమూర్తి ఎస్ఎస్ ప్రసాద్ దోషులుగా పేర్కొన్నారు. ఈ కేసులో న్యాయస్థానం మొత్తం 76 మంది దోషులుగా తేల్చగా.. ఇప్పటికే 14 మంది మరణించారు. ముగ్గురు అప్రూవర్లుగా మారారు. ఒకరు పరారీలో ఉండగా.. మరో ఇద్దరు ఇప్పటికే దోషులుగా తేలారు. ఈ కేసులో నలుగురు అధికారులను మాత్రం న్యాయస్థానం నిర్దోషులుగా నిర్ధారించింది.దాణా కుంభకోణంలో మొత్తం ఐదు కేసులు నమోదుకాగా.. దేవ్ గఢ్ ట్రెజరీ నుంచి రూ.89.27 లక్షలు అక్రమంగా విత్ డ్రా చేసిన కేసులో ఈనెల6న లాలూకు కోర్టు మూడున్నరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 లక్షల జరిమానా కూడా విధించింది. లాలూతో పాటు మరో ఏడుగురికి న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది. మరో ఏడుగురికి కూడా మూడున్నరేళ్ల జైలుతో పాటు రూ.5 లక్షల జరిమానా విధించింది. ఇక చైబాసా కోశాగార కేసులో లాలూ ఇప్పటికే దోషిగా తేలారు. 37కోట్ల 50 లక్షల మోసపూరితంగా విత్ డ్రా చేసినందుకు గాను 2013 అక్టోబర్ లో న్యాయస్థానం లాలూకు 25 లక్షల జరిమానాతో పాటు..ఐదేళ్లు జైలు శిక్ష విధించింది. ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండానిషేదం విధించింది. అయితే అదే ఏడాది డిసెంబర్ లో లాలూ కు సుప్రీంకోర్టుకు ఉపశమనం కలిగింది.ఈ కేసులో సుప్రీంకోర్టు లాలూకు బెయిల్ మంజూరు చేసింది. 2014 లో జార్ఖండ్ హైకోర్టు మిగతా నాలుగు కేసుల్లో విచారణపై స్టే విధించింది. ఒక కేసులో దోషిగా తేలిన వ్యక్తికి మిగతా కేసులను కూడా ఆపాదించడం సరికాదని వ్యాఖ్యానించింది. ఒక కేసులోని సాక్షులను అన్ని కేసుల్లో సాక్షులుగా భావించలేమని తెలిపింది.

### సీబీఐ కోర్టు తీర్పు ఫైనల్ కాదు.. ఉన్నత న్యాయస్థానాలకు వెళ్తాం

లాలూ ప్రసాద్ యాదవ్ కు న్యాయస్థానం శిక్ష ఖరారు చేసిన తర్వాత ఆయన కుమారుడు బీహార్ మాజీ మంత్రి తేజస్వి యాదవ్ స్పందించారు. తమకు న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉందని..సీబీఐ కోర్టు తీర్పు ఫైనల్ కాదని న్యాయం కోసం అవసరమైతే హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్తామన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన తండ్రిని ఎన్ని రకాలుగా వేధించినా...ఆయన సామాన్యప్రజల్లో హీరో అవుతున్నారని తేజస్వీ చెప్పుకొచ్చారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం బీహార్ అసెంబ్లీ ఎన్నికలను ఈ ఏడాది డిసెంబర్ వరకు వాయిదా వేసేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రాష్ట్ర పర్యటలనే ఇందుకు నిదర్శమని గుర్తు చేశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఆర్జేడీ అధికార పార్టీకి దీటైన జవాబిస్తుందని అన్నారు.

### ఇదీ కేసు

1991-1994 మధ్య లాలూ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఈ దాణాకుంభకోణం 1997 లో వెలుగులోకి వచ్చింది. పశువుల దాణా కొనుగోళ్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు రావడంతో లాలూసహా మరికొందరిపై కేసులు నమోదయ్యాయి.. దీంతో ముఖ్యమంత్రి పదవికి లాలూ రాజీనామా చేసి తన భార్య రబ్రీదేవిని సీఎంగా చేశారు. దాణా కుంభకోణానికి సంబంధించి మొత్తం ఐదు కేసులు నమోదు కాగా ప్రస్తుతం ఇంకా కేసులు పెండింగ్ లో ఉన్నాయి. డుమ్కా ట్రెజరీ నుంచి రూ.3కోట్ల 97 లక్షలు, డోరండా ట్రెజరీనుంచి 184 కోట్లను లాలూ అక్రమంగా విత్ డ్రా చేసినట్లు సీబీఐ రెండు కేసులు నమోదు చేసింది. ఈ రెండు కేసులపై ఇంకా విచారణ జరుగుతోంది.

# అనర్హతపై స్టేకు నిరాకరణ



- ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఈసీకి ఆదేశం
- తదుపరి విచారణ 29కి వాయిదా
- ఆప్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు నిర్ణయాన్ని నిలుపుదల చేయాలన్న విజ్ఞప్తిని ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. అయితే 29 వరకు ఈ అసెంబ్లీ సీట్లకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయొద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. బుధవారం ఈసీ అనర్హత నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. తమ వాదన వినకుండా ఈసీ ఏకపక్షంగా పై అనర్హత వేటు వేసిందని, ఆ నిర్ణయాన్ని రద్దు చేయాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. తమ వాదనలు వినేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలని కోరారు. దీనిపై ఈసీ, కేంద్ర ప్రభుత్వం తమ స్పందన తెలియజేయాలని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి విభూ బక్రు ఆదేశించారు. ఈ కేసుపై విచారణ జరిగే వరకు అసెంబ్లీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయొద్దని ఈసీని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ అనర్హత కేసుకు సంబంధించిన వివరాలన్నీ తమకు అందజేయాలని కోరింది. వచ్చే సోమవారం నుంచి ఈ కేసును రోజువారీగా విచారిస్తామని వెల్లడించింది. 29కల్లా కేసుకు సంబంధించిన వివరాలు కోర్టుకు అందజేయాలని కోరింది. అప్పటి వరకు ఈ సీట్ల ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వొద్దని ఆదేశించింది. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేల తరపున న్యాయవాది కెవి.విశ్వనాథన్ వాదనలు వినిపించారు. కేంద్ర విడుదల చేసిన అనర్హత నోటిఫికేషన్‌పైస్టే ఇవ్వని పక్షంలో కనీసం ఈసీ ఉప ఎన్నిక నిర్వహించకుండా ఆపాలని కోరారు. ఈసీని ఈ విషయంలోనిలువరించకపోతే ఈ కసరత్తు అంతా వ్యర్థమవుతుందన్నారు. ఈ కేసులు తుది తీర్పు వెలువడే వరకుఅనర్హత వేటుపడ్డ ఎమ్మెల్యేలు యథావిధిగా తమ విధులు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. లాభదాయక పదవుల్లో కొనసాగారన్న అభియోగాలపై 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తూ ఈసీ సిఫారసు చేయగా, రాష్ట్రపతి దానిని ఆమోదించారు. అయితే ఇదంతా బీజేపీ కక్ష సాధింపుతో చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. అనేక రాష్ట్రాలలో ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా కొనసాగుతున్నా తమపైనా వేటువేయడమేమటని ప్రశ్నించారు.

# ఉడాన్-2 పథకానికి అనూహ్య స్పందన

- కొత్తగా అందుబాటులోకి 43 విమానాశ్రయాలు, హెలీప్యాడ్లు
- సర్వీసులు అందించేందుకు పోటీపడ్డ విమానయాన సంస్థలు
- అత్యధిక బిడ్లు కైవసం చేసుకున్న ఇండిగో
- కేంద్ర పౌరవిమానయానశాఖ వెల్లడి


**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** దేశవ్యాప్తంగా ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాలను ప్రధాన నగరాలతో అనుసంధానం చేసే ఉడాన్ (ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్) పథకంలో మొదటి విడత కంటే 2వ విడతకు అనూహ్య స్పందన లభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు ఈ విషయాన్ని బుధవారం ఢిల్లీలో వెల్లడించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక విమానాశ్రయాలను అందుబాటులోకి తీసుకొచ్చి సామాన్యుడు విమాన ప్రయాణం చేయగలిగేలా చేశామని ఆయన తెలిపారు. తాము ప్రవేశపెట్టిన ఉడాన్ పథకానికి వస్తున్న స్పందన చూస్తుంటే ఉత్సాహం పెరుగుతోందని అశోక్ గజపతి రాజు వ్యాఖ్యానించారు. మొదటి విడత ఉడాన్ ద్వారా 16 కొత్త మార్గాలు అందుబాటులోకి వచ్చాయని, మిగతావిత్వరలోనేఅందుబాటులోకి వస్తాయని తెలిపారు. 2వ విడత ఉడాన్ పథకంలో తాము రోడ్డు, రైలు సదుపాయం సరిగా లేని ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు ప్రాధాన్యతనిచ్చామని అన్నారు. వీటికి ఊహించినదాని కంటే ఎక్కువ స్పందన లభించిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీపై ఆధారపడకుండా విమానయాన సంస్థలు స్వయం సమృద్ధి సాధించుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.ఉడాన్-2 ద్వారా జమ్ము-కాశ్మీర్‌లోని కీలక స్థావరం కార్గిల్ పట్టణం దేశంలోని ఇతర నగరాలతో ఎయిర్ కనెక్టివిటీ పొంద నుంది. 2వ విడత బిడ్డింగ్‌లో అత్యధిక మార్గాలు గెలుచుకుని ఇండిగో ముందు వరుసలో నిలిచింది. దేశీయ విమానయానంలో అగ్రగాములుగా కొనసాగుతున్న ఇండిగో, జెట్ ఎయిర్‌వేస్ విమానయాన సంస్థలు తొలి దశ బిడ్డింగ్‌కు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. అయితే తొలి దశలో బిడ్లు దక్కించుకున్న సంస్థలు కొత్త మార్గాల్లో లాభాలు ఆర్జించడం గమనించిన ఈ రెండు సంస్థలు 2వ దశలో పోటీపడ్డాయి. ఇండిగో 20 మార్గాల్లో బిడ్లు గెలుపొందగా, జెట్ ఎయిర్‌వేస్ 4 మార్గాల్లో బిడ్లు కైవసం చేసుకుంది. ఉడాన్2 పథకం మొత్తం 43 విమానాశ్రయాలు, హెలీప్యాడ్లను పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకురానుంది. దేశవ్యాప్తంగా ఉడాన్ పథకం అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత నుంచి మొత్తం 78 విమానాశ్రయాలకు విమానయాన సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చామని కేంద్రం చెబుతోంది. ఇందులో 36 విమానాశ్రయాల్లో అప్పటికే సర్వీసులు ఉండగా అదనంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. మరో 13 విమానాశ్రయాల్లో ఏదో నామమాత్రంగా ఒకటి అరా సర్వీసులు ఉండగా, వాటికి మరిన్ని అదనపు సర్వీసులు జోడించారు. 29 అసలేమాత్రం సర్వీసులు లేని విమానాశ్రయాల్లో కొత్తగా సర్వీసులు ప్రారంభించి వాటిని అందుబాటులోకి తీసుకొచ్చారు.



2వ విడత ఉడాన్‌లో కర్ణాటకలోని హుబ్లీ, కొప్పల్ సహా దేశవ్యాప్తంగా 45 నగరాలకు విమాన సర్వీసులు అందించేందుకు విమానయాన సంస్థలన్నీ గట్టిగా పోటీ పడ్డాయని పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా వెల్లడించారు. అలహాబాద్ నగరం నుంచి 12 నగరాలకు, కేరళలోని కన్నూరు గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం నుంచి 8 పట్టణాలకు కొత్తగా సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఉడాన్ పథకం ద్వారా విమానయాన సంస్థలకు ఇచ్చే రాయితీ (వయబిలిటీ గ్యాప్ ఫండ్)కి రూ. 800 కోట్లు ఖర్చవుతుందని కేంద్రం అంచనా వేస్తోంది.

## ఉవ్వెత్తున పద్మావత్ సెగలు

**సినిమా విడుదల వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో అల్లర్లు**



**న్యూఢిల్లీ/జైపూర్:** పద్మావత్ చిత్రం విడుదలకు వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్రమయ్యాయి. రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు అల్లర్లతో అట్టుడుకుతున్నాయి. కర్ణిసేన, హిందు యువ వాణి వంటి సంస్థలు రోడ్డెక్కాయి. జాతీయ రహదారులను దిగ్బంధనం చేశాయి. పలుచోట్ల కర్ణిసేన కార్యకర్తలు బస్సులు, ద్విచక్ర వాహనాలను దగ్ధం చేశారు. మల్టీప్లెక్స్‌ల ఎదుట నిరసలకు దిగారు. సినిమా ప్రదర్శనను నిలిపివేయాలని హెచ్చరించారు. లేనిపక్షంలో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ క్రమంలో రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో పంపిణీదారులు వెనక్కి తగ్గారు. ఉద్రిక్తల మధ్య సినిమా రిలీజ్ చేయబోమని స్పష్టంచేశారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన చిత్తోర్‌గఢ్ కోట ఆందోళన కారణంగా రెండోసారి మూతపడింది. రాజ్‌పుత్ మహిళలు ఆత్మబలిదానాలకు సిద్ధమని ప్రకటించడం, కర్ణిసేన కార్యకర్తలు కోటలోకి చొచ్చుకువెళ్లే ప్రయత్నం చేయడం వంటి పరిణామాలతో ముందస్తు జాగ్రత్త చర్యగా ఒకరోజు కోటను మూసిసేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పద్మావత్ ప్రదర్శనతో తమకు అవమానం జరిగితే, ఇదేకోటలో అగ్నిప్రవేశం చేసేందుకు 1900 మంది మహిళలు పేర్లను నమోదు చేసుకోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది. కాగా, అల్లర్ల నియంత్రణకు ఆయా రాష్ట్రాలకు సాయం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని హోంశాఖ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

### థియేటర్లలో కర్ఫ్యూ పాటించండి: కర్ణిసేన చీఫ్ కల్వి పిలుపు

దేశవ్యాప్తంగా పద్మావత్ సినిమాపై నిషేధం విధించాల్సిందేనని కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కల్వి డిమాండ్ చేశారు. బుధవారం జైపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీం ఆదేశాలకు విరుద్ధంగా సేన కార్యకర్తలు విధ్వంసాలకు దిగిన నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

## మోర్టార్ షెల్స్ మృత్యు ఘంటికలు


- ప్రభుత్వ పాఠశాలలో పేలుడు
- ఖాళీ అవుతున్న ఇండో - పాక్ సరిహద్దు గ్రామాలు

**జమ్మూ:** భారత్-పాక్ సరిహద్దుల్లో కాల్పులు ఆగిపోయినప్పటికి పరిసర గ్రామాల్లో నివసిస్తున్న వారు మాత్రం పేలని మోర్టార్ షెల్ల మధ్యనే జీవనం సాగిస్తున్నారు. వాటిని కదిలించినప్పుడు లేదా అకస్మాత్తుగా అవి పేలుతుండటంతో స్థానికులు ప్రాణాలు కోల్పోవటమో లేదా తీవ్రంగా గాయపడటమో జరుగుతోంది. తాజాగా బుధవారం, జమ్ము, కశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలోలోని నౌషెరాసెక్టర్ పరిధిలో ఎల్వోసీ సమీపంలో ఉన్న సయీద్ గ్రామంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో పాక్ ప్రయోగించిన రెండు మోర్టార్ షెల్స్ పేలాయి. అయితే ఈ ఘటనలో ఆస్తి నష్టం కాని ప్రాణ నష్టం కాని జరుగలేదు. గత వారంలో కాల్పుల విరమణ ఒప్పందంను పాక్ ఉల్లంఘించటంతో సరిహద్దుల్లోని పాఠశాలలను మూసివేశారు. ఇరుదేశాల మధ్య కాల్పులు సాగుతున్నప్పుడు పాక్ ప్రయోగించిన ఈ మోర్టార్ షెల్స్ జమ్ముసరిహద్దుల్లోని నివాస స్థలాలు, పొలాల్లో, అంతర్జాతీయ సరిహద్దుల్లోని (ఐబి) సాంబా, కథువా జిల్లాలు, ఎల్వోసీ సమీపంలో రాజౌరీ, పూంచ్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో పడ్డాయి. వాటిలో కొన్ని పేలక నిద్రాణంగా మట్టిలో కూరుకుపోయాయి. భద్రత బలగాలు వాటిని ముట్టుకోవద్దని సరిహద్దు గ్రామాల ప్రజలకు హెచ్చరికలు చేస్తున్నప్పటికి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పొలాల్లో ఇళ్లలో పడ్డ మోర్టార్ షెల్స్‌తో బెంబేలు పడుతున్న స్థానికులు సైనికాధికారులు వచ్చి వాటిని నిర్వీర్యం చేయడంతో బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. పలుమార్లు స్థానికులు తెలియక వాటిని కదిలించడంతో ప్రమాదాల బారిన ఘటనలు కోకొల్లుగా ఉన్నాయి. కరొటనా పల్లెలో దల్‌జీత్ సింగ్ పొలాల్లో పలు షెల్స్ పడటంతో పొలం పనులను ఆపేశాడు. వాటిని నిర్వీర్యం చేసి తొలగించినప్పుడే పొలం పనులు చేసుకోగల్గుతానని ఆయన అంటున్నాడు. అర్నియా సెక్టర్‌లో తన నివాసంలో పడ్డ మోర్టార్ షెల్‌ను గమనించి సుఖ్‌రాం చంద్ ఇంట్లోకి అడుగుపెట్ట లేదు. బుధవారం పురా, అర్నియా సెక్టర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(ఎస్‌డీపీవో) సురీందర్ చౌదరీ ఒక ప్రకటన చేస్తూ.. ఇప్పటివరకు 30 పేలని మోర్టార్ షెల్స్‌ను సరిహద్దు గ్రామాలు, వ్యవసాయ పొలాల్లో గుర్తించామన్నారు. వీటిలో 11 షెల్స్ అర్నియా సెక్టర్‌లో గుర్తించగా,19 షెల్స్‌ను ఆర్ఎస్ పుర సెక్టర్‌లో గుర్తించామని తెలిపారు. వాటిలో కొన్నింటిని నిర్వీర్యం చేశామని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో బాంబ్ డిస్పోజల్ టీంను ఏర్పాటు చేయాలని కోరుతూ సైనికాధికారులకు లేఖ రాసినట్లు ఆయన మీడియాకు తెలిపారు.

### నిర్మానుష్యంగా సరిహద్దు గ్రామాలు

మోర్టార్ షెల్ దాడులకు భయపడి సరిహద్దు గ్రామాల్లో చాలా వరకు ప్రజలు తమ నివాసాలను విడిచిపెట్టారని ఆయన తెలిపారు. పేలని మోర్టార్ షెల్స్‌ను గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నదని...ప్రజలు తిరిగి తమ నివాసాలకు వస్తే పేలని షెల్ల సంఖ్య కచ్చితంగా తెలుస్తుందని చౌదరీ అభిప్రాయపడ్డారు.

## భారత్ బాధ్యతాయుతమైన న్యూక్లియర్ దేశం



**దావోస్:** భారత బాధ్యతాయుతమైన న్యూక్లియర్ దేశమని కేంద్ర విదేశాంగ సహాయ మంత్రి ఎం.జె అక్బర్ అన్నారు. స్విట్జర్లాండ్ లోని దావోస్ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రసంగించిన ఆయన.. అణ్వాయుధాలను ఉపయోగించిన మొదటి దేశం భారత్ కాదని స్పష్టం చేశారు. అణ్వాయుధాలతో ప్రపంచ దేశాలకు ముప్పు అన్న అంశంపై ప్రసంగిస్తూ.. చాలా దేశాలు అణ్వాయుధాలు చూశాయి. అంతిమ నియంత్రణ , మిస్సైల్స్ సందేశం చూడాలి. కొన్ని రోజుల క్రితమే భారత్ ఆస్ట్రేలియా గ్రూప్‌లో చేరిన అణ్వాయుధాల నియంత్రణ ఒప్పందాలు చేసుకుంది. భారత్ చాలా బాధ్యతాయుతమైన అణు దేశమని ప్రపంచ దేశాలు గుర్తించాయి. మేం అణు వివక్ష లేని పాలనను కోరుకుంటున్నాం.మా దేశ విధానాలు నచ్చి చాలా దేశాలు మమ్మల్ని సంప్రదించాయి. అణు ముప్పులను నాశనం చేసేందుకు అన్ని దేశాలు కలిసికట్టుగా పోరాటం చేయాల్సినఅవసరం ఉంది. అని చెప్పుకొచ్చారు.

## మోడీ ప్రసంగం భేష్

**దావోస్ వేదికగా చైనా ప్రశంస**

**వాషింగ్టన్ :** దావోస్ వేదికగా భారత్ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగం బాగుందని చైనా చెప్పుకొచ్చింది. ఉగ్రవాదం ప్రపంచానికి ఎంత ప్రమాదమో మోడీ వివరించడం ఎంతో బాగుందని వివరించింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు పాల్గొన్న మొదటి ప్రధానిగా మోడీ పేరు సంపాదించుకున్నారు. అగ్రదేశాల రక్షణాత్మక విధానాలకు వ్యతిరేకంగా మోడీ తన అభిప్రాయం చెప్పడాన్ని చైనా ప్రశంసించింది. ప్రపంచీ కరణ ప్రోత్సహించడం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచీలా వ్యవహరించడంలో ఇరు దేశాల ఆలోచన ఒకటే అని చైనా చెప్పింది. తాము కూడా భారత్‌లాగే ఆలోచిస్తున్నామని మోడీ ప్రసంగాన్ని స్వాగతించింది. ఈ విషయమై భారత్ అడుగు జాడల్లోనే తాము కూడా నడవాలని కోరుకుంటున్నామని చైనా విదేశాంగ ప్రతినిధి హుచునింగ్ పేర్కొన్నారు. భారత్‌తో కలిసి పని చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమని ఆమె చెప్పారు. గతేడాది దావోస్ ప్రసంగంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రక్షణాత్మక విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడిన విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

## మోడీజీ... బ్లాక్ మనీ మోసుకొచ్చారా?

**ప్రధానికి రాహుల్ వ్యంగ్య ట్వీట్**



**న్యూఢిల్లీ:** విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తీసుకువస్తామంటూ ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆయనకు బుధ వారం గుర్తు చేశారు. స్విట్జర్లాండ్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరై తిరిగి వస్తున్నప్పుడు అందులో కొంత భాగాన్ని విమానంలో తీసుకు వచ్చారా అని మోడీని ట్వీట్ ద్వారా ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఆ ట్వీట్‌లో... ప్రియమైన ప్రధాని, స్విట్జర్లాండ్ తిరిగివచ్చిన మీకు స్వాగతం. నల్లధనంపై మీరు చేసిన వాగ్దానాన్ని గుర్తు చేస్తున్నాను. మీతో పాటుగా విమానంలో కొంత నల్లధనాన్ని తీసుకువచ్చారా అని భారతీయ యువత విస్తుపోతున్నది అని ఎద్దేవా చేశారు. దావోస్ సదస్సులో ప్రసంగించిన ప్రధాన మంత్రికి కాంగ్రెస్ అధ్యక్షుడు మంగళవారం కూడా వ్యంగ్య ట్వీట్ చేశారు. భారత్ లో కేవలం ఒక్క శాతం ధనికులు దేశపు 76 శాతం సంపదను ఎలా దక్కించుకున్నదీ దావోస్‌లో వెల్లడించాలని మోడీని రాహుల్ కోరారు.

## త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**అగర్తలా:** త్రిపుర అసెంబ్లీ ఎన్నికలకోసం ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పోలింగ్ తేదీని ఫిబ్రవరి 18గా నిర్ణయించగా, ఓట్ల లెక్కింపు మార్చి 3న చేపడతారని కమిషన్ ప్రకటించింది. మొత్తం ఎన్నికల ప్రక్రియ మార్చి 5లోగా ముగుస్తుందని తెలిపింది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం), వోటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వివిపీఏటీ) ఉపయోగించనున్నారు. 60 సభ్యులను కలిగివున్న త్రిపుర అసెంబ్లీ కాలపరిమితి మార్చి 14న ముగియనున్నది. ఎస్సీలకు 10 నియోజకవర్గాలు, ఎస్టీలకు 20 నియోజకవర్గాలను రిజర్వు చేశారు. మొత్తం 25,69,216మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి 3,214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలతో(2013) పోలిస్తే.. ఈసారి పోలింగ్ కేంద్రాలు 5.6శాతం పెరిగాయి. పోలింగ్‌కు ఏడురోజుల ముందు ఓటర్ల ఫొటోలతో కూడిన వోటర్ స్లిప్పులను పంపిణీ చేయాలని కమిషన్ సూచించింది.

## లిబియాలో జంట కారు బాంబు పేలుళ్లు

**34 మంది మృతి 87 మందికి గాయాలు**

**బెంగాజి:** లిబియాలో రెండో అతిపెద్ద పట్టణమైన బెంగాజీలో జరిగిన రెండు కారు బాంబు పేలుళ్లలో 34 మంది మరణించగా 87 మంది క్షతగాత్రులయ్యారు. ఈ మేరకు వివరాలు స్థానిక అధికారులు మీడియాకు వెల్లడించారు. అల్‌స్లెమాని పట్టణం మధ్యలో ఉన్న మసీదులో మంగళవారం సాయంకాల ప్రార్థనల అనంతరం బయటకు వస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని రెండు కార్లను ఒకే సారి పేల్చారని తెలిపారు. కాగా ఈ ఘటనకు పాల్పడిందని తామేనని ఇంతవరకు ఏ తీవ్రవాద సంస్థ ప్రకటించలేదు. ఈ మసీదు జిహాదీలను వ్యతిరేకిస్తున్నవారు ప్రార్థనలు చేస్తుంటారు. దాడి జరిగిన మసీదు సలాఫిస్ట్ గ్రూప్‌కు ప్రధాన స్థావరం. సలాఫిస్ట్ గ్రూప్ జిహాదీలను వ్యతిరేకిస్తూ హఫ్తర్స్ బలగాలకోసం పోరాడుతోంది. గత ఏడాది జూలైలో సైనిక నేత ఖలీఫా హఫ్తర్, జిహాదీలనుంచి తూర్పు పట్టణం స్వేచ్ఛపొందిందని ప్రకటించటంతో ఈ ప్రాంతం ప్రశాంతంగా ఉంది. అయితే అప్పుడప్పుడు ఈ ప్రాంతంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. స్థానిక అల్ జలా ఆస్పత్రికి 25 మృతులను తీసుకొచ్చారని మరో 51 మంది గాయపడ్డవారికి చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు.

## సయీద్‌పై చర్యలు వద్దు

**పాక్‌కు లాహోర్ హైకోర్టు ఆదేశం**

**లాహోర్ :** ముంబై దాడుల సూత్రధారి, జమాత్ ఉల్ దవా నేత హఫీజ్ సయీద్‌పై చర్యలు తీసుకోవద్దని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని లాహోర్ హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు నుండి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి చర్యలు, కేసులు నమోదు చేయవద్దని తేల్చి చెప్పింది. తనను అరెస్టు చేయకుండా ఆపాలని కోరుతూ సయీద్ మంగళవారం కోర్టును ఆశ్రయించాడు. ఐరాస భద్రత కౌన్సిల్ 1267 నిబంధనల కమిటీ ఇస్లామాబాద్ సందర్శించనున్న నేపథ్యంలో తనను అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో సయీద్ కోర్టును ఆశ్రయించాడు. అమెరికా, భారత్ డిమాండ్ మేరకు పాక్ సయీద్‌ను అరెస్టు చేసే అవకాశం ఉండటంతో అతను కోర్టుకు విన్నవించాడు. ముంబై దాడులతో తనకు సంబంధం ఉందని నిరూపించాలని కొన్నేళ్లుగా ఆ దేశాలు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నాడు. ఈ వ్యవహారంపై మార్చి 17లోగా సమాధానం ఇవ్వాలని లాహోర్ హైకోర్టు పాకిస్థాన్‌ను ఆదేశించింది.


Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

## భారత్ బయోటెక్ వాక్సిన్‌కు
# డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు

**హైదరాబాద్ :** అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం తయారు చేస్తున్న రోటావైరస్ డయోరియా వాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్ఓ) ఆమోదం తెలిపింది. ఈ వాక్సిన్‌ను హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ ఉత్పత్తి చేస్తుంది. అయితే డబ్ల్యుహెచ్ఓ ఆమోదం తెలిపితేనే ఐక్య రాజ్యసమితితో పాటు గావి... గ్లోబల్ వాక్సిన్ అనుబంధ సంస్థలు భారత్ బయోటెక్ నుంచి చౌకధరకు ఈ వాక్సిన్‌లను కొనుగోలు చేయవచ్చు. ఆఫ్రికా దేశాల్లో డయోరియాతో ప్రతి ఏడాది వేలాది మంది పసిపిల్లలు చనిపోతున్నారు. కాగా ఈ వాక్సిన్‌ను ఇతర కంపెనీలు జీఎస్‌కె, మెర్క్‌లు కూడా సరఫరా చేస్తున్నాయి కానీ.. వాటి ధర భారత్ బయోటెక్‌తో పోల్చుకుంటే చాలా ఎక్కువ. ఆఫ్రికా దేశాలతో పాటు ఇతర మార్కెట్లో కూడా ఈ వాక్సి న్‌కు మంచి డిమాండ్ ఉంది. రోటోవాక్ వాక్సిన్ గావి దేశాలకు భారత్ బయోటెక్ కోర్స్ వాక్సిన్ మూడు డాలర్లకు విక్రయిస్తుండగా.. జీఎస్‌కె 4.17 డాలర్లు, మెర్క్ 10.50 డాలర్లక విక్రయిస్తోంది. నాన్ గావి దేశాలు ఉదా హరణకు దక్షిణాఫ్రికాలో రోటావైరస్ ధర 20 డాలర్లకు విక్రయిస్తున్నారు. భారత్‌కు చెందిన భారత్ బయోటెక్ ఇలాంటి దేశాలతో ఒప్పందాలు కుదర్చు క ని కోర్స్‌ను 5 డాలర్లకు విక్రయిస్తే ఆ దేశాల్లో డిమాండ్ బాగా పెరగుతుందని బిల్ అండ్ మెలిదా గేల్స్ ఫౌండేషన్‌కుచెందిన డంకన్ స్టీల్ అన్నారు.

Bharat Biotech
INTERNATIONAL LIMITED

# రూ.88వేల కోట్లతో బ్యాంకులకు టానిక్



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** మొండిబాకీలతో కునారిల్లుతున్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధనం అందిచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ దిశగా బుధవారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ, ఉన్నతాధికారులతో కలిసి రీ క్యాపిటలైజేషన్ ప్రణాళికను ప్రకటించారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు 2.11లక్షల కోట్ల రూపాయలను మూలధనంగా అందిచాలని నిర్ణయించారు. ఇందులో తొలివిడతగా 88,139 కోట్ల రూపాయలను 20 ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఇవ్వనున్నట్లు ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ఇందులో సింహభాగం 10,610కోట్ల రూపాయలను ఐడీబీఐ బ్యాంకు పొందనుండడం గమనార్హం. పాత పొరపాట్లు పునరావృతం కాకుండా రుణాల వసూలకు పటిష్టమైన వ్యవస్థాగత యంత్రాంగం రూపొందించు కోవాలని అరుణ్‌జైట్లీ కోరారు. బ్యాంకింగ్ రంగ సంస్కరణలకు పలు నూతన విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రభుత్వ బ్యాంకుల ఆర్థిక స్థితి ఆరోగ్యకరంగా ఉంచడమే ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. రీక్యాపిటలైజేషన్‌లో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో రీక్యాప్ బాండ్స్ ద్వారా 80వేల కోట్లు, బడ్జెట్ ద్వారా 8,139 కోట్ల రూపాయలు అందించనున్నారు. ఆయాప్రభుత్వ రంగ బ్యాంకులు తమ రుణ సామర్థ్యాన్ని పెంచుకుని ఆర్థికరంగాన్ని పరుగులెత్తించేందుకు ఈ ప్రక్రియను చేపట్టారు. రీ క్యాపిటలైజేషన్‌తో పాటు ఆరుథీమ్‌లు, 30 సూత్రాలతో సంస్కరణల ప్రణాళికను క ూడా బ్యాంకులు అమలు చేయాలని నిర్దేశించారు. ఖాతాదారులకు స్పందించడం, బాధ్యతాయుతమైన బ్యాంకింగ్‌నిర్వహణ, క్రెడిట్ సౌకర్యం, పరిశ్రమలకు మిత్రునిగా ఉండడం, సమ్మిళిత ఆర్థిక వృద్ధి దిశగా పనిచేయడం, డిజిటలైజేషన్ తదితర అంశాలను అమలు చేయాలని సంస్కరణల ప్రణాళికలో కోరారు. ఈ సంస్కరణల అమలు బాధ్యతను బ్యాంకుల ఫుల్‌టైమ్ డైరెక్టర్లకు అప్పగించారు. వారి పనితీరును ఎప్పటికప్పుడు బ్యాంకు బోర్డు మదింపు చేయనుంది. ఖాతాదారులకు అందుబాటులోఉండడం, నాణ్యమైన సేవల అందించడం తదితర అంశాలపై స్వతంత్ర సంస్థతో సర్వే చేయించనున్నారు. సర్వే వివరాలను ప్రతి ఏడాది ప్రజల ముందుంచనున్నారు.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణ సదుపాయాలను పెంచేందుకు ప్రభుత్వ బ్యాంకులకు భారీగా మూలధనాన్ని సమకూర్చారు. అలాగే ఖాతాదారులు సులభంగా తమ కార్యకలాపాలు నిర్వహించుకోవడం, సేవల పొందడం ప్రధానమని ప్రభుత్వ ఉద్దేశం. అయిదు కిలోమీటర్ల పరిధిలో బ్యాంకు సర్వీసులను ప్రజలకు అందుబాటులోతేవడం, పొరపాటున ఎలక్ట్రానిక్‌ట్రాన్సక్షన్స్ ద్వారా డబ్బులు కట్ అయితే దానిని పదిరోజుల్లో తిరిగి రిఫండ్ చేయడం, వెనుకబడ్డ జిల్లాల్లో సైతం మొబైల్ ఏటిఎంలుఏర్పాటు చేయడం, యాప్ ద్వారా బ్యాంకింగ్ అవుట్ లెట్లను కనుగోవడం తదితర లక్ష్యాలతో సంస్కరణలను ప్రతిపాదించారు.

### ఏ బ్యాంకుకెంత మూలధనం

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.8800 కోట్లు, ఐడీబీఐ బ్యాంకు రూ.10,610కోట్లు, యూకో బ్యాంకుకు రూ.6,507 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు రూ.5,437 కోట్లు, సెంట్రల్‌బ్యాంక్‌కు రూ5,518 కోట్లు కెనరా బ్యాంకుకు రూ.4,865 కోట్లు, ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకుకు రూ. 4,694 కోట్లు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.4,524కోట్లు, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ రూ.3,571 కోట్లు, దేనా బ్యాంకు రూ.3,045 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ.3,173 కోట్లు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2,634 కోట్లు, కార్పొరేషన్ బ్యాంక్‌కు రూ.2,187 కోట్లు, సిండికేట్ బ్యాంక్ రూ.2,839 కోట్లు, ఆంధ్రా బ్యాంక్ రూ.1,890 కోట్లు, అలహబాద్ బ్యాంకుకు రూ.1,500 కోట్లు, పంజాబ్ అండ్ సింద్ బ్యాంకు రూ.785 కోట్లు కేటాయించారు.

### 58 శాతం బ్యాంకులు మొండిబకాయిలతో సతమతం

గతెడాది జులై నుంచి డిసెంబర్ కాలంలో 58 శాతం బ్యాంకులు మొండిబకాయిలు పెరిగాయని ఫిక్కీ-ఐబీఏ సర్వే చెబుతోంది. అదే సమయంలో రుణాల డిమాండ్‌కూడా క్రమంగా స్థిరపడుతోందని ఫిక్కీ- ఐబీఏ నివేదికలో పేర్కొంది. బ్యాంకింగ్ పరిశ్రమ మొత్తం ఆస్తుల్లో ప్రైవేట్, విదేశీ బ్యాంకుల వాటా 59 శాతం వరకు ఉంటుంది. ఫిక్కి-ఐబీఏ నిర్వహించిన సర్వేలో 58శాతం బ్యాంకులు ఎన్‌పీఏ లేదా మొండిబకాయిలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నాయి. మొండిబకాయిలు ఎక్కువ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెటల్స్, ఇంజినీరింగ్ గూడ్స్ రంగాల నుంచే ఎక్కువగా ఉన్నాయని తేలింది. 28 శాతం బ్యాంకులు రుణాల పునర్వ్యవస్థీకరించాలని విన్నపాలు పెరిగాయని పేర్కొనగా.. చివరగా జరిగిన సర్వేలో 40 శాతం వరకు ఉండేది. వచ్చే బడ్జెట్‌లో మొండిబకాయిల కోసం కేటాయింపులపై పూర్తి స్థాయి పన్ను మినహాయింపులు ఇవ్వాలని బ్యాంకులు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో పాటు కార్పొరేట్ టాక్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగానికి పెద్దమొత్తంలో పెట్టుబడులకు అవకాశాలివ్వాలని కోరుతున్నాయి. చాలా మటుకు బ్యాంకులు కార్పొరేట్ టాక్స్‌ను 30 శాతం నుంచి 25 శాతానికి, మ్యాట్‌ను 15 శాతానికి, వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లించే వారికి పన్ను మినహాయంపు పరిధిని పెంచాలని, దీంతో రుణాల డిమాండ్ పెరుగుతుందని.. కార్పొరేట్‌తో పాటు రిటైల్ రుణాలకు క్రమంగా డిమాండ్ పెరుతుందని ఫిక్కి నివేదికలో పేర్కొంది. కాగా ఈ సర్వే జులై నుంచి డిసెంబర్ 2017 మధ్యలో జరిగింది. తజాగా నిర్వహించిన సర్వేలో డిపాజిట్లు తగ్గాయని 48 శాతం బ్యాంకులు అంటే క్రితంసారి జరిగిన సర్వేలో 58 శాతంపెరిగాయని పేర్కొన్నాయి. 35 శాతం మంది బ్యాంకర్లు మాత్రం కాసా డిపాజిట్లు (సేవింగ్స్ అండ్ కరెంట్ అకౌంట్) ఖాతాలు గణనీయంగా తగ్గాయనిపేర్కొన్నాయి. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని బ్యాంకర్లు సూచిస్తున్నాయి. గతేడాది కాలం నుంచి డిజిటల్ లావాదేవీలు జోరందుకున్నాయని వాటిలో కార్డులు, యూపీఏ, ఆధార్‌పేలని బ్యాంకర్లు చెబుతున్నాయి. బ్యాంకులకు మూలధనం సమకూర్చడం పట్ల బ్యాంకర్లు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో రుణాల డిమాండ్ పెరుగుతుందని వారంటున్నారు.

## ఆటో ఎక్స్‌పోలో
# మారుతి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

**న్యూఢిల్లీ :** వచ్చేనెల ఢిల్లీలో ప్రారంభం కానున్న ఆటో ఎక్స్‌పోలో మారుతి సుజుకి ఇండియా కాన్సెప్ట్ ఎలక్ట్రిక్ కాంపాక్ట్ ఎస్‌యూవీ, ఈ-సర్వైవర్‌ను ప్రదర్శనకు ఉంచబోతోంది. భారతీయ మార్కెట్లో 2020లో ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విడుదల చేస్తుందని ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ- సర్వైవర్ ద్వారా మారుతి సుజుకి స్థానికంగా లభించే విడిభాగాలతో పాటు చార్జింగ్ స్టేషన్‌లను, రీ సైక్లింగ్ బ్యాటలరీ వినియోగిస్తుందని ప్రకటనలో వివరించింది. ఈ ఎస్‌యూవీ ప్రత్యేక ఆకర్షణాల విషయానికి వస్తే న్యూ జనరేషన్ హైబ్రిడ్ టెక్నాలజీతో కర్బన ఉద్గారాలను తగ్గిస్తుంది. దీంతో పాటు సంప్రదాయ ఇంధన వాడకాన్ని తగ్గిస్తుందని మొత్తం ఎలక్ట్రిఫికేషన్ ద్వారా ఈ కారు నడుస్తుందని ఎంఎస్ఐ ప్రకటనలో వివరించింది. ఇక హైబ్రిడ్ కార్ల విషయానికి వస్తే ప్రస్తుతం జపాన్‌లో పవర్ సుజుకిసోలియో, సుజుకి స్విఫ్ట్ కార్లను హైబ్రిడ్ కార్లను జపాన్‌లో ఉత్పత్తిచేసి అక్కడే విక్రయిస్తుంది. అయితే ఈ కార్లను కూడా ఫిబ్రవరి 9-14 వరకు జరిగే ఆటోఎక్స్‌పోలో ప్రదర్శనకు ఉంచుతుంది.




# నగలఎగుమతులు 4.65 % తగ్గాయి
## • ఏప్రిల్-డిసెంబర్‌లో...



**న్యూఢిల్లీ :** దేశం నుంచి ఎగుమతి అవుతున్న జెమ్స్ అండ్ జ్యూవెలరీ గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 4.65 శాతం క్షీణించి 25 బిలియన్ డాలర్లకు దిగివచ్చాయి. అంతకు ముందు ఏడాది ఇదే కాలం లో 26.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం అభివృద్ధి చెందిన మార్కెట్లతో పాటు అమెరికాలో డిమాండ్ తగ్గడమేనని జెమ్స్ అండ్ జ్యూవెలరీ ప్రమోషన్ కౌన్సిల్ (జీజెఈపీసీ) గణాంకాలను బట్టి తెలుస్తోంది. దేశం నుంచి జరుగుతున్న ఎగుమతులు జెమ్స్. జ్యూవెలరీ వాటా 14 శాతం వరక ఉంటుంది. బంగారు నగలు, బంగారు నాణెలకు డిమాండ్ తగ్గడమే ఎగుమతులు క్షీణించడానికి కారణం. ఎగుమతులు పెంచుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వాలని మెర్చండైజ్ ఎక్స్ పోర్ట్ ఫ్రం ఇండియా స్కీం (ఎంఈఐఎస్) కోరుతోంది. జెమ్స్, జ్యూవెలరీ ఎగుమతులు క్షీణిస్తుంటే దీనికి వ్యతిరేకంగా వెండి ఎగుమతులు 16.28 శాతం పెరిగి 3.11 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే కట్ అండ్ పాలిష్డ్ డైమండ్స్ ఎగుమతులు మాత్రం కేవలం 1.85 శాతం మాత్రమే పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలంలో 5.82బిలియన్ డాలర్ల సరకు తిరిగి వస్తే.. క్రితం ఏడాది ఇదే కాలంలో 5.83 బిలియన్ డాలర్ల నగలు తిరిగి వచ్చాయి. జెమ్స్ అండ్ జ్యూవెలీర రంలో భారత్ చైనానుంచి గట్టిపోటీ ఎదురవుతోంది. గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్‌కాలానికి ముతక వజ్రాల దిగుమతి 10.87 శాతం పెరిగి 14 బిలయన్ డాలర్లకు ఎగబాకాయి. అదే సమయంలో బంగారం కడ్డీల దిగుమతి కూడా 13 శాతం ఎరిగి 3.87 బిలయన్ డాలర్లకు చేరింది.

# వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ 7శాతం
## • జీఎస్‌టీ ప్రభావం తగ్గింది: హెచ్‌ఎస్‌బీసీ

**న్యూఢిల్లీ :** వస్తు సేవల పన్ను (జీఎస్టి) ప్రభావం క్రమంగా తగ్గముఖం పడుతున్నందున వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19లో భారత స్థూల దేశాయోత్పత్తి (జీడీపీ) 7 శాతంగా నమోదు కావచ్చునని బ్రిటిష్ బ్యాంక్ హెచ్‌హెస్‌బీసీ పేర్కొంది. దీంతో పాటు అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా వచ్చే రెండేళ్లలో భారత ఆర్థికవ్యవస్థ 7.4 శాతానికి ఎగబాకుతుందని అంచనా వేసింది. ఇక భారత ఆర్థిక వ్యవస్థ విషయానికి వస్తే వచ్చే మూడు సంవత్సరాల కాలానికి (18-20 ఆర్థిక సంవత్సరాలకు) 7 శాతం నుంచి 7.6 శాతానికి ఎగబాకుతుందని హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకు ప్రధాన ఆర్థికవేత్త ప్రణుంజల్ భండారీ చెప్పారు.వస్తు సేవల పన్ను (జీఎస్టి)ద్వారా భారత వృద్ధిరేటు గత ఆర్థికసంవత్సరం 7.1 శాతం నుంచి ఈ ఆర్థికసంవత్సరానికి 6.5 శాతానికి పడిపోతుందని ఆమె వృద్ధివేటు క్షీణించడానికి కారణాలను వివరించారు. గతేడాది జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టి ఇబ్బందులు క్రమంగా సమసిపోయాయని.. ఇక వచ్చే రెండేళ్ల కాలంలో వృద్ధిరేటు జోరందుకుంటుందని ఆమె చెప్పారు.వచ్చే మూడు సంవత్సరాల కాలంలో జీఎస్టి ద్వారా జీడీపీకి 0.40 శాతం అదనంగా లబ్ధి సమకూరుతుందని ఆమె చెప్పారు. హెచ్‌ఎస్‌బీసీకి కొత్తగా నియమించిన కంట్రీ హెడ్ జయంత్ రికాయే కూడా భారత ఆర్థికవ్యవస్థ క్రమంగా పుంజుకుంటోందని.. జీఎస్టి సమస్యలనుంచి గట్టెక్కిందన్నారు. కాగా ఈ నెల రెండవ తేదీన విడుదల చేసని నివేదికలో ఈ ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7 శాతంగా అంచనా వేసింది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టి వల్ల వృద్ధిరేటు తగ్గుతుందని వివరణ ఇచ్చింది. ఆసియన్ దేశాలతో భారత్ 64 బిలియన్ డాలర్ల వాణిజ్యం గత ఏడాది చేసింది. కాగా ఏషియన్ బ్లాక్ భారత్‌కు అతి పెద్ద వాణిజ్య భాగస్వామి.

# ఏఐతో ఉద్యోగాలకు ఎసరు:జాక్‌మా

**దావోస్:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా (ఐఏ)తో భవిష్యత్తులో మానవులు చేయాల్సిన పనులుయంత్రాలు చేస్తాయని ఆలీబాబా వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జాక్ బుధవారం చెప్పారు. మానవులకు ఏఐ, బిగ్‌డేటాతో ముప్పు పొం చి ఉందన్నారు. ఏఐతో పాటు రోబోలుకలిసి భవిష్యత్తులో ఉద్యోగాలకు ఎసరు తెస్తాయన్నారు. మానవులు చేయాల్సిన పనులన్నీ యంత్రాలే చేస్తాయని ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్యానెల్ చర్చలో పాల్గొంటూ మా అన్నారు. ఏఐ ద్వారా మానవులకు ప్రయోజనం కలగాలి, సాంకేతిక ప్రజలకు ఎంతో కొం త మేలు జరిగేలా ఉండాలని కానీ వారిని ఏ పనిపాట లేకుండా చేయడం కాదని మా పేర్కొన్నారు. బాధ్యతాయుత టెక్నాలజీ దిగ్గజాల విషయానికి వస్తే గూగుల్, ఫేస్ బుక్, అమెజాన్, అలీబాబాలు అదృష్టవంతమైన కంపెనీలు మా చెప్పుకొచ్చారు. అదే సమయంలో మనకు బాధ్యత కూడా ఉందని.. మంచి మనసులో ఎంతో కొం త మంచి చేయాలన్నారు. భవిష్యత్తు కోసం మనమంతా ఎంతో కొంత చేయూ తనివ్వాలని ఆయన సదస్సులో ప్రసంగిస్తూ అన్నారు. దీనికి ఆయన చెబుతున్న అంశాలు ఏమిటంటే.. మన లాంటి వారి వద్ద డబ్బు ఉంది.. వనరులున్నాయి. వాటి ని టెక్నాలజీపై విని యోగించి ప్రజలకు ఉపాధి కల్పించేలా ఉండాలని.. ప్రజలకు సాధికారిక చేకూర్చి వారి జీ వితాలు మెరుగుపడేలా చూడాలని ఆయన వివ రించారు. కొత్త టెక్నాలజీ ద్వారా చాలా మంది విజయం సాధించారు. దీంతో పాటు కొత్త టెక్నాలజీ సామా జిక ఇబ్బందులు కూడా తీసుకొచ్చిందన్నారు. తమ కంపెనీలు సీనియర్ మేనే జ్‌మెంట్‌లో 37 శాతంమంది మహిళా ఉద్యోగులున్నారని అన్నారు. కంపెనీని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలంటే మహిళలను పెద్ద సంఖ్యలో తీసుకోవాలని సూచించారు. తన కంపెనీ విజయవంతం అయిందంటే అది మహిళల వల్లే సాధ్యమైందన్నారు.

# మూడేళ్ల గరిష్టానికి పెట్రోల్ ధరలు
## • డీజిల్‌దీ అదే దారి




**న్యూఢిల్లీ :** గత కొన్ని రోజుల నుంచి పెట్రోల్, డిజెల్ ధరలు చుక్క లనంటుతున్నాయి. దేశ రాజధానితో పాటు ఇతర మెట్రో నగరాలలో ఈ రెండు ఇంధన ధరలు రికార్డుస్థాయిలో పెరిగిపోయాయి. ఢిల్లీలోపెట్రోల్ బుధ వారం లీటరు రూ.72.43కు చేరింది. మూడేళ్లలో ఇదే గరిష్ఠం. ఆగస్టు 2014 లో రూ.72.51 పలికింది. కోలకతా, ముంబై, చెన్నైలలో పెట్రోల్ ధరలు వరుసగా రూ.75.13, రూ.80.30, రూ.75.12కు చేరాయి. ఇవి కూడా మూడేళ్ల గరిష్ఠానికి ఎగ బాకాయి. చివరగా కోలకతాలో గరిష్ఠంగా అక్టోబర్ 2014 లో రూ.75.46 పలకగా.. ముంబైలో 2014 ఆగస్టులో రూ. 80.60, చెన్నై ఆగస్టు 2014లో రూ.75.78గా నమోదైంది. పెట్రోల్‌తో పాటు డిజిల్ ధరలు పోటీ పడి పెరు గుతున్నాయి. బుధవారం నాడు దేశ రాజధానితో పాటు మిగిలిన మెట్రో నగరాల్లో ఇదే సీన్ కనిపించింది. ఢిల్లీలో డిజెల్ లీటరు రూ.63.38కి విక్రయించగా.. కోలకతా, ముంబై, చెన్నైలలో వరుసగారూ.66.04, రూ.67.50, రూ. 68. 84 లీటరు విక్రయించారు. డిజెల్ విషయానికి వస్తే సరకు రవాణాతో పాటు ఆహార పదార్థాల రవాణాకు ఎక్కు వగా వినియోగిస్తారు. డిజెల్ ధరలు పెరిగితే ద్రవ్యో ల్బణం పెరగుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెట్రోల్, డిజెల్ ధరలు పెరగడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. వాటిలో ముడి చమురు ఎగుమతి చేసే ఒపెక్ దేశాలు ముడి చమురు ఉత్పత్తిని తగ్గించేశాయి. దీంతో అమాంతం ముడి చమురు ధరలు పెరిగాయి. బుధవారం బ్రెంట్ క్రూడ్ పీపా 70 డాలర్ల వద్ద తచ్చాడుతోంది. దీనితో తోడు ప్రభుత్వం అం తర్జాతీయ మార్కెట్ల ధరలతో పెట్రోల్, డిజిల్ ధరలను అను సంధానం చేసింది. గతంలో 15 రోజులకు ఒకసారి ధరల్లో తేడా కనిపించేది. ప్రస్తుతం రోజు వారి ధరలను సవరించ డంయ జరుగుతోంది. పెట్రోల్‌పై కేంద్రస్థాయిలో, రాష్ట్రస్థా యిలో పెద్దమొత్తంలో పన్నులు విధించడంతో పెట్రోల్, డిజెల్ ధరలు పెరిగిపోతున్నాయి. చమురుశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ కూడా దీనిపై స్పందించారు. వచ్చే జీఎస్టి మం డలి సమావేశంలో పెట్రోల్, డిజెల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని ఆర్థికమంత్రిని కోరతానన్నారు.

# ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ
## • పదిలక్షల మందికి • టీసీఎస్,ఇన్ఫోసిస్‌తో పాటు పలు కంపెనీల చేయూత

Infosys
TATA
TATA CONSULTANCY SE

**దీవోస్ :** ప్రపంచవ్యాప్తంగా సువారు పది లక్షలమంది ఐటి రంగానికి చెందిన వారు వృత్తినైపుణ్యంలో మరింత నైపుణ్యం పెంచడానికి పలు ఐటి కంపెనీలు ముం దుకొస్తున్నాయి. వాటిలో యాక్సెంచర్, సీఏ టెక్నాలజీస్, సిస్కో, కాగ్నిజెంట్, హెల్వెట్ ప్యాకెర్డ్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌పీఈ), పేగా సిస్టమ్స్, పీడబ్ల్యుసీ, సేల్స్‌ఫోర్స్, సాప్‌లు భాగస్వామ్యం చేపట్టాయి. పైన తెలిపిన కంపెనీలన్నీ కలిసి సుమా ర పది లక్షల మందికి జనవరి 2021 నాటికి శిక్షణ ఇస్తాయని వరల్డ్ ఎకనమీ ఫోరమ్ స్కిల్ సేట్ పోర్టల్ పేర్కొంది. ఐటి రం గంలో నైపుణ్యం గురించి ఫోరమ్ ఐటి గవర్నర్స్ సిస్కో చైర్మన్, సీఈవో చుక్ రాబిన్స్‌నేతృత్వంలో ఏర్పడింది. దీని ముఖ్యం ఉద్దేశం ఐటి రంగంలో శరవేగంగా మారుతున్న ఆటోమేషిన్, నాలుగవ పారిశ్రామిక విప్లవం వల్ల ఈ రంగంలో ఉద్యోగాలు ఊడిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించడం. దీనకి సమాజంలోని అన్నీ వర్గాల నుంచి ప్రభుత్వం, ప్రజలు ప్రైవేట్ పరిశ్రమల మద్దు తు కావాల్సి ఉంటుంది. విద్యావ్యవస్థలో కూడా మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లు విద్యారంగంలో మార్పులు చేయాలని డబ్ల్యుఈసీ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ క్లాస్ స్కాబ్ చెప్పారు.వృత్తినైపుణ్యం శిక్షణకు ప్రత్యేకంగా ఆన్‌లైన్ ప్లాట్ ఫాం ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 2018న దీనికి సంబం ధించి న పోర్టల్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ పోర్ట ల్‌లో కొత్త టూల్స్ ద్వారా ఉద్యోగులకు శిక్షణ ఇవ్వవచ్చు. ముందుగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని అమెరికా నుంచి మొద లుపెడతారు. దీనికి మైక్ గ్రీగోరియా, సీఏ టెక్నాలజీస్ సీఈ వో చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వచ్చే ఏడాది జరిగే డబ్లుఈఎఫ్ వార్షిక సదస్సులో దీని పురోగతిపై నివే దిక ఇస్తారు. కాగ్నిజెంట్‌సీఈవో ఫ్రాంకోయిస్ డిసౌజా మాట్లాడుతూ 21వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా సాం కేతిపరంగా వృత్తి నైపుణ్యం కల వారి కొరత ఏర్ప డుతుందని.. ఆ కొరతను నివారించడానికి ప్రపం చవ్యాప్తంగా చర్యలు చేపట్టాలని కోరారు. టీసీఎస్ సీఈవో రాజేష్ గోపీనాథన్ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అంతా డిజిటల్ మయమేనని దానికి తగ్గట్లు తమ ఉద్యోగులను కొత్త టెక్నాలజీపై శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పారిఖ్ భవిష్యత్తు అంతా డిజిటల్‌దేనని అందరికి డిజిటల్ లిటరసీపై దృష్టిపెడుతామన్నారు.

## బీమా పరిహారం చెల్లింపుల్లో.....
# పారదర్శకంగా వ్యవహరించండి
## • కొత్త ప్రాడక్టులతో బీమా వ్యాపారాన్ని విస్తరించండి • ఇన్సూరెన్స్ బ్రోకర్ల సదస్సులో ఐఆర్‌డీఏ చైర్మన్ విజయన్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** పాలసీదారులకు బీమా పరిహారం చెల్లింపులో ఇన్సూరెన్స్ కంపెనీలు టెక్నాలజీని వినియోగించుకుని పారదర్శకంగా వ్యవహరించాలని ఐఆర్‌డీఏ చైర్మన్ టిఎస్ విజయన్ సూచించారు. దేశంలో బీమా వ్యా పార విస్తరణకు ఎంతో అవకాశం ఉందని, కొత్త ప్రాడక్టులతో పాలసీదారులకు మెరుగైన ప్రయోజనాలు కలిగించేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రస్తుతం 4 శాతం మంది కూడా జీవిత బీమా చేయడం లేదని, సాధారణ బీమా అంతకన్నా తక్కువగా ఉందని ఆయన చెప్పారు. ఇన్సూ రెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ, గత ఏడాది లక్షా 27వేల కోట్ల రూపాయల సాధారణ ఇన్సూ రెన్స్ ప్రీమియం రాగా, 4 లక్షల కోట్ల మేరకు జీవిత బీమా ప్రీమియం వసూలైందని తెలిపారు. ఆరోగ్య బీమాపై ప్రజలు మొగ్గు చూపుతున్నారని, ఇది ఏటా 43 శాతం పెరుగు తుందని చెప్పారు. మొత్తం బీమా ప్రీమియంలో మెడికల్ ఇన్సూరెన్స్ 27శాతం వాటా కలిగి ఉందని, ఇందులో 30వేల కోట్ల ప్రీమియం బ్రోకర్ల ద్వారా వసూలైందని ఆయన చెప్పా రు. బీమా పాలసీలు పెంచేందుకు ఆన్‌లైన్ ఛానల్‌ను విస్తృతంగా వినియోగించుకోవాలని చెప్పారు. ఐటి రంగంలో వస్తున్న టెక్నాలజీ ద్వారా యాప్స్ అభివృద్ధిచేసి ఖాతా దారులకు దగ్గరవ్వాలని విజయన్ సూచించారు.బ్రోకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజయ్ కేడియా మాట్లాడుతూ, 2016-17లో 33 శాతం వృద్ధితో లక్షా 28వేల కోట్ల జనరల్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూలైందని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఎన్న డేటా ఎనలటిక్స్, టెక్నాలజీ, బ్రోకర్ల పాత్రతో బీమా రంగాన్ని మరింత విస్తరించేందుకు దోహద పడుతుందన్నారు. పాలసీదారులకు ఎక్కువ ప్రయోజనాలు, లబ్ధి చేకూర్చే విధంగా ఇన్సూరెన్స్ బ్రోకర్లు సహకరించాలని ఆయన సూచించారు.న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ సీఎండి జి.శ్రీనివాసన్ మాట్లాడుతూ, ప్రభుత్వరంగ బీమా కంపెనీలు సెటిల్మెంట్లు వేగంగా చేస్తాయని ప్రజలకు విశ్వాసం ఉందన్నారు. ప్రభుత్వ కంపెనీ పాలసీ దారులు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారని ఆయన అన్నారు.ఈ సదస్సుకు బ్రోకర్స్ అసోసియేషన్ కార్యదర్శి విజయ రాంపాల్ స్వాగతం పలికారు. ఇన్సూరెన్స్ బ్రోకర్స్, ఇన్సూరెన్స్ కంపెనీల సీఈవోలు, ఎండీలు దాదాపు 400 మందికిపైగా ఈ సదస్సులో పాల్గొన్నారు.

## గ్లోబల్‌టాప్ 250రిటైలర్స్‌జాబితాలో
# రిలయన్స్‌రిటైల్

Reliance RETAIL
Aapki khushi Hamari khushi

**న్యూఢిల్లీ :** రిలయన్స్ రిటైల్ గ్లోబల్ టాప్ 250 కంపెనీల్లో ఈ ఏడాది చోటు దక్కించుకుంది. దేశంలోని ప్రజలు పెద్దెత్తున వినియోగవస్తువులు కొనుగోలు చేయడం కూడా రిలయన్స్ రిటైల్‌కు బాగా కలిసొచ్చింది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ రిటైల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో 59.2 శాతం పెరిగాయని డిలాయిట్ గ్లోబల్ నివేదికలో వెల్లడించింది. రిలయన్స్ ఇండస్ట్రీకి అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ రిటైల్ దుస్తులు, యక్సెసరీస్‌లను రిటైల్ ట్రెండ్స్, రిటైల్ ఫుట్ ఫ్రింట్స్, రిలయన్స్ డిజిటల్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ చెయిన్‌లను నిర్వహిస్తోంది. భారతీయ రిటైల్ చెయిన క్రమంగా జోరందుకుంటోంది. పెద్దనోట్ల రద్దు, జీఎస్టి ఇబ్బందులను క్రమంగా బయటపడుతోంది. రాబోయే సంవత్సరాల్లో ఏడాదికి 10 శాతం చొప్పున రిటైల్ రంగం అభివృద్ధి చెందుతుందని డెలాయిట్ ఇండియా భాగస్వామి అనిల్ తాల్‌రేజా చెప్పారు. సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐని అనుమతించడంతో భారత్ మార్కెట్లో పెద్దమొత్తంలో గ్లోబల్ రిటైర్లు ఎంట్రీ ఇవ్వబోతున్నారని ఆయన తెలిపారు. ప్రజలకు ఆదాయం పెరగడంతో పాటు రిటైల్ ప్రాడక్టులపు పెద్దమొత్తంలో వ్యయం చేస్తుండటంతో విదేశీ ఇన్వెస్టర్లు భారత్ మార్కెట్ వైపు చూస్తున్నారు.

# విద్యుత్ సంస్కరణలు అనివార్యం?!

(మొదటిపేజీ తరువాయి)

వినియోగదారులకు సరఫరా చేసే పంపిణీ సంస్థ (డిస్కమ్)లు మాత్రం నష్టాల ఊబిలో కూరుకుపోతున్నాయి. ఏపీ ఈఆర్సీ, ఏపీ జెన్కో, ఏపీ ట్రాన్స్కో స్వేచ్ఛగా వ్యవహరిస్తూ తమకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటుంటే డిస్కమ్లు మాత్రం పెద్దన్నలా బరువు బాధ్యతలను మోస్తూ నష్టాలు చవిచూస్తున్నాయి.

**దీర్ఘకాల ప్రయోజనాలు ముఖ్యం:**

వాస్తవానికి విద్యుత్ రంగ సంస్థలన్నీ విడిగా ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ప్రయత్నించడం మానేసి ఇతర సంస్థలను తొక్కేసేలా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలూ ఉన్నాయి. ఇటువంటి తరుణంలో మరోదఫా సంస్కరణలు అమలు కావాల్సి ఉందని విద్యుత్రంగ నిపుణులు అంటున్నారు. విద్యుత్ రంగంలో అధునాతన సాంకేతిక వ్యవస్థ ఎప్పటికప్పుడు మారుతూ కొత్త ఆవిష్కరణలు వస్తూ ఉంటాయి. ఇలాంటి వ్యవస్థలో దీర్ఘకాల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంటుందంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏదైనా కొత్త ఆవిష్కరణ వస్తే దానిని ఆంధ్రప్రదేశ్ ముందుగా అందిపుచ్చుకుంటుందని నిపుణులు అంటున్నారు. ఇలా అధునాతన సాంకేతిక నైపుణ్యాలను వెనువెంటనే అందిపుచ్చుకోవడం ఒకరకంగా ప్రయోజనం కలిగిస్తుంటే మరోవైపు నష్టాన్ని కలుగజేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇందుకు పునరుత్పాదక విద్యుత్ సంస్థలతో చేసుకున్న కొనుగోలు ఒప్పందాల (పీపీఏ)ను ఉదహరిస్తున్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సంస్థలు.. ఉత్పత్తిని ప్రారంభించిన తొలినాళ్లలో యూనిట్ ధర అత్యధికంగా ఉందని నిపుణులు గుర్తు చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఆ సంస్థలతో కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడం వల్ల భారీగా మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. ఇప్పుడు సోలార్, పవన విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ రాయితీలను ఇస్తున్నాయి. అందువల్ల యూనిట్ ధర రూ. 2.24 నుండి రూ.3.15 దాకా వచ్చిందని అంటున్నారు. ఇప్పుడు పునరుత్పాదక విద్యుత్ సంస్థలకు ఇస్తే భారీ రాయితీలను అంతే భారీగా ఉపసంహరించుకోవాలన్న యోచనలో ఉన్నామని నిపుణులు చెబుతున్నారు. ఇది వాస్తవ రూపం దాల్చితే మరోసారి సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తి ధరలు గణనీయంగా పెరిగిపోయే ఆస్కారం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో ఒప్పందాలు చేసుకునే సమయంలో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని యోచిస్తున్నారు.

**రాత్రి వేళల్లో తక్కువ ధరకే..**

డిస్కంలు విధించే టారిఫ్లను తట్టుకోలేక రాత్రి సమయంలో భారీ పరిశ్రమలు ఓపెన్ యాక్సెస్కు వెళ్లిపోతున్నాయి. ఈ ధోరణి ఆంధ్రప్రదేశ్తో పోల్చితే తెలంగాణలో తక్కువగా ఉంది. తెలంగాణలో ఇలా ఓపెన్ యాక్సెస్ వెళ్లాలంటే యూనిట్కు రూ. 2.50 చొప్పున ఫిక్సెడ్ ఛార్జీల కింద చెల్లించాల్సి ఉండటమే కారణం. కానీ, ఆంధ్రప్రదేశ్లో మాత్రం 95 పైసలనే డిస్కంలు ఇలా వసూలు చేస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లేందుకు భారీ పరిశ్రమలకు చాలా సౌలభ్యంగా ఉంది. ఎందుకంటే యూనిట్కు పదిపైసలు తగ్గినా అంతిమంగా లక్షల నుంచి కోట్ల రూపాయల దాకా ప్రయోజనం ఉంటుంది. అలాంటిది ఏకంగా రూ.1.55 తక్కువగా ఉండటంతో ఆంధ్రప్రదేశ్లో భారీ పారిశ్రామిక సంస్థలన్నీ అటు జంప్ చేస్తున్నాయి. దీనిని నివారించేందుకు ఆంధ్రప్రదేశ్ కూడా ఓపెన్ యాక్సెస్కు వెళ్లే బడా సంస్థల నుంచి ఫిక్సెడ్ ఛార్జీల కింద యూనిట్కు రూ. 2.50 చొప్పున వసూలు చేస్తే ఎలా ఉంటుందన్న ఆలోచనలో ఉంది. అయితే, ఈ ఆలోచనను విద్యుత్ రంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు. డిస్కమ్లు కూడా రాత్రి సమయంలో పవర్ ఎక్స్ఛేంజ్ తరహాలోనే తక్కువ ధరకు విద్యుత్ను సరఫరా చేస్తే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. బడా పరిశ్రమలు ఓపెన్ యాక్సెస్కు వెళ్తున్న సమయంలో ఏపీ జెన్కో ప్లాంట్లో ఉత్పత్తిని ఆపేస్తూ బ్యాకింగ్డౌన్ చేస్తున్నారు. ఇలా బ్యాకింగ్డౌన్ చేసినప్పుడు జెన్కో సంస్థకు డిస్కమ్లు ఫిక్స్డ్ ఛార్జీలను చెల్లించాల్సి వస్తోంది. ఇలా ఫిక్స్డ్ ఛార్జీలను చెల్లించడంకంటే డిమాండ్ అధికంగా లేని సమయంలో బడా పరిశ్రమల టారిఫ్ను తగ్గిస్తే ఆ సంస్థలు డిస్కమ్లను వీడి వెళ్లిపోయే ప్రసక్తే ఉండదని విద్యుత్ రంగ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**స్నేహపూర్వక వ్యవహారం:**

సంస్కరణలు తీసుకురావడంలో మరో ప్రధాన ఉద్దేశ్యం పోటీ తత్వంతో పాటు వినియోగదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం కూడా ఉంది. కానీ విద్యుత్రంగ సంస్థ సిబ్బంది వినియోగదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించడంలేదన్న అభిప్రాయాన్ని ఉన్నతాధికారవర్గాలే అంగీకరిస్తున్నాయి. మొత్తానికి విద్యుత్ సంస్థల మధ్య పోటీతత్వం పెరిగి ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే సీఎం చంద్రబాబు చెబుతున్నట్లుగా మరోసారి సంస్కరణలకు సిద్ధం కావాల్సిందేనని అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనివల్ల ఇప్పటిదాకా ఎదుర్కొన్న అనుభవాల ఆధారంగా సంస్థలు ఆర్థికంగా పరుగులు పెడుతూనే వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆస్కారం ఉంటుందని విద్యుత్రంగ నిపుణులు చెబుతున్నారు.

# నా వ్యూహాలు వేరు!



(మొదటిపేజీ తరువాయి)

అనకువగా మాట్లాడే తనను కొన్ని రాజకీయ పక్షాలు విమర్శించినా తానేమీ పట్టించుకోనని చెప్పారు. ఎంతో బాధ్యతతో కూడిన రాజకీయాలను చేయడానికే తాను జనసేనను ప్రారంభించానని కొంతమంది తనను రకరకాలుగా విమర్శించినా ఒరిగేదేమీ లేదని అలా విమర్శిస్తే తనకు సంతోషమేనని ప్రజల సమస్యల సాధనకు తాను ఎలాంటి దాడులకైనా సిద్ధమని స్పష్టంచేశారు. తన మీద భౌతిక, మాటల దాడులు చేసినా భరిస్తానని ఎదురుదాడి మాత్రం చేయనని చెప్పారు. దాడులు చేస్తే వాటిని తీసుకుంటానని తనకు సమాజంపట్ల చాలా చాలా బాధ్యత ఉందని పేర్కొన్నారు.

భారతదేశ రాజకీయాలను, తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలంటే ప్రస్తుతం ఉన్న కుల వ్యవస్థను అర్థం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. తనకు కులం లేదని, మతం అంతకన్నా లేదని ప్రాంతం లేనేలేదని తాను మానవత్వాన్ని, జాతీయతను గౌరవిస్తానని చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినపుడు కులాలను ఖచ్చితంగా అర్థం చేసుకోవాలని తెలిపారు. కులాల అంశం సామాజిక అంశమని ఈ సామాజిక సత్యాన్ని అర్థం చేసుకోకుండా తెలుగు రాష్ట్రాల రాజకీయాలను, జాతీయ రాజకీయాలను అవగతం చేసుకోవడం ఎంతో క్లిష్టమని ఆయన చెప్పారు.

ఒక సమస్యతో ప్రజలు నలిగిపోతున్నపుడు రాజకీయ పక్షాలు తమ పబ్బం గడుపుకోవడానికి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఎలా అని ఆయన ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారానికి ఎలాగైతే న్యాయ పోరాటం చేస్తున్నామో నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రాంత సమస్యల పరిష్కారానికి అదే రీతిలో ముందుకు వెళ్ళాలన్నది జనసేన లక్ష్యమని ఇందుకు యువత సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అభిమానులను, చిన్నపిల్లలను, ఓటుహక్కు లేని వారు జనసేన చుట్టూ తిరుగుతున్నారన్న ఆరోపణలను ఆయన నిర్ద్వంద్వంగా ఖండించారు.

జై తెలంగాణ అంటే ఒకసామాజిక మార్పునకు సంకేతమని, ఏ జై తెలంగాణ ఉద్యమం ఏ ఆశయంతో ముందుకు వెళ్ళిందో ఆ ఆశయం కోసం జనసేన పని చేస్తుందని ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉద్ఘాటించారు. జనసేనకు ఓటుబ్యాంకు రాజకీయాలు అవసరం లేదని, మానవత్వంతో కూడిన రాజకీయాలు చేయాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని ఆయన చెప్పారు.

# భూకేటాయింపులేవీ?!

(మొదటిపేజీ తరువాయి)

2016, 2017లో జరిగిన పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను నిర్వహిస్తున్న పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. వారిలో 425 మంది పరిశ్రమల శాఖ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థలతో మల్లవల్లి పారిశ్రామిక పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు చేసుకున్నారు. ఒప్పందాలు చేసుకుని రెండేళ్లు గడుస్తున్నా భూకేటాయింపులు జరుగకపోవడంతో విసుగుచెందిన పారిశ్రామికవేత్తలు తమ పరిశ్రమల ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలన్న యోచనకు వచ్చినట్లు సమాచారం.

రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో పరిశ్రమలను స్థాపించి, రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దేశవిదేశాల్లోని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఆయన పిలుపునకు స్పందించి హైదరాబాద్కు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చేందుకు సిద్ధమయ్యారు. 450 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. తమకు భూమి కేటాయిస్తే తక్షణమే కార్యకలాపాలను ప్రారంభిస్తామని, రూ.1100 కోట్ల మేర పెట్టుబడులు పెడతామని చెప్పారు. వాస్తవానికి ఈ ఒప్పందాల కాలపరిమితి ఏడాది మాత్రమే. ఈ లోగానే పరిశ్రమలను స్థాపించడం, కార్యకలాపాలను చేపట్టడం జరిగిపోవాలి. కానీ, అలా జరగలేదు.

పరిశ్రమల యాజమాన్యాలు మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్, నవ్యాంధ్ర ఇండస్ట్రియల్ అసోసియేషన్, స్వర్ణాంధ్ర ఇండస్ట్రియల్ అసోసియేషన్, మల్లవల్లి స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ పేరిట సంఘాలను ఏర్పాటుచేసుకున్నాయి. ఈ అసోసియేషన్ల పరిధిలోని పారిశ్రామికవేత్తలకు మల్లవల్లి ఇన్నోవేటివ్ ఇండస్ట్రియల్ కారిడార్లో భూములు కేటాయించే బాధ్యతను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ)కు పరిశ్రమల శాఖ అప్పగించింది. మల్లవల్లిలో ఎకరాకు రూ.16.50 లక్షల చొప్పున ధరను నిర్ణయించి కేటాయించాలని ఏపీఐఐసీ నిర్ణయించింది. అప్పటి నుండే పారిశ్రామికత్తలకు కష్టాలు మొదలయ్యాయి. అప్పటిదాక ఎకరం రూ. 36 నుంచి రూ. 42 లక్షల దాకా ఉన్న భూముల ధరలు అమాంతం తగ్గడంతో డిమాండ్ బాగా పెరిగింది. గత రెండేళ్లుగా తమ కార్ల టైర్లు అరిగిపోయేలా హైదరాబాద్ నుండి అమరావతికి..అమరావతి నుండి హైదరాబాద్కు ఎంఎస్ఎంఈలు తిరిగారు. వీరికి 133 ఎకరాలను మాత్రమే కేటాయిస్తామని ఏపీఐఐసీ తొలుత చెప్పింది. తాజాగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుంటే ఒక్కో సంస్థకు 500 గజాలు మాత్రమే ఇస్తామని చెబుతోంది. పరిస్థితిని మంత్రి ఎన్ అమర్నాథరెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఇక తిరిగే ఓపిక తమకు లేదంటూ హైదరాబాద్ శివారు ప్రాంత ఎంఎస్ఎంఈలు భావిస్తున్నట్లు తెలిసింది.

# ఫిరాయిస్తే పదవులా?

**• రాజీనామా చేయాలి • ఆపై గెలిచి రావాలి • లేదా చట్టాన్ని మార్చాలి • బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు సంచలనం • వైకాపా ఎమ్మెల్యేలు, మంత్రులపై వ్యాఖ్యలు • బీఏసీ చైర్మన్ బుగ్గనతో కలిసి ప్రెస్మీట్**

**అమరావతి, ఆంధ్రప్రభ :** మంత్రి పదవులు పొందిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామాచేసి హుందాగా గెలిచి సభలోకి రావాలని లేదా ఏపార్టీ తరపున గెలిచినా మంత్రి పదవి పొందవచ్చనే నూతన చట్టాన్ని తేవాలని భారతీయ జనతాపార్టీ శాసనసభాపక్ష నాయకుడు విష్ణుకుమార్ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయ పక్షాల్లో కలకలం సృష్టించాయి. పీఏసీ సమావేశాల ముగింపు సందర్భంగా బుధవారం అసెంబ్లీలో ఆకస్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రజాసంకల్పయాత్రను పురస్కరించుకుని ప్రత్యేక హోదాకు ప్రధాని ఆమోద ముద్ర వేస్తే బీజేపీకి మద్ధతు పలుకుతారని వైకాపా అధినేత జగన్మోహన్రెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఈ నేపథ్యంలో విష్ణుకుమార్రాజు పీఏసీ సమావేశాల సందర్భంగా వైకాపాకు చెందిన పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రరెడ్డి, ఆదిమూలపు సురేష్లతో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలోని వైఎస్సార్సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు హాట్టాపిక్గా మారాయి. ఇప్పటికే టీడీపీ బీజేపీ మైత్రిపై మీడియాలో వస్తోన్న భిన్నకథనాలకు తోడు విష్ణు కుమార్రాజు చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. అసెంబ్లీలో మీకు నచ్చినది.. నచ్చనిది.. ఏమిటని విష్ణుకుమార్ రాజును మీడియా ప్రశ్నించగా బీజేపీ, వైకాపా, టీడీపీ అందరూ ఉండి సరైన రీతిలో చర్చలు జరిగినప్పుడు ప్రజలకు ఉపయోగకరమైన విషయాలు చర్చించి ప్రభుత్వంలో ఉన్న లోపాలను ఎత్తిచూపి ప్రజలకు మేలు చేయడం నచ్చిన అంశంగా



పేర్కొన్నారు. అందరూ వచ్చినప్పుడు అసెంబ్లీ బాగుందని విష్ణుకుమార్రాజు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న సభ్యులను అధికార పక్షంలో మంత్రులను చేయడం తనకు నచ్చని అంశంగా పేర్కొన్నారు. ఇది కరెక్ట్ కాదన్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారడం సాధారణ అంశమన్నారు. దీనికి గ్రావిటీ తక్కువగా ఉంటుందన్నారు. అయితే పార్టీ మారిన వారిని మంత్రులు చేయడం సమంజసం కాదన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్సీపీతో తాము వ్యతిరేకంగా పోటీ చేశామని గుర్తు చేశారు. ఐతే వారిని మంత్రులను చేసి ఆంధ్రరాష్ట్రాన్నంతటికీ మంత్రులను చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా మంత్రులు రాజీనామా చేసి గెలిచి గౌరవంగా అసెంబ్లీకి రావచ్చన్నారు. లేకపోతే ఎవరైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత ఎవరికి కావాలంటే వారిని మంత్రిని చేసే విధంగా నూతన చట్టం తీసుకురావాలని విష్ణుకుమార్రాజు సూచించారు. పార్టీతో సంబంధం లేకుండా ప్రజాప్రతినిధులైతే ఎవరైనా మంత్రులను ఈ చట్టం ద్వారా చేసుకోవచ్చన్నారు. ప్రజాప్రతినిధి కావడానికి పార్టీ అనేది కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం వరకేనన్నారు. ఈ పద్ధతి ఉంటే సమస్య ఉండదన్నారు. ముఖ్యమంత్రి మిమ్మల్ని మంత్రులు చేస్తామని చెప్పినంత మాత్రాన వీరంతా మంత్రులు కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎవరైనా రండి మా ఇంట్లో ఉండడి అని అంటే పెట్టేబేడ సర్దుకుని వెళ్లంగదా అని ఎద్దేవా చేశారు. చంద్రబాబునాయుడుకు ఈ విషయాన్ని పలుమార్లు చెప్పడం జరిగిందన్నారు. పార్టీ మారినవారు రాజీనామా చేసి తిరిగి గెలిచి అసెంబ్లీకి రావచ్చన్నారు. వారితో వ్యక్తిగత స్పర్ధలు లేవనీ ఫిరాయించిన వారంతా తనతో వ్యక్తిగతంగా బాగుంటారన్నారు. ఇది నైతికతతో కూడుకున్న వ్యవహారమన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు నీతి, నిజాయితీ, విశ్వసయత చూపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వాళ్లు చెప్పడం, గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించడం, స్పీకర్ చెయ్యడం ఆనవాయితీ అయిందన్నారు. పార్టీలు మారడం, అవతలివారు ఇవతల కూర్చోవడం పెద్దసమస్యకాదనీ ఫిరాయింపుదారులకు మంత్రి పదవులు కట్టబెట్టడంపైనే తాను ప్రశ్నిస్తున్నామన్నారు. అందుకే తాను కొత్త చట్టం తీసుకురావాలని కోరుతున్నామన్నారు. ఈవిధంగా అసెంబ్లీలో చట్టం తీసుకొస్తే చెల్లుతుందా అని ప్రశ్నించగా చేయాలిగదా, కాపు రిజర్వేషన్ బిల్లు పెట్టారు కదా, బిల్లు అమలవుతోందా అంటూ ఎదురు ప్రశ్నించారు. ముందు సిఫారసు చేస్తే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# రాష్ట్రం విడిపోవడమే మంచిదైంది

**• ఎన్నో పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి • శాసన సభాపతి కోడెల శివప్రసాద్**



**కారంచేడు, ప్రభన్యూస్:** తెలుగు రాష్ట్రాలు విడిపోవడమే మంచిది అయిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్ అన్నారు. బుధవారం ప్రకాశం జిల్లా కారంచేడులో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవిభజన సమయంలో ఎంతో బాధపడ్డామని, ఆ రోజు రాష్ట్రాన్ని విడగొట్టి ఉండకపోతే ఈరోజు ఎన్నో దేశాలకు చెందిన పరిశ్రమలు మన ప్రాంతంలో ఏర్పాటై ఉండేవికావన్నారు. చంద్రబాబునాయుడు ఆహ్వానంతో ఎన్నో దేశాలకు చెందిన 305 పరిశ్రమలు ఇప్పుడు ముందుకు వస్తుండటంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాల కల్పన జరగబోతుందన్నారు. కారంచేడు పారిశ్రామిక వేత్తలు, విద్యా వేత్తలు, రాజకీయ, సినీ పరిశ్రమలకు చెందిన వారు, ఆదర్శ రైతులు, ముఖ్యంగా స్వాతంత్ర సమరయోధులు పుట్టినగడ్డ అన్నారు. అందుకే నాకు కారంచేడు అంటే ప్రత్యేక అభిమాన మని చెప్పుకొచ్చారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు సి.కుటుంబరావు మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలు జరగ కుండా 1100 టోల్ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, జీఎంఆర్ కంపెనీల సీఈఓ చల్లా ప్రసన్న పాల్గొన్నారు.

# రిపబ్లిక్ డే వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

**• పరిశీలించిన డీజీపీ మాలకొండయ్య**



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 68వ గణతంత్ర వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయవాడలోని ఇంది రాగాంధీ మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర అధికారులు పాల్గొనున్న ఈ కార్యక్రమానికి అధికారులు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం డీజీపీ డాక్టర్ ఎం. మాలకొండయ్య పరిశీలించారు. గణతంత్ర దినోత్సవ పూర్తి స్థాయి రిహార్సల్స్ను పరిశీలించిన డీజీపీ మాలకొండయ్య అధికారులకు పలు సూచనలు చేశారు. శుక్రవారం ఉదయం 11.13గంటలకు గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నా రు. తదుపరి ప్రభుత్వం తరుపు గవర్నర్ రాష్ట్రవందనం స్వీకరిస్తారు. జాతీయ గీతం, ఇతర కార్యక్రమాల తర్వాత నరసింహన్ పేరేడ్ను పరిశీలిస్తారు. అనంతరం ఆయా విభాగాల కవాతును పరిశీలించి వారి నుంచి గౌరవ వందనం స్వీకరించను న్నారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ, పోలీసు ఉన్నతాధికారులను గవర్నర్కు పరిచయం చేస్తారు. కంటింజెంట్ విభాగంలో భారత సైనిక దళం, సీఆర్పీఎఫ్, ఒడిశా పోలీసు బృందం, కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్, రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజు శాఖ మహిళా విభాగం గవర్నర్ సమక్షంలో కవాతు ప్రదర్శించనున్నారు. అన్ ఆర్మడ్ కంటింజెంట్ ఎన్సీసీ బాల బాలికల విభాగాలు, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సాంస్కృతిక బృందం, యువ రెడ్ క్రాస్, పోలీసు బ్రాస్ బ్యాండ్, ఆర్మీ బ్యాండ్, అగ్నిమాపక సేవా బృందం కవాతు నిర్వహించిన తర్వాత రాష్ట్ర ప్రభు త్వం వివిధ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల శకటాల ప్రదర్శన ఉంటుంది. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను డీజీపీ మాలకొండయ్య పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్, జాయింట్ కమిషనర్ బి.వి.రమణ కుమార్, డీసీపీలు క్రాంతిరాణా టాటా, గజారావు భూపాల్, బెటాలియన్స్ డిఐజీ విజయ కుమార్, బత్తుల శ్రీరామ్మూర్తి, సీఎం భద్రతా అధికారి జోషి, రహదారులు, భవనాల శాఖ ఎస్ఇ శేషుకుమార్ పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని**



**అమరావతి, ఆంధ్రప్రభ :** రాష్ట్ర ప్రజలకు కార్పొరేట్కు ధీటుగా మెరుగైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్రవైద్య, ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. బుధవారం గుంటూరులోని ఎన్టీఆర్ వైద్యసేవ, డ్రగ్స్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోనే నాణ్య మైన వైద్య సేవలకు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణలో ఎన్టీఆర్ వైద్యసేవలను నిలిపివేయడం జరిగిందని చెప్పారు. కానీ ప్రాణాంతకమైన క్యాన్సర్కు సరైన వైద్యం మన రాష్ట్రంలో ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో తెలంగాణలో ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా క్యాన్సర్ చికిత్సకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. క్యాన్సర్ చికిత్సల కోసం దేశంలోనే ప్రసిద్ధిగాంచిన టాటా మెమోరియల్తో త్వరలోనే ఒప్పందం చేసుకోబోతున్నామన్నారు. అంతర్జాతీయ వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నటువంటి 607 ఆసుపత్రులు ఎంప్యానల్మెంట్ క్రింద పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి మారుమూల గ్రామాల్లో సింగిల్ డాక్టర్ క్లినిక్లను ఏర్పాటు చేయనున్నామని మంత్రి కామినేని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు సీఈఓ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్, మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ వై.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ ఓటరు దినోత్సవం

**• సచివాలయంలో ప్రతిజ్ఞ • ముఖ్య అతిథిగా గవర్నర్ నరసింహన్**

**అమరావతి, ఆంధ్రప్రభ :** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం 11 గంటలకు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యం మరింత విజయవంతం అయ్యేందుకు రాష్ట్రంలో 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి ఒక్కరు విధిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని కోరారు. అధికార యంత్రాంగం కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత ఉధృతంగా చేపట్టాలని ఆయన కోరారు. జాతీయ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞలో అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధిగా పాల్గొనాలని సీఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు.

**విజయవాడలో వేడుకలు**

జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను గురువారం సాయంత్రం 4 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్ని కల ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్పి.సిసోడియా అధ్యక్షతన జరిగే ఈ కార్య క్రమానికి ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు. అదే విధంగా ఎలక్షన్ కమిషనర్ ఎన్.రమేష్ కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్లు అతిధులుగా హాజరవుతారు.

**కలెక్టర్ లక్ష్మీకాంతంకు బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు**

కృష్ణా జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతంకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు లభించింది. ఓటు హక్కు వినియోగ ప్రాధాన్యతను వివరించి ఓటర్లలో అవగాహన కల్పించడం తోపాటు ఓటర్ల నమోదులో అమోఘమైన ప్రగతి సాధించినందుకు కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి అయిన లక్ష్మీకాంతంకు ఈఅవార్డు దక్కింది. ఈ అవార్డును రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అందజే యనున్నారు. జిల్లాలో యువ ఓటర్లను ఎక్కువ శాతం నమోదు చేసినందుకు, అవగాహన ర్యాలీలు, కళారూపాల ద్వారా ఓటర్ల లో అవగాహన కల్పించేందుకు గాను కేంద్ర ఎన్నికల సంఘం కలెక్టర్ లక్ష్మీకాంతంను ఈఅవార్డుకు ఎంపిక చేసింది.

# కిడ్నాప్ కేసులో 9 మందికి యావజ్జీవ కారాగార శిక్ష

**నార్పల, ప్రభన్యూస్ :** అనంతపురంజిల్లా నార్పలలో కలకళం సృష్టించిన కిడ్నాప్ కేసులో 9 మందికి యావజ్జీవ కారాగార శిక్ష పడినట్లు నార్పల ఎస్ఐ పి. శ్రీనివాసులు తెలిపారు. నార్పల నడిబోడ్డులో సూపర్ బజార్ నందు 18జూన్ 2014న రాత్రి 9 గంటలకు షాపు నుండి ఇంటి వెళుతుండగా నార్పలకు చెందిన ఏరువుల షాపు డిలర్ ప్రసాద్శెట్టిని కడపకు చెందిన సునిల్ బృందం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని కిడ్నాప్ చేసింది. భారిగ డబ్బులు డిమాండ్ చేసారు. విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై హుటాహుటిన రంగంలోకి దిగి అతితక్కువ సమయంలోనే నిందితులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు అప్పగించారు.

ఈకేసులో బుధవారం ఫస్ట్ ఏడిజే కోర్టు న్యాయమూర్తి సాక్షాదారాలు పరిశీలించిన మొదట నిందితుల్లో 9 మందిని దోషులుగా తేల్చి వారికి (లైఫ్)యావజ్జీవ ఖారగార శిక్ష విధించారని నార్పల ఎస్ఐ పి. శ్రీనివాసులు తెలపారు. మరో ఇద్దరు వెంకటేశ్వర్లు (2 సంవత్సరాలు), గోపాల్ (3 సంవత్సరాలు)అనే వ్యక్తులకు జైలు శిక్ష విధించినట్లు, మరో ఇద్దరిపై కేసు కోట్టి వేసారని నార్పల ఎస్ఐ పి. శ్రీనివాసులు తెలిపారు.

# అటవీ సంపద సంరక్షణకు పటిష్ట చర్యలు

**• రాష్ట్ర అటవీ దళాధిపతి మల్లిఖార్జున రావు**



**అమరావతి, ఆంధ్రప్రభ :** ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన నల్లమల అడవులు రాష్ట్రంలో విస్తరించి ఉండటంతో అరుదైన అటవీ సంపదను కలిగి ఉన్నామని, దీనిని సంరక్షించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర అటవీ దళాధిపతి మల్లిఖార్జునరావు తెలియజేశారు. బుధవారం ఆయన అటవీశాఖ, టాస్క్ఫోర్స్ ఉన్నతాధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టాస్క్ఫోర్స్ ఐజీ కాంతారావు అటవీ సంపద రక్షణకు చేపడుతున్న సంరక్షణ చర్యలపై పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం మల్లిఖార్జునరావు మాట్లాడుతూ తిరుపతి రేంజ్లో అరుదైన ఎర్ర చందనం అక్రమార్కుల చేతుల్లోని వెళ్లకుండా టాస్క్ఫోర్స్ చేపడుతున్న సంరక్షణ చర్యలు అభినందనీయమన్నారు. అడవుల్లో నిరంతరం వన చైతన్య యాత్రలు, డాగ్స్క్వాడ్ తనిఖీలు, కూంబింగ్లను నిర్వహిస్తూ ఎర్ర చందనం స్మగ్లర్లకు అడ్డుకట్ట వేస్తున్న టాస్క్ఫోర్స్ చర్యలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఎర్ర చందనం అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలంటూ, దీని కోసం అటవీ శాఖ, టాస్క్ఫోర్స్ శాఖ సంయుక్త కార్యచరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పీసీఎఫ్ ఎ.కె.ఝా, బి.కె.సింగ్, కడప, చిత్తూరు, కర్నూలు సర్కిల్ అధికారులు, టాస్క్ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్రం ఆదేశాలతో తెరపైకి కాపు రిజర్వేషన్లు

**• వివిధ శాఖల అభిప్రాయాలు కోరిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ • 9వ షెడ్యూల్లో చేర్చేందుకు కసరత్తు • అభిప్రాయాలు పంపేందుకు సిద్ధమవుతున్న శాఖలు**

**అమరావతి, ఆంధ్రప్రభ:** కేంద్రం ఆదేశాలతో కాపు రిజర్వేషన్ల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లు కేంద్రం వద్దకు చేరిన సంగతి తెలిసిందే. ప్రస్థుతం కేంద్రం ఈ బిల్లును సీరియస్గా పరిశీలిస్తుంది. ఈ బిల్లును పార్లమెంట్ ఆమోదిస్తే కాపులకు బీసీ కేటగిరి కింద 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. ఈ అంశంపై గతంలో మంజునాథ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదించి, తీర్మానించి, బిల్లును కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయమై సంపూర్ణ వివరాలు పంపాల్సిందిగా కేంద్ర హోంశాఖ రాష్ర ప్రభుత్వ శాఖలను కోరింది.

ఇందుకు సంబంధించి వివిధ శాఖల అభిప్రాయాలను కోరింది. న్యాయశాఖ, సామాజిక సాధికారిక శాఖ, ఉన్నత విద్యాశాఖ, పాఠశాల విద్యాశాఖ, మైనార్టీ, గిరిజన, సిబ్బంది వ్యవహారాల శాఖల అభిప్రాయాలను కేంద్రం కోరింది. రాష్ట్ర జనాభాలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులస్థులు 50 లక్షలకు పైగానే ఉన్న సంగతి తెలిసిందే. కాపు రిజర్వేషన్ల అంశం ఎప్పటి నుంచో నలుగుతున్న సమస్య. అధికార పార్టీ అధికారంలోకి రాకముందే కాపులకు రిజర్వేషన్ల అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టింది. అధికారంలోకి వస్తే కాపులకు రిజర్వేషన్లు కల్పిస్తామని హామి ఇచ్చింది. ఇచ్చిన హామి మేరకు సీఎం నారా చంద్రబాబునాయుడు కాపులను బీసీ జాబితాలో చేర్చి, రిజర్వేషన్లు కల్పించే విషయమై జస్టిస్ మంజునాథ్ అధ్యక్షతన కమిషన్ను ఏర్పాటుచేయడం, కమిషన్లోని మెజార్టీ సభ్యులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం, దానిన్ని ప్రభుత్వం చకచకా ఆమోదించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం పంపిన బిల్లును పార్లమెంట్ ఆమోదిస్తేనే రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయి. ఈ విషయమె ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు ప్రధానితో ప్రత్యేకించి చర్చించారు. సాధ్యమైనంత త్వరగా కాపు రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ప్రధానిని కోరారు.

ఈ నేపథ్యంలోనే కాపు రిజర్వేషన్ల బిల్లులో కదలిక వచ్చింది. కేంద్రం కోరిన విధంగా ఆయా శాఖల నుంచి అభిప్రాయాలు పరిశీలించిన తర్వాత దానికి పార్లమెంట్ ఆమోదం లభించేలా చర్యలు తీసుకోనున్నారు. అందులో భాగంగానే రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల అభిప్రాయాలను కోరడం జరిగింది. వాస్తవానికి కాపుల రాజకీయ, సామాజిక, ఆర్థిక, సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై కూలంకషంగా నివేదికను కేంద్రం ఆయా శాఖలను కోరింది. ఆయా శాఖలు ఇచ్చే నివేదికలు బిల్లు ఆమోదంలో కీలకపాత్ర పోషిస్తాయంటున్నారు. వారికి సంబంధించిన సామాజిక అంశాలపై సామాజిక సాధికారిక శాఖను వివరాలు అడిగారు. విద్యాపరమైన అంశాలను ప్రాథమిక, ఉన్నత విద్యాశాఖలు తెలియజేస్తాయి. లీగల్గా ఉన్న ఇబ్బందులపై న్యాయశాఖను వివరణ కోరారు. భవిష్యత్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం ఈ విధంగా అన్ని శాఖల నుంచి వివరాలు అడిగిందంటున్నారు.

మెజార్టీ అభిప్రాయాలను సేకరించి, దాని ఆధారంగా కాపు రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చేందుకు కేంద్రం సమాయత్తమవు తుందంటున్నారు. అందులో భాగంగానే తాజాగా ఈ ప్రక్రియను చేపట్టిందన్నారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇచ్చే నివేదిక ఆధారంగా కేంద్రం తదుపరి చర్యలు తీసుకుంటుందని అంటున్నారు. కేంద్రం ఆదేశాలు అందగానే ఆయా శాఖలు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ కేంద్రానికి నివేదిస్తాయి.

# ఏపీఎస్ ఆర్టీసీలో 15 డిపోలు లాభాల బాట

**• సంక్రాంతి ఆదాయం రూ.1003.33 కోట్లు • హైదరాబాద్ రూట్లో అత్యధికం**

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఏపీఎస్ ఆర్టీసీ ఇప్పుడిప్పుడే నష్టాల నుంచి కోలుకుని, లాభాల బాట పడుతుంది.. రాష్ట్రంలోని 128 డిపోల్లో 15 డిపోలు ఈ ఆర్థిక సంవత్సరంలో మంచి లాభాలు కూడా సాధించడంతో యాజమాన్యంలో మరింత ఉత్సాహం పెరిగింది. నష్టాలు తగ్గించుకునేందుకు యాజమాన్యం తీసుకుంటున్న అనేక రకాల చర్యల ఫలితంగా ఇప్పటికే 15 డిపోలు లాభాల బాట పట్టాయంటున్నారు. దీనికి తోడు ఇటీవల సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రం నుంచే కాకుండా హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున ప్రత్యేక సర్వీసులను నడిపి, భారీగా ఆదాయాన్ని ఆర్జించింది. ఈనెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 4375 ప్రత్యేక సర్వీసులు నడపడం ద్వారా సంస్థకు రూ. 1003.33 కోట్ల ఆదాయం వచ్చినట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది. దాదాపుగా అన్ని రీజియన్లలోను ఈ ఆదాయం లభించిందని ఏపీఎస్ ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి బుధవారం 'ఆంధ్రప్రభ'కు తెలిపారు. అత్యధికంగా హైదరాబాద్ రూట్లో ఆదాయం వచ్చిందన్నారు. ఈరూట్లో 1770 బస్సులు నడపడం ద్వారా రూ.522.71 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. బెంగుళూరు రూట్లో 494 బస్సులకు రూ.131.77 కోట్లు లభించిందన్నారు.

## త్వరలో పేరూరు, భైరవన దిప్ప

# ప్రాజెక్టులకు శంకుస్థాపన



పరిటాల రవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి దేవినేని ఉమ. సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పరిటాల సునీత

● టెండర్లు పిలిచిన ఏడాదిలోపే పూర్తి చేస్తాం ● పరిటాల రవి సేవలు మరువలేం: మంత్రి ఉమ

**అమరావతి, ఆంధ్రప్రభ:** త్వరలోనే పేరూరు డ్యాం, భైరవన దిప్ప ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని రాష్ట్ర నీటి పారుదల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరావు అన్నారు. బుధవారం విజయవాడ టీడీపీ కార్యాలయంలో జరిగిన పరిటాల 13వ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిటాల రవి సేవలను మరువలేమని, కార్మిక శాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఎన్నో పోరాటాలు చేసిన పరిటాల రవి కుట్రలకు బలయ్యారని, పేదవర్గాల వారికి ఎంతో కృషి చేసి వారికి అండగా నిలిచారన్నారు. పరిటాల రవి లేకపోవడం తెలుగుదేశం పార్టీకి, దళిత, బడుగు, బలహీన వర్గాలకు తీరనిలోటుగా పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం మంత్రి పరిటాల సునీత ఎంతో కష్టపడుతున్నారని, పార్టీ నాయకులు, శ్రేణులు ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. పేరూరుడ్యాం, భైరవన దిప్ప ప్రాజెక్టులకు టెండర్లు పిలిచి ఏడాదిలోగా పూర్తిచేసి అనంతపురం జిల్లా వాసుల దశాబ్దాల కల నెరవేరుస్తామన్నారు. అనంతరం దుర్గగుడి చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు మాట్లాడుతూ పరిటాల రవి జిల్లాలోని ప్రజలందరికీ నిత్యం అందుబాటులో ఉండి వారి కష్టాలను తీర్చే అన్నగా చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు బండారు హనుమంతరావు, కొత్త నాగబాబు, పొన్నం రవి, షేక్ మొహ్మద్ ఫైజాన్, చిరు మామిళ్ల సూర్యం, దేవినేని చంద్రశేఖర్, పూలరామచంద్రరావు పాల్గొన్నారు.

**పరిటాల రవి సేవలు చిరస్మరణీయం**

రాయలసీమ అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మాజీ మంత్రి దివంగత పరిటాల రవి సేవలు చిరస్మరణీయమని ఏపీ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో పరిటాల రవి 13వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ తుది శ్వాస వరకు ప్రజా సేవలకే అంకితమైన పరిటాల రవి తెలుగు ప్రజల హృదయాల్లో అస్తమించని రవిగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన అంకిత భావంతో పనిచేస్తూ నాటి సహచరులకు ఆదర్శనీయంగా నిలిచేవాడని గుర్తు చేశారు. రవి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన సతీమణి, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత ఆయన ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా సంక్షేమానికి, నమ్ముకున్న కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామకృష్ణ టీడీపీ రాష్ట్ర నేతలు ఏ.వీ.రమణ, గురజాల మాల్యాద్రి, చందు సాంబశివరావు, పి.ఆర్.మోహన్, నూకసాని బాలాజీ, కృష్ణమూర్తి, రాయపాటి రంగబాబు, రాయపాటి శ్రీనివాస్, ఎండి హిదాయత్, మన్నవ సుబ్బారావు, మల్లి, హర్షవర్ధన్, లాల్ వజీర్, రాజేష్, ప్రభాకర్, సాయి, వేగుంట రాణి, పద్మావతి, రమణమ్మ, శ్రీను, హనుమంతరావు, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దయారత్నం తదితరులు పాల్గొన్నారు.

# రోగులపై 'కార్పొరేట్' వల



● ఏజెంట్లుగా గ్రామీణ వైద్యులు ● అవసరం ఉన్నా లేకున్నా పరీక్షలే ● బెడ్ కో రేటు ● కార్పొరేట్ వైద్యసేవలపై పర్యవేక్షణ లేమి ● ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పేరుతో నిలువు దోపిడీ

**అమరావతి, ఆంధ్రప్రభ:** కార్పొరేట్ ఆసుపత్రుల మధ్య పోటీ విపరీతంగా పెరిగిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా కార్పొరేట్, ప్రైవేట్ వైద్యశాలలు ఏర్పాటు చేస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు డాక్టర్లు కలిసి సూపర్ స్పెషలిటీ ఆసుపత్రులు ప్రారంభిస్తున్నారు. ఈ ఆసుపత్రుల్లో వివిధ స్పెషలిటీ వైద్యులు మాత్రం ఆయా ప్రాంతాల్లోని నాలుగైదు ఆసుపత్రులలో కన్సల్టెంట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆసుపత్రుల మధ్య పోటీతత్వం పెరగడంతో రోగులను గాలం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. రోగులను గాలం వేయడానికి పీఆర్‌వో వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ఆసుపత్రులలో అందించే సేవలను వివరిస్తూ కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాలు పెద్ద ఎత్తున ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత వైద్యులను ఏజెంట్లుగా నియమించుకుని కార్పొరేట్ ఆసుపత్రులు రోగులను పీల్చిపిప్పి చేస్తున్నాయి. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం కార్పొరేట్ ఆసుపత్రులకు కల్పతరువుగా మారింది. ఈ పథకం ప్రవేశపెట్టిన అనంతరం వివిధ శస్త్రచికిత్సలకు సంబంధించిన బిల్లులు భారీగా పెంచేస్తున్నారు. గ్రామీణ ప్రాంత వైద్యులకు కమీషన్లు అందజేసి రోగులను తమ ఆసుపత్రులకు వచ్చే విధంగా ఈ కార్పొరేట్ ఆసుపత్రులు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల పిఆర్‌ఓలు గ్రామీణ ప్రాంత వైద్యుల వద్దకు వెళ్లి రోగులను సిఫార్సు చేసే విధంగా ఒప్పందాలు చేసుకుంటున్నారు. రోగులకు సంబంధించి ఏ వైద్యులు సిఫార్సు చేశారో నమోదు చేసుకుని నెలకు ఒకసారి కమీషన్ గ్రామీణ వైద్యులకు అందజేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడిన గ్రామీణ వైద్యులు అవసరం ఉన్నా లేకపోయినా రోగులను మెరుగైన వైద్య సేవల కోసం కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి పరీక్షలు చేయించుకోవాలంటూ సిఫార్సు చేస్తున్నారు. రోగులను సిఫార్సు చేసిన గ్రామీణ ప్రాంత వైద్యులకు 10 నుంచి 30 శాతం వరకు కార్పొరేట్ ఆసుపత్రులు కమీషన్ అందజేస్తున్నట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతంలో స్థానిక వైద్యుల మాట ప్రజలకు వేదం కావడంతో వారి సిఫార్సు చేసిన కార్పొరేట్ ఆసుపత్రికి వెళుతున్నారు. అక్కడ అవసరం ఉన్నా లేకున్నా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ బిల్లులను అడ్డగోలుగా వేస్తున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం కింద చికిత్స కోసం చేరిన రోగుల పరిస్థితి ఈ ఆసుపత్రుల్లో దయనీయంగా ఉందని చెబుతున్నారు. కొన్ని ఆసుపత్రులలో సక్రమంగా వైద్య సేవలందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం లిమిట్ వరకు వైద్యసేవలందించి, అనంతరం రోగిని ఆసుపత్రినుంచి డిశ్చార్జి చేసిన సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నాయి. రోగం తగ్గక, మరో ఆసుపత్రికి వెళ్లే అవకాశం లేకపోవడంతో ఇంటికి తీసుకువెళ్లిన అనంతరం పలువురు మృతి చెందిన సంఘటనలు రాష్ట్రంలో చోటు చేసుకున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ప్రవేశపెట్టిన అనంతరం విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి, నెల్లూరు, తిరుపతి, తదితర ప్రాంతాల్లో నెలకు ఒకటి చొప్పున కార్పొరేట్ ఆసుపత్రులు వెలిశాయి. బడా కార్పొరేట్ సంస్థలు వివిధ ప్రాంతాల్లో బ్రాంచీలను ఏర్పాటు చేసుకున్నాయి. ఒకవైపు పెద్ద ఎత్తున కార్పొరేట్ ఆసుపత్రుల వెలుస్తుండగా, ఇంకా మరో వైపు మరికొన్ని ఆసుపత్రుల ఏర్పాటుకు మెడికల్ కౌన్సిల్ అనుమతి కోసం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రులు మౌలిక వసతులు, నిపుణులైన వైద్యుల పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యం వ్యాపారంగా మారడంతో సామాన్య ప్రజలకు అందని ద్రాక్షగా మారింది. ఆసుపత్రులలో బెడ్ కో రేటు చొప్పున రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. బెడ్ పక్కనే బెడ్ వేసి రోజుకు రూ.1,000లు నుంచి రూ.1,500లు వరకు కొన్ని ఆసుపత్రులు వసూలు చేస్తున్నాయి. సింగిల్ రూమ్, ఇతర సౌకర్యాలు ఉంటే అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఒక్కో రూమ్‌కు రూ. 4 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో పేద, మధ్య తరగతి ప్రజలు రోగాల భారిన పడితే వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది.

**ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పేరుతో నిలువు దోపిడీ**

రాష్ట్రంలో అధికారం చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం కింద పేరు మార్పు చేసింది. 1,040 రోగాలకు సంబంధించి వైద్య సేవలందిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కార్పొరేట్ ఆసుపత్రుల పాలిట వరంగా మారింది. అవసరం ఉన్నా లేకున్నా వైద్య సేవల పేరుతో రోగులను నిలువుదోపిడీ చేస్తున్నాయి. ఈ పథకాన్ని పర్యవేక్షించే అధికారి నిక్కచ్చిగా వ్యవహరిస్తే సదరు ఆ అధికారులను తక్షణమే బదిలీ చేయించేలా ఆసుపత్రుల యాజమాన్యాలు ఏకమౌతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం అనంతరం మధ్య తరగతి ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం ఎండమావిగా మారింది. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో యాజమాన్యమే డయాగ్నస్టిక్ సెంటర్లను నిర్వహిస్తున్నాయి. రోగి అనారోగ్యానికి సంబంధించిన వైద్య పరీక్షలు అవసరం లేకున్నా వివిధ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దాంతో రోగిపై పెనుభారం పడుతోంది. రాష్ట్రంలో కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం కోసమే నెలకొల్పారు. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం నిర్వహణపై ప్రభుత్వ అజమాయిషీ కరవవడంతో కార్పొరేట్ ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఎన్టీఆర్ ఆరోగ్యసేవ పథకం కింద కార్పొరేట్ ఆసుపత్రులలో చేరిన రోగులకు వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనేదానిపై అధికారుల తనిఖీలు లేకపోవడం రోగుల పాలిటశాపంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతుల కల్పన, నిపుణులైన వైద్యులను నియమించి పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## రాష్ట్ర భద్రతా కమిషన్‌ను...

# నాలుగు నెలల్లో ఏర్పాటు చేయండి

● ఏపీ సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : రాష్ట్ర సెక్యూరిటీ కమిషన్(ఎస్ఎస్‌సీ), పోలీసు కాంప్లెయింట్ అథారిటీ(పీసీఏ) లను నాలుగు వారాల్లో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆంధ్రప్రదేశ్ సర్కారును ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ ఎం.గంగారావులతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. రాష్ట్రంలో పోలీసు అధికారుల చర్యల వల్ల ఇబ్బంది పడ్తున్న ప్రజల సమస్యలపై విచారణ చేపట్టేందుకు యుద్ధ ప్రాతిపదికపై రాష్ట్ర స్థాయి సెక్యూరిటీ కమిషన్లు, జిల్లా పోలీసు కాంప్లెయింట్ అథారిటీ లను ఏర్పాటు చేయాలని ఉమ్మడి హైకోర్టు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.రామలింగేశ్వరరావు ఏప్రిల్ 2017లో తీర్పును వెలువరించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఏర్పాటు చేసే కమిటీల్లో ఎవరెవరు సభ్యులుగా ఉండాలనేది ఆ తీర్పులో పేర్కొన్నారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీ హోంశాఖ ,ప్రకాశం జిల్లా ఎస్పీ తదితరులు డివిజన్ బెంచ్ ముందు అప్పీలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏపీ హోంశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది విద్యావతి వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నఅంశాల పరిధిని దాటి హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారని విన్నవించారు... పోలీసు అధికారులపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోలీసు ఫిర్యాదు(కాంప్లెయింట్)ల అథారిటీలను ఏర్పాటు చేయాలని హైకోర్టు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల హోంశాఖ ముఖ్య కార్యదర్శులకు స్పష్టం చేసినట్లు తెలిపారు.. ఆయా సంస్థలను ఏర్పాటు చేయకపోవడంతో సింగిల్ జడ్జి ఉన్నతాధికారులపై కోర్టు ధిక్కార చర్యలు ప్రారంభించినట్లు నివేదించారు. ఆ న్యాయవాది తెలిపిన వివరాల్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవరించింది. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినందువల్ల ఎస్ ఎస్ సీ,పీసీఏ ల ఏర్పాటు తప్పనిసరి అని ధర్మాసనం తేల్చి చెప్పింది. వాటిని ఏర్పాటు చేసేందుకు ఏపీకి నాలుగు నెలల గడువు ఇచ్చింది. గత ఏప్రిల్ నెలలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ రెండు రాష్ట్రాలు అమలు చేయలేదని పేర్కొంటూ ఏకలవ్య ఫౌండేషన్‌కు చెందిన ఎన్.ఎస్.చంద్రశేఖర్ హైకోర్టుకు లేఖ రాసిన విషయం తెలిసిందే..

# దాడి చేసిన వారిని శిక్షించరా...?

● నిరంకుశ పాలన సాగుతోంది ● అక్రమ అరెస్టులను ఖండించిన రఘువీరారెడ్డి

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలనకు భిన్నంగా నిరంకుశ పాలన సాగుతుందా..? అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఏపీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఛలో గొట్టిపాడు సందర్భంగా బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను, దళిత, వామపక్ష ప్రజా సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని రఘువీరారెడ్డి ఖండించారు. గొట్టిపాడు దళితులపై దాడి చేసిన వారిని శిక్షించకుండా, పరామర్శించడానికి వెళు తున్న నాయకులను అరెస్టు చేయడం దారుణ మన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, వైకె.శాంతకుమార్, మేళం భాగ్యారావు, దళిత, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఉన్నారని, అక్రమంగా అరెస్టు చేసిన వారిని భేషరతుగా విడుదల చేయాలని, దళితులకు రక్షణ కల్పించాలని రఘువీరారెడ్డి డిమాండ్ చేశారు.

**ప్రత్యేక హోదా ఇచ్చే దమ్ము.. కాంగ్రెస్‌కే సాధ్యం: కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి**

**కోడుమూరు, పభ న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని విభజన చట్టంలో పొందపరచినప్పటికి పాలక ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తూ హోదా ఇవ్వలేదని మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2019లో తిరిగి రాష్ట్రంలోను,కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అందుకు కర్నూలు జిల్లా కోడుమూరు మండల అధ్యక్ష ఉప ఎన్నిక విజయమే తొలిబోని అని చెప్పారు. కోడుమూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నట్టేటా ముంచాయని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో పనులు చేస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రజలకు చేసింది ఏమిటని ఆయన ప్రశ్నించారు. సీఎం అమరావతి రాజధాని పేరు జపిస్తూ రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కర్నూలు జిల్లాలో త్రాగునీరు కూడా లేని పరిస్థితిలో వున్న ఇక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమి చేయలేకపోతున్నారని, హెచ్ఎన్ఎస్ఎస్ నుండి అనంతపురం జిల్లాలోని చెరువులు నింపుకుంటున్న విషయం కనపడటం లేదా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం డబ్బుతో అధికారంలోకి రావాలన్న ప్రయత్నంలో టిడిపి నాయకులు వున్నారని ఇటీవల నంద్యాల ఉప ఎన్నికలలో కాంట్రాక్టర్ నుండి 200కోట్ల రూపాయలను తీసుకొని పంచినందువల్లనే టిడిపి విజయం సాధించిందని కోట్ల సూర్య ఆందోళన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కసాగరం లక్ష్మీరెడ్డి, కోడుమూరు కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ ఆకెపోగు వెంకటస్వామి, డిసిసి ఉపాధ్యక్షుడు అశోకరత్నం, కోడుమూరు సర్పంచు సిబి లత, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కె హేమాద్రిరెడ్డి, కె మధుసూదన్‌రెడ్డి, ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కోట్ల

## రామకృష్ణ వ్యాఖ్యలు సమర్ధనీయం కాదు

● హోదా కావాలంటే జగన్ వెంట నడవండి ● లేదంటే చంద్రబాబు వెంటపొండి ● మంత్రులు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిది: వైకాపా నేత జోగి రమేష్



**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రప్రయోజనాల దృష్ట్యా ప్రత్యేక హోదా ఇస్తే ఎవరితోనైనా జతకడతాం అని ప్రకటించిన వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రధాని నరేంద్ర మోడీకి స్టెఫినీ కావాలనుకుంటున్నారా అని వ్యాఖ్యానించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రత్యేక హోదా కోసం పోరాడుతన్న ఏకైక పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలతోపాటు సర్వతోముఖాభివృద్ధి చెందుతుందనేది వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఉద్దేశ్యమన్నారు. ప్రత్యేక హోదా కావాలనే వారంతా వైయస్ జగన్ వెంట నడవాలని, వద్దనే వారంతా చంద్రబాబు వెంట నడవాలని సూచించారు. ప్రత్యేకహోదా కోసం ఎన్నిసార్లు బంద్‌లు, ధర్నాలు చేశాం వాటికి హోదా రాదనే తెలిసి మీ పార్టీ తరపున వచ్చారా అనేది కూడా ప్రజలకు సమాధానంచెప్పాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ చెబుతోంది..హోదా ఇస్తే ఎవరికైనా మద్దతిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. హోదా కోసం డిమాండ్ చేస్తున్న తమ నేత జగన్ మోహన్ రెడ్డి అడుగులో అడుగు వేయాలని రామకృష్ణకు జోగి సూచించారు. మంత్రులు తమ నోళ్లను అదుపులో పెట్టుకుంటే మంచిదని హితవు పలికారు.

## 3 సరుకు రవాణా వాహనాలు ప్రారంభం



**అమరావతి, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ ప్రయాణీకులకు, వ్యాపారులకు ఏపీఎస్ఆర్టీసీ శుభవార్తను అందించింది. పార్సెల్,కొరియర్‌సేవలపై ఇక నుంచి నామమాత్రపు రుసుం వసూలు చేయాలని నిర్ణయించింది. తమ వ్యాపార సంస్థలకు డెలివరీ, పిక్‌అప్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రత్యేక వాహన సదుపాయాన్ని కల్పించింది. ఈమేరకు బుధవారం నామమాత్రపు రుసుంతో ఏర్పాటు చేసిన మూడు సరుకు రవాణా వాహనాలను విజయవాడ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ సరుకు వాహ నాలను కృష్ణా రీజినల్ మేనేజర్ పి.వి.రామారావు ప్రారంభించారు. ఈసరుకు రవాణా వాహనాలను వినియోగించుకోవాలని ప్రయాణీకులను ,స్థానిక వ్యాపారు లను ఆయన ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సీటిఎం (కమర్షియల్, ప్రాజెక్ట్ ) గోపీనాథ్‌రెడ్డి, డిప్యూటి సీటీఎం ( మార్కెటింగ్, కమర్షియల్ ) జి.నాగేందర్‌రెడ్డి తదితీఉలు పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

● 22 మద్యం షాపులు, ఒక బార్ లైసెన్స్ సస్పెన్షన్

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో బుధవారం బెల్టు షాపులపై ఎక్సైజు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, కడప జిల్లాల్లో 33 టీములు దాడులు నిర్వహించి 27 బెల్టు షాపులపై కేసులు నమోదు చేశామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. దాడుల్లో భాగంగా 33మందిని అరెస్టు చేయడంతో పాటు 141.93 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరికి 22 మద్యం షాపులు, ఒక బార్ అండ్ రెస్టారెంట్ మద్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తించి లైసెన్స్‌లు సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం సింగనపల్లి, పెద్దాపురం మండలం పెద్దాపురం పట్టణం, తాళ్లరేవు మండలం మెట్టపాలెం, సామర్లకోట మండలం పావర, ముమ్మిడివరం మండలం కొత్తవలస రోడ్డు, అమలాపురం మండలం గొల్లవిల్లి, రాయవరం మండలం రాయవరం, పోలమ్మపుట్టవీధి, పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం కొయ్యలగూడెం, కామవరపుకోట మండలం కామవరపుకోట, నర్సాపురం మండలం కేసరంపాడు, పోడూరు మండలం కవటం, కృష్ణాజిల్లా లోని పెడన మండలం మడక, విస్సన్నపేట మండలం మల్లెల, ఇబ్రహీంపట్నం మండలం ఇబ్రహీంపట్నం, వత్సవాయి మండలం ఇందుగపల్లి, చాట్రాయి మండలం బోరుగగూడెం, బంటుమిల్లి మండలం చెందూరు, గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలం బెల్లంకొండ, అచ్చంపేట మండలం అచ్చంపేట, దాచేపల్లి మండలం రుద్రవరం, కడప జిల్లాలోని గాలివీడు మండలం ఈగువగుట్టివీడు, పులివెందుల మండలం పులివెందుల టౌన్, బద్వేల్ మండలంలోని బ్రహ్మంగారి మఠం, నల్లిపల్లి క్రాస్, మైదుకూరు మండలంలోని సామయాజుల పల్లి గ్రామాల్లోని బెల్టు షాపులపై దాడులు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా దాడులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

## వేసవికి 104 ప్రత్యేక రైళ్లు

**అమరావతి, ఆంధ్రప్రభ :** వేసవి రద్దీని తట్టుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే 104 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు చర్యలు తీసుకున్నది. తిరుపతి నుంచి వివిధ గమ్యస్థానాలకు వీటిని నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలలలో వీటిని ఆయా మార్గాల్లో నడిపేందుకు చర్యలు తీసుకున్నారు. తిరుపతి - కాకినాడ టౌన్, నాగర్‌సోల్,హెచ్ స్ నాందేడ్ వరకు వీటిని నడపనున్నారు. తిరుపతి -కాకినాడ టౌన్,- రేణిగుంట మధ్య 34 సర్వీసులను నడపనున్నారు. అదే విధంగా తిరుపతి -కాకినాడ టౌన్ జనసాధారణ్ ప్రత్యేక రైలును మార్చి 4,11, 18,25 తేదీల్లో నడపనున్నారు. ఇదే రైలు తిరుగుప్రయాణంలో ఏప్రిల్ 1,8,15,22,29 తేదీల్లో తిరుపతికి బయలుదేరుతుంది. అదే విధంగా మే 6,13,20,27, జూన్ 3,10,17,24వ తేదీల్లో ( ఆదివారాలు ) కాకినాడ టౌన్‌కు మరుసటి రోజున చేరుకుంటాయి. 07941 నెంబర్ గల రైలు కాకినాడ టౌన్ - రేణిగుంట మధ్య నడుస్తుంది.. 0741, 07417, 07418, 07607, 07608 నెంబర్‌గల రైళ్లను ఆయా మార్గాల్లో నడపున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## గజల్ శ్రీనివాస్‌కు

# షరతులతో కూడిన బెయిల్ మంజూరు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరయింది. ఆయనకు నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో ఏ2 నిందితురాలిగా పార్వతికి కూడా న్యాయస్థానం ముందస్తు బెయిల్ ఇచ్చింది. ప్రతి బుదవారం, ఆదివారం పోలీసుల ఎదుట హాజరు కావాలని గజల్ శ్రీనివాస్‌కు నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పైన కోర్టు విచారణ జరిపింది. బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు లాయర్ ఈ నెల 12న కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. గజల్ శ్రీనివాస్ 20 రోజులకు పైగా జైలులో ఉన్నారని, ఇప్పటికైనా బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరపు న్యాయవాది మంగళవారం కోర్టును కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు పిటిషన్ విచారణ నిర్ణయాన్ని బుధవారంకు వాయిదా వేసింది. ఇప్పుడు ఆయనకు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. పార్వతి కూడా ముందస్తు బెయిల్ దాఖలు చేశారు. పార్వతిని ఎందుకు అరెస్ట్ చేయలేదని కోర్టు చీవాట్లు పెట్టింది. పరారీలో ఉన్నందున ఆమెను అరెస్టు చేయలేదని పోలీసులు న్యాయస్థానానికి చెప్పారు. కాగా, గజల్ శ్రీనివాస్ ఇద్దరు మహిళలతో మసాజ్ చేయించుకోవడమే కాకుండా తన ఇంటి పనిమనిషితో శృంగారం, ఓరల్ సెక్స్ చేయించుకునే వీడియో క్లిప్పింగ్స్ లీక్ అయిన విషయం తెలిసిందే. ఇవి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపాయి.

# సీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉచిత విద్యా పథకం

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాజధాని నగర పరిధిలోని అన్ని కుటుంబాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం 2016-17 విద్యా సంవత్సరం నుంచి 10సంవత్సరాల వరకు వర్తింప చేసేందుకు ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పథకాన్ని అమలులోకి తెచ్చింది. 2017-18 విద్యా సంవత్సరంలో ఈ పథకం ద్వారా ట్యూషన్ ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీసీఆర్‌డీఏ కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ తెలిపారు.

**ఈ పథకం ఎవరికి వర్తిస్తుంది..?**

అమరావతి రాజధాని నగర పరిధిలోని గ్రామాల్లో 2014, డిసెంబర్ 8 నాటికి నివసిస్తున్న ప్రజలందరికీ వర్తిస్తుంది. ఈ పథకంలో భాగంగా కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా రాజధాని విద్యార్థులకు ట్యూషన్ ఫీజు రీఎంబర్స్‌మెంట్ అమలు చేస్తారు. గతంలో ఏ విద్యా కోర్సుకు ఫీజు రీయంబర్స్‌మెంట్ పొందని వారే దీనికి అర్హులు. విద్యార్థి హాజరు 75 శాతం పైన ఉండాలి. ఆధార్ నెంబర్, రేషన్ కార్డు కాని కలిగి ఉండాలి.

**ఏ కోర్సులకు ఈ పథకం వర్తిస్తుంది..? ..**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యా సంస్థలలో సాంకేతిక విద్య, మేనేజ్‌మెంట్ విద్య, వృత్తి విద్యా కోర్సులలో ప్రవేశం పొందిన రాజధాని విద్యార్థులకు ట్యూషన్ ఫీజును రీయంబర్స్‌మెంట్ చేయడం జరుగుతుంది.

**ఏఏ విద్యాసంస్థల్లో ఈ ప్రయోజనం పొందొచ్చు..?**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలలు, వృత్తి విద్యా కళాశాలలు, విశ్వవిద్యాలయాల కళాశాలలో కన్వీనర్ కోటాలో 'ఎ' కేటగిరీ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ పథకం ద్వారా రాజధాని ట్యూషన్ ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రయోజనం పొందవచ్చు. దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా జన్మభూమి వెబ్‌సైట్‌లో అమరావతి ఉచిత విద్యకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా విద్యార్థులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్‌కు గడువు ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉందని తెలిపారు.

**30,31న విదేశీ విద్య దీవెన ఎంపిక..**

రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కాపు, తెలగ, బలిజ, ఒంటరి తెగలకు చెందిన విద్యార్థులకు విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు విదేశీ విద్య దీవెన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని, దీనిలో భాగంగా ఈ నెల 30,31 తేదిల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు కాపు కార్పొరేషన్ ఎండి కోట్ల శివశంకర్‌రావు తెలిపారు. బుధవారం విజయవాడలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు మూడు ఫేజులుగా ఎంపికలు నిర్వహించామని , నాలుగో ఫేజును 30,31 తేదిల్లో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్ధులకు రూ. 10లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. విదేశీ విద్య దీవెన కొరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్ధులు తమ తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు క్యాస్ట్, రేషన్ కార్డు, ఇన్‌కమ్, ఆధార్ కావాలని సూచించారు. 2017-18కి ఎంపికకు సంబంధించిన ఈ నెల 25నుండి కాపు కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరెన్ని వివరాలకు 7331172075/76 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.



కాపు కార్పొరేషన్ ఎండీ కె.శివశంకర్ రావు

**ఫార్మా బయోటెక్నాలజీ అభ్యర్థులకు 'ప్రత్యంచ' శిక్షణ**

ఫార్మా బయోటెక్నాలజీ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరిచేందుకు లైఫ్‌సైన్స్‌సెక్టార్ నైపుణ్యాభివృద్ధి కౌన్సిల్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రత్యంచ పేరుతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం గురువారం గుంటూరులో ప్రారంభం కానుంది.

పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యం గల అభ్యర్థులను తయారు చేయడమే ప్రత్యంచ ప్రధాన ఉద్దేశం. బయోటెక్నాలజీ, ఫార్మా రంగాల్లో బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ విద్యను అభ్యసించిన వారికి థీయరీ, ప్రాక్టికల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తం ఈ శిక్షణ కార్యక్రమానికి ఒక్కొక్క అభ్యర్థికి రూ.లక్ష వ్యయం అవుతుండగా దీనికి ప్రభుత్వం రూ.80 వేల సబ్సిడీ అందిస్తుంది. మిగిలిన రూ.20 వేల మొత్తాన్ని అభ్యర్థి చెల్లించాల్సి ఉంటుంది. ఫార్మా, బయోటెక్నాలజీ రంగంలో నిష్ణాతులైన అధ్యాపకులచే అభ్యర్థులకు శిక్షణ అందిస్తారు. గుంటూరు చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సూటికల్స్‌లో నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమానికి ఏపీ ఎస్ఎస్‌బి సీఈవో కె.సాంబశివరావు, డ్రగ్స్ అండ్ కాపీ రైట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి శంకర్ అయ్యన్నార్, ప్రభుత్వ సలహా మండలి సభ్యులు గోపాల కృష్ణపాల్గొననున్నారు.

# అరసవల్లిలో కన్నుల పండుగగా రథసప్తమి

**● అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన క్షీరాభిషేకాలు ● పాల్గొన్న స్వరూపానందస్వామి, మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ, ఎమ్మెల్యేలు ● ఏఎస్పీ ఓవరేక్షన్‌పై మీడియా ధర్నా ● మద్దతుగా కూర్చున్న ఎమ్మెల్యే శివాజీ ● కలెక్టర్ చెప్పడంతో సద్దుమణిగిన వివాదం**



**శ్రీకాకుళం, ప్రభ న్యూస్ బ్యూరో :** ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం రథసప్తమి వేడుకలు కన్నుల పండుగగా, ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి 11 గంటలకే భక్తులు క్యూలైన్లలోకి చేరుకున్నారు. అర్ధరాత్రి 1.30 గంటలకు సూర్యనారాయణస్వామివారి నిజరూప దర్శనం, క్షీరాభిషేకంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందస్వామి ప్రారంభ పూజలో పాల్గొన్నారు. స్థానిక శాసనసభ్యురాలు గుండ లక్ష్మీదేవి, ఆలయ ఇఓ శ్యామలాదేవి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం క్షీరాభిషేకం టిక్కట్లతో క్యూలలో ఉన్నవారికి స్వామివారి దర్శనం చేయించారు. తెల్లవారుఝామునే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జడ్‌పి చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ప్రభుత్వ విప్ కూన రవికుమార్, ఎంపి కింజరాపు రామ్మోహననాయుడు, శాసనసభ్యులు గౌతు శివాజీ, బగ్గు రమణమూర్తి, జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జాయింట్ కలెక్టర్ కెవిఎన్ చక్రధరబాబు, జిల్లా ఎస్‌పి త్రివిక్రమవర్మ, డిఆర్‌డిఏ పిడి జి.సి.కిశోర్‌కుమార్, ప్రతిపక్ష నాయకులు మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారామ్, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి తదితరులు కుటుంబ సభ్యులతో సహా స్వామి వారిని దర్శించుకుని క్షీరాభిషేకంలో పాల్గొన్నారు. మంత్రులు, మాజీ మంత్రులు సాంప్రదాయ దుస్తులు పట్టుపంచ, లాల్చీ ధరించి ప రాజల్లో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలైనా క్యూలైన్లు తరగలేదు. భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం కలిగించేందుకు దేవాదాయశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. భక్తులకు తాగునీటిని అందించేందుకు అనేక స్వచ్ఛందసంస్థలు మంచినీటి ప్యాకెట్లను అందించాయి.

కాగా రథసప్తమి సందర్భంగా విధులకు వెళ్లిన పాత్రికేయుల ప ట్ల ఏఎస్‌పి టి.పనసారెడ్డి దురుసుగా ప్రవర్తించిన తీరుపై మీడియా ప్రతినిధులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆలయ అలివెట్టి మండపంలో మంగళవారం రాత్రి 11 గంటలనుంచి విధులు నిర్వహిస్తున్న మీడియా ప్రతినిధులు కొందరు మధ్యలో బయటకు వచ్చి, మళ్ళీ మీడియా పాయింట్‌కు వెళ్లడాన్ని ఏఎస్‌పి అడ్డుకున్నారు. బయటకు వెళ్లినవారు తిరిగి లోపలకి రావడానికి వీలులేదంటూ హుకుం జారీచేసి, లోపలికి వస్తున్న మీడియా ప్రతినిధులను బలవంతంగా బయటకు గెంటివేయించడంతో పాత్రికేయులు తీవ్ర నిరసన తెలియచేశారు. మీరు కవర్ చేసింది చాలంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ పాత్రికేయుల పట్ల రుసరుసలాడారు. దీంతో ప్రధాన ద్వారం వద్ద మీడియా ప్రతినిధులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఆ సమయంలో అక్కడకు వచ్చిన ఎంఎల్ఎ గౌతు శివాజీ ఏఎస్‌పికి నచ్చచెప్పినా పనసారెడ్డి పట్టించుకోకపోవడంతో ఎంఎల్ఎ శివాజీ కూడా ఆగ్రహించి, పాత్రికేయులతో గొంతుకలిపి పాత్రికేయులను లోపలికి పంపించినంతవరకూ తాను కూడా వారితో పాటు నిరసనలో పాల్గొంటానని చెప్పి ఆలయముఖద్వారం వద్దనే కూర్చుండిపోయారు. జిల్లా ఎస్‌పి చెప్పినా ఏఎస్‌పి తన మొండివైఖరి వీడక పోవడంతో జిల్లా కలెక్టర్ కె.ధనంజయరెడ్డి ఉదయం ఏడు గంటల సమయంలో అక్కడకు వచ్చి ఏఎస్‌పితోను, ఎంఎల్ఎ శివాజీతో మాట్లాడి మీడియా ప్రతినిధులను తిరిగి లోపలికి పంపించే ఏర్పాట్లు చేయడంతో వివాదం సద్దుమణిగింది. అనునిత్యం పోలీసులకు సంబంధించిన వార్తలు రాస్తూ, ఛానళ్లలో ప్రసారంచేస్తున్న మీడియాపై ఏఎస్‌పి వ్యవహరించిన తీరుపట్ల ఆసమయంలో వచ్చి భక్తులు, కొంతమంది ఇతర పోలీసు సిబ్బంది కూడా ఆక్షేపించారు.

# బ్రహ్మోత్సవాలను తలపించిన రథసప్తమి వేడుకలు



**● సప్త వాహనాలపై దర్శనమిచ్చిన సప్తగిరీశుడు ● వాహన సేవలను తిలకించిన అనంత భక్త కోటి ● భక్త జనసంద్రమైన తిరుమల గిరులు**

**తిరుమల, ప్రభ న్యూస్:** కలియుగ వైకుంఠంగా బాసిల్లే శ్రీ వేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలను తలపిస్తూ బుధవారం రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఒకే రోజు సప్త వాహనాలపై వైకుంఠనాథుడు మాడవీధులలో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువజామునే సూర్యప్రభ వాహనంలో ప్రారంభమైన వాహనసేవలు చివరిదైన చంద్రప్రభ వాహనంలో శ్రీనివాసుడు ఊరేగుతూ భక్తులనుంచి కర్పూర నీరాజనా లందుకున్నారు. మొదటిగా సూర్యప్రభ వాహనంపై మాడవీధులలో ప్రయాణిస్తూ దక్షిణం, ఉత్తరం కలిసే మూలమైన వాయువ్య దిశలోకి వేంచేశారు. ఉదయం ఉదయించే సూర్యభగవానుడు తన ఉషారేఖలను 7.04 నిమిషాలకు స్వామివారి పాదాల పై ప్రసరించి అంజలి ఘటించాడు. అనంతరం అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ బాలమందిరం విద్యార్థులు పఠించిన ఆదిత్య హృదయం, సూర్యాష్టకం, శ్రీ వేంకటేశ సప్తవాహన స్తోత్రం సంస్కృత శ్లోకాలు భక్తులను మంత్రముగ్ధులను చేశారు. ఆ సమయంలో ఉత్తర మాడవీధులలో వేలాదిగా వేచి ఉన్న భక్తులు గోవిందనామస్మరణలు చేశారు. సూర్యప్రభ వాహనం ముగియగానే మలయప్పస్వామివారు చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాల పై వివిధ రూపాలలో ఊరేగుతూ భక్తులకు దర్శన మిచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో సుదర్శన చక్రస్వామిని ఆలయ మాడవీధులలో ఊరేగిస్తూ శ్రీవారి పుష్కరిణికి చేరుకోగానే చక్రతాళ్వారుకు పంచామృతాలస్నానాభిషేకం చేయించి స్వామి పుష్కరిణిలో తీర్థస్నానం అర్చకులు నిర్వహించారు. వాహన సేవలు ప్రారంభమయ్యే సమయానికి సుమారు లక్ష మందికి పైగా మాడవీధులలో గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. రథసప్తమి వేడుకలలో భాగంగా శుక్రవారం పూర్తిగా రద్దు చేసిన ఆర్జిత సేవలను శనివారం యధావిధిగా టీటీడీ నిర్వహించనుంది. ఈ వేడుకలలో టీటీడీ ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు దంపతులు, సివిఎస్‌ఓ రవికృష్ణ ఆలయ డిప్యూటిఇఓ కోదండరామారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్

**రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణం : పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి**

**అమరావతి, ఆంధ్రప్రభ:** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని, ఆంధ్ర ప్రదేశ్ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అనవసర ఖర్చులు, వృధా వ్యయం జరుగుతుందని పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గత రెండ్రోజులుగా అసెంబ్లీ ప్రాంగణంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఆర్థిక స్థితి గతులపై ప్రజాపద్దుల కమిటీ సమీక్ష జరిగింది. బుధవారం సాయంత్రం చైర్మన్ రాజేంద్ర నాథ్‌రెడ్డితోపాటు సభ్యులు విష్ణుకుమార్‌రాజు, ఆదిమూలపు సురేష్ సంయుక్తంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. కాగ్ అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాలపై తాము సమీక్షించి సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుం దన్నారు. భవిష్యత్‌లో తిరిగి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసే బాధ్యత పీఏసీపై ఉందన్నారు. రాష్ట్రంలో అప్పులు విపరీతంగా పెరిగాయన్నారు. విభజనకు ముందు రాష్ట్ర అప్పు 97 వేల కోట్లుండగా, గతేడాది అక్టోబర్ నాటికి 2,17,00 కోట్లకు చేరిందన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి అప్పు 2,27 వేల కోట్లకు పెరిగే అవకాశముందన్నారు. అప్పు చేస్తే ఆస్థులు కనబడాలని, ఐతే అందుకు తగ్గట్టుగా ఎక్కడా శాశ్విత భవనాలు, ప్రాజెక్టులు కనిపించడంలేదన్నారు. వెలగపూడిలో 600 కోట్లతో నిర్మించిన అసెంబ్లీ భవనాలు తాత్కాలికమని, అలాగే 1600 కోట్లతో ఏర్పాటు చేసిన పట్టిసీమ ప్రాజెక్ట్ కూడా తాత్కాలికమైనదేనన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేని సమయంలో పట్టిసీమ ప్రాజెక్టుకు 350 కోట్లు అదనంగా చెల్లించాల్సిన అవసరమేమిటని ప్రశ్నించారు. పట్టిసీమ ప్రాజెక్టుకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రముఖ కంపెనీలతో అంచనా వేయించగా, రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 1400 కోట్ల కంటే 22 శాతం తక్కువగా 1172 కోట్లకే ప్రాజెక్ట్ పనులు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో అక్రమాలకు చెక్

**● ఇన్విజరేటర్లకూ జంబ్లింగ్ పద్ధతి ● సీసీ కెమెరాల నిఘా నీడన పరీక్షలు ● పకడ్బందీ ఏర్పాట్లకు మంత్రి గంటా ఆదేశం**

**అమరావతి, ఆంధ్రప్రభ:** ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలలో అవకతవకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రాక్టికల్ పరీక్షల్లో అవకతవకలు జరుగు తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తుండడంతో భవిష్యత్‌లో ఇటువంటి వాటికి అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు ప్రభుత్వం తాజాగా తగు చర్యలు తీసుకుంది. ఈమేరకు మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విద్యాశాఖాధికారు లకు ఆదేశాలు జారీ చేరారు. ఈసారి జరగబోయే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో విద్యా ర్థులతో పాటు ఎగ్జామినర్లకూ జంబ్లింగ్ విధానాన్ని అనుసరించాలని మంత్రి గంటా శ్రీనివాసరావు విద్యాశాఖాధికారులను ఆదేశించడంతో ఆ మేరకు చర్యలకు ఉపక్ర మించారు. త్వరలో రాష్ట్రంలో జరగబోయే ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల్లో ఈ నూతన విధానాన్ని పకడ్బందీగా అమలు చేయబోతున్నారు. ఈ విధానంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి, కంప్యూటర్ ద్వా రా మానిటరింగ్ చేయాలని నిర్ణయించారు. ప్రాక్టికల్స్ నిర్వహణలో ఎలాంటి లోటు పాట్లుకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూ స్ పరీక్ష నిర్వహించే రోజు బోర్డు ప్రధాన కార్యాలయం నుంచే ప్రశ్నాపత్రాలను జారీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ప్రాక్టికల్ జరిగే అన్ని పరీక్షా కేంద్రా ల్లో సీసీ టీవీ కెమెరాలను అమర్చే పనిలో పడ్డారు. పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నా రు. ఈసారి ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష తప్పనిసరిగా పాస్ కావాలనివిద్యా శాఖ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ పరీక్షను ఈనెల 27వ తేదీన నిర్వహించ నున్నారు. అలాగే ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను 29న నిర్వహించను న్నారు. ఫిబ్రవరి 1 నుంచి 21 వరకు ప్రాక్టికల్స్ జరు గుతాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు మరో సెషన్‌లో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు..గతంలో విద్యార్థులకు జంబ్లింగ్ విధానాన్ని అమలు చేసిన సంగతి తెలి సిందే. గతంలో మూడు రోజులకు ఒకసారి ఇన్విజరేటర్లను మార్చే వారు. కానీ తాజా ఆదేశాల మేరకు ఇప్పుడు ప్రతి రోజూ వారిని మార్చే విధానాన్ని తీసుకొస్తు న్నారు. విద్యార్థులకు వసతీ సౌకర్యాలకు కూడా చర్యలు తీసుకుంటున్నారు.

## టెట్ వాయిదా

**అమరావతి, ఆంధ్రప్రభ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ మార్గదర్శకాల్లో ఇప్పటికే ప్రభుత్వం పలు సవరణలు తీసుకొచ్చిన నేపథ్యంలో భాషా పండితు ల అభ్యర్థన మేరకు టెట్ పరీక్షల షెడ్యూల్‌లో మళ్లీ మార్పులు చేయబోతున్నది. ఈవిషయాన్ని స్వయా నా మంత్రి గంటా శ్రీనివాసరావు మంగళవారం కాకి నాడలో ప్రకటించారు. కానీ ఇంతవరకు కొత్త షెడ్యూల్ వివరాలను ప్రకటించ లేదు. దాదాపు 14వేల ఉపా ధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం టెట్ నిర్వహించాల ని తలపెట్టిన సంగతి తెలిసిందే. వాస్తవానికి పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు శనివారంతో ముగిసింది.. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 4,36,311 మంది అభ్యర్థులు టెట్ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా పరీక్షఫీజు చెల్లించడం గమనార్హం. ఈనెల 22తో దరఖాస్తుల స్వీకరణ గడువు కూ డా ముగిసింది. ఇప్పటికే రెండు సార్లు టెట్ షెడ్యూల్‌ను మార్చిన ప్రభుత్వం మరో సారి టెట్ షెడ్యూల్‌లో మార్పులు చేయబోతున్నది. భాషా పండితుల నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు ప్రభుత్వం మళ్లీ టెట్ షెడ్యూల్‌లో మార్పులు చేసేం దుకు సిద్ధమైంది. నేడో రేపో ఇందుకు సంబంధిచిన తాజా షెడ్యూ ల్ వచ్చే అవకాశం ఉంది. మరో నెల రోజుల పాటు టెట్ పరీక్ష గడువును పొడిగించే అవకాశం ఉందం టున్నారు. కాకినాడలో 400 మంది భాషా పండిత అభ్యర్థులు మంత్రి గంటాను కలిసి,ఈ విషయమై అభ్యర్థించడంతో మంత్రి టెట్ షెడ్యూల్ మారుస్తామ న్నారు. అయితే వీరితో పాటు పేపర్ -1, 2 అభ్యర్థులు కూడా పరీక్షను వాయిదా వేయా లని కోరుతున్నారు.

# వీఐపీ రైల్వే ప్రయాణికులకు శుభవార్త

**బెజవాడ రైల్వే స్టేషన్‌లో అత్యాధునిక ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఏర్పాటు**



**అమరావతి, ఆంధ్రప్రభ:** వీఐపీ రైల్వే ప్రయాణీకులకు శుభవార్త.. బెజవాడ వీఐపీ రైల్వే ప్రయాణీకుల కోసం దక్షిణ మధ్య రైల్వే స్థానిక రైల్వే స్టేషన్‌లో అత్యాధునిక ఎగ్జిక్యూటివ్ లాంజ్‌ను ఏర్పాటు చేసింది. దక్షిణ మధ్య రైల్వే, ఇండియన్ రైల్వే కేటరింగ్‌అండ్ టూరిజం కార్పొరేషన్ ( ఐఆర్‌టీసీ ) సంయుక్తంగా దీనిని ఏర్పాటు చేశాయి. 370 చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.1 కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన దీనిని బుధవారం ప్రారంభించారు.దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్ ఆర్.ధనంజయులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ లాంజ్‌లో బ్రేక్ ఫాస్ట్ సౌకర్యం కూడా కల్పించారు. వెజ్,నాన్‌వెజ్‌ను అందుబాటులో ఉంచారు. ఇందుకు రూ 250 నుంచి 275 వరకు చార్జి చేస్తారు. కోట్లు ఖర్చు చేసి,ఏర్పాటు చేసిన ఈ లాంజ్‌లో అనేక ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయి. పురుషులకు, మహిళలకు ప్రత్యేకించి,వెయిటింగ్ గదులతో పాటు ఫ్రీ ఇంటర్‌నెట్ సదుపాయం, బిజినెస్‌సెంటర్, ఫ్యాక్స్ సదుపాయం, సాఫ్ట్ పానీయాలు, న్యూస్ పేపర్లు,మ్యాగ్జిన్ సదుపాయం, టీవీ ఎంటర్‌టైన్‌మెంట్, అధునాతన టాయ్‌లెట్స్,బాత్‌రూమ్‌లు తదితర వసతులు ఏర్పాటు చేశారు. వీటిని వినియో గించుకోవాలంటే ప్రతి రెండు గంటలకు రూ. 150లు చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా వాడుకుంటే అదనపు చార్జీని చెల్లించాల్సి ఉం టుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ సౌకర్యాలను వీఐపీ ప్రయాణీకులు వినియోగించుకోవాలని కోరారు.ఈ ప్రారంభ కార్యక్రమంలో అడిషనల్ డివిజనల్ మేనేజర్ ఎం.వి.ఎస్. రామరాజు, ఉన్నతాధికారులు జి.సుమన, డి.నరసింగరావులు పాల్గొన్నారు.

# బైబిల్ మిషన్ సభలకు ప్రత్యేక రైళ్లు

**అమరావతి, ఆంధ్రప్రభ :** గుంటూరు నాగార్జున నగర్‌లో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న బైబిల్ మిషన్ వార్షిక సమావేశాలకు వచ్చే వారి కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతున్నది. పలు రైళ్లను దారి మళ్లిస్తూ విజయవాడ - గుంటూరు జంక్షన్‌లో ఆగేలా డివిజనల్ మేనేజర్ ధనంజయులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కాకినాడ పోర్టు నుంచి గుంటూరు వరకు నడిచే రైలు ( 07223 ) ఈనెల 26న తెల్లవారు జామున కాకినాడ నుంచి బయలు దేరి మధ్యాహ్నం 12.50 గంటలకు గుంటూరుకు చేరుకుం టుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ (07224) గుంటూరులో 29న మధ్యాహ్నం 1.30 గంటలకు బయలు దేరి రాత్రి 8.40 గంటలకు కాకినాడకు చేరుకుం టుంది. ఈ ప్రత్యేక రైళ్లు అన్ని స్టేషన్లలో ఆగేలా చర్యలు తీసుకు న్నారు. వీటితో పాటు 17201, 17202 నెంబర్లు కలిగిన రైళ్లు, గోల్కొండ ఎక్స్‌ప్రెస్ గుంటూరు - సికింద్రాబాద్ రైలు, గుంటూరు -విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు 10 నిమిషాల పాటు గుంటూరులో ఆగే విధంగా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా పలు పాసింజర్ రైళ్లను కూడా గుంటూరు వరకు పొడిగించారు. ప్రధానంగా విజయవాడ - విశాఖపట్నం, గుంటూరు -విజయవాడ, కాకినాడ పోర్టు - విజయవాడ మధ్య నడిచే రైళ్లను నాలుగు రోజుల పాటు గుంటూరు వరకు పొడిగించారు. రాయగడ - విజయవాడ రైలును మూడు రోజుల పాటు నడిపే విధంగా ఏర్పాట్లు చేసినట్లు డీఆర్ఎం తెలిపారు. అంతేకాకుండా నర్సాపురం నుంచి సికింద్రాబాద్ వరకు ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు చెప్పారు. ఈ రైలు నర్సాపురంలో 28న రాత్రి 9.10 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 8.25 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుం దన్నారు. పాలకొల్లు, భీమవరం, మిర్యాలగూడ, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, పిడుగురాళ్ల, నల్గొండ స్టేషన్లలో ఈ రైలు ఆగుతుం దన్నారు.

# మొదటి ఏషియన్ పేసాపోలో పోటీల్లో భారత్‌కు బంగారు పతకం



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఈ నెల 17 నుండి 21 వరకు నేపాల్, కాట్మాండులో జరిగిన మొదటి ఏషియన్ పేసాపోలో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న భారతజట్టు బంగారు పతకంను కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో ఇండియా, పాకిస్తాన్, భూటాన్, నేపాల్, శ్రీలంక, ఖాట్మాండూ పాల్గొనగా భారతదేశం విజేతగా నిలిచింది. బంగారు పతకం సాధించిన భారత జట్టులోని ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు నగరానికి చేరుకోగా, క్రీడాసంఘాలు, సీనియర్ క్రీడాకారులు, కాకర్ల స్పోర్ట్స్ అకాడమీ, కృష్ణదేవరాయ ఇనిస్టిట్యూట్, సెయింట్ జోసెఫ్ స్కూల్ నున్న విద్యార్థులు క్రీడాకారులకు ఘనస్వాగతం పలికారు. క్రీడాకారులను స్థానిక రైల్వే స్టేషన్ నుండి ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వరకు ఊరేగించి భారత ఖ్యాతిని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ పేసాపోలో ప్రధాన కార్యదర్శి సరళ శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటి ఏషియన్ కప్ భారతదేశం సాధించడం సంతోషంగా ఉంది. భారత జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరించడం గర్వకారణంగా ఉందన్నారు. సీనియర్ విభాగంలో నగరానికి చెందిన కాకర్ల పవన్ కుమార్, వేమూరి జగదీష్, చిన్నబాబు, బంగారు పతకం, జూనియర్ విభాగంలో (17) అనంతపురం జిల్లాకు చెందిన హరీష్, విశాఖ జిల్లాకు చెందిన షన్‌ముఖ్, కృష్ణాజిల్లాకు చెందిన మనోజ్ కుమార్, సతీష్, సబ్ జూనియర్ (14) విభాగంలో నగరానికి చెందిన సరెళ్ళ సుఖేష్, దిదిశీమకు చెందిన ఏ.డి మనోహర్, సీనియర్ మహిళా విభాగంలో విశాఖకు చెందిన రేష్మ బంగారు పతకాలు సాధించి రాష్ట్ర, దేశ ఖ్యాతిని పెంచారని కొనియాడారు. ముందు ముందు ఆంధ్రప్రదేశ్ నుండి ఎక్కువ మంది క్రీడాకారులను భారత్‌కు ప్రాతినిధ్యం వహించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాకర్ల స్పోర్ట్స్ అకాడమీ సెక్రటరీ కాకర్ల శ్రీనివాసరావు, సాఫ్ట్‌వేర్ పొల్యూషన్స్ ఎం.డి శ్రీరామరాజు, కృష్ణదేవరాయ ఇనిస్టిట్యూట్ అధినేత మెరుగు వరున్, సీనియర్ క్రీడాకారులు, క్రీడాసంఘాలు తదితరులు పాల్గొన్నారు.



## రాజీవ్ హత్యతో నాకు సంబంధం లేదు

**సుప్రీంకోర్టులో దోషి పిటిషన్**

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని రాజీవ్ గాం ధీ హత్య కేసులో తనను దోషిగా నిర్ధారిస్తూ ఇచ్చిన తీర్పును పునఃసమీక్ష చేయాలని ఏజి పెరరివలన్ సమర్పించిన పిటిషన్‌పై స్పందించాలని సీబీఐను సుప్రీంకోర్టు కోరింది. 1999 మేనెలలో పెరరివలన్‌ను దోషిగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తనకు ఈ కుట్రతో సంబంధంలేదని పెరరివలన్ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు.



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

# క్రీడాప్రభ

- కోహ్లి అర్ధసెంచరీ • గోడ కట్టిన పుజారా • ఓపెనర్ల వైఫల్యం
- మళ్లీ పేలవ బ్యాటింగ్ • భారత్ 187 ఆలౌట్ • దక్షిణాఫ్రికా 6-1

# ఇద్దరే...!




**పాత కథే...! అచ్చివచ్చిన వాండరర్స్‌కు వచ్చినా భారత కథ మారలేదు. పేస్‌కు అనుకూలించే పిచ్‌పై ఓపెనర్లు ఎప్పటిలాగే బ్యాట్లెత్తేశారు. బౌన్సీ పిచ్‌పై ముగ్గురు కాదు... ఏకంగా అరివీర భయంకరులైన ఐదుగురు పేసర్లతో దిగిన దక్షిణాఫ్రికా దాటికి టీమ్‌ఇండియా బ్యాటింగ్ టీ విరామం తర్వాత ఆలౌటైంది. ఆడింది.. ఇద్దరే. పుజారా (50) గోడలా నిలబడి అర్ధసెంచరీ చేయగా... కెప్టెన్ విరాట్ కోహ్లి (54) మరోసారి క్లాస్ ఇన్నింగ్స్ ఆడాడు. 60 ఓవర్ల తరువాత వెంటవెంటనే 144 పరుగుల వద్ద పుజారా, పటేల్, పాండ్య వెనుదిరగడంతో భారత్ శిబిరంలో ఆందోళన నెలకొంది. చివర్లో భువనేశ్వర్ (30) చివరి వరుస బ్యాట్స్‌మెన్‌తో కలిసి జట్టును ఆదుకునేందుకు ప్రయత్నించాడు. టీమ్‌ఇండియా బ్యాటింగ్‌లో మూడు డక్‌లు... మూడు మాత్రమే రెండంకెల స్కోర్లు. ఇదీ దక్షిణాఫ్రికాతో చివరి టెస్టులో తొలి రోజు మొదటి ఇన్నింగ్స్‌లో స్థూలంగా భారత్ బ్యాటింగ్ కథ!.**

**జొహన్నెస్‌బర్గ్:** చటేశ్వర్ పుజారా (50, 179 బంతుల్లో, 8 ఫోర్లు), విరాట్ కోహ్లి (54, 106 బంతుల్లో, 9 ఫోర్లు) అర్ధసెంచరీలతో ఆదుకోవడంతో మూడో టెస్టులో బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 187 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ఆరంభించిన దక్షిణాఫ్రికా వికెట్ నష్టపోయి 6 పరుగులు చేసింది. భువనేశ్వర్ (1-3) మర్క్రమ్ వికెట్ పడగొట్టాడు. పిచ్ పరిస్థితి చూస్తే దక్షిణాఫ్రికాకు కూడా బ్యాటింగ్ ఏమంత సులువు అనిపించడం లేదు. వికెట్ పేసర్లకు అనుకూలిస్తుండడంతో రెండో రోజు భారత పేసర్లు విజృంభించే అవకాశాల్ని కొట్టిపడేయలేం. భారత్ జట్టులో రెండు మార్పులు జరిగాయి. రోహిత్ స్తానంలో రహానే... అశ్విన్‌కు బదులు భువనేశ్వర్ జట్టులోకి వచ్చారు.

**గోడ కట్టిన పుజారా:** టాస్ గెలిచి కోహ్లి అనూహ్యంగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. మరోసారి ఓపెనర్లు జోడీ విఫలమైంది. రాహుల్ 7 పరుగుల వద్ద... విజయ్ 13 పరుగుల వద్ద వెనుదిరిగారు. క్రీజులోకి అడుగుపెట్టిన పుజారా క్రీజులో పాతుకు పోవడానికే ప్రాధాన్యం ఇచ్చాడు. తొలి పరుగు సాధించ డానికి అతను 54 బంతులు ఆడాడు. పుజారా అసలుసిసలు టెస్ట్ ఇన్నింగ్స్ ఆడాడు. దక్షిణాఫ్రికా బౌలర్ల సహనానికి పరీక్షపెట్టాడు. మరో వైపు కోహ్లి దూకుడుగానే ఆడాడు. పుజారా.. నిప్పులు చెరిగే దక్షిణాఫ్రికా పేసర్ల బౌన్సర్లకు వెరవకుండా నిలబడ్డాడు.

ఇద్దరు విరుద్ధ మైన శైలిలో బ్యాటింగ్ సాగిం చారు. పుజారా, విరాట్ మూడో వికెట్ 84 పరుగు లు జోడించారు. వీరిద్దరు క్రీజులో ఉన్నంత సేపు భారత శిబిరంలో ఆశలు ఏర్పడ్డాయి. లంచ్ విరామానికి వీరిద్దరు మరో వికెట్ ఇవ్వలేదు. టీ విరామానికి ముందు కోహ్లి ఔటయ్యాడు. అప్పటికి పుజారా 145 బంతుల్లో 27 పరుగులతో ఆడుతున్నాడు. విరాట్ వెనుదిరిగాక రహానే (9) క్రీజులోకి వచ్చి 27 బంతలాడినా వెంటనే ఔటయ్యాడు. అప్పటికి భారత్ స్కోరు సెంచరీ దాటినా కోలుకున్నట్టే కోలుకొని తిరిగి సంక్షోభంలో పడింది. ఆ దశలో పుజారా ఐదో వికెట్‌గా వెనుదిరగడంతో భారత్ మరింత కష్టాల్లో కూరుకుపోయింది. అప్పటికి స్కోరు 5-144. అదే స్కోరు వద్ద పటేల్ (2), పాండ్య (0) కూడా వెనుదిరిగి భారత్ మరింత సంక్షోభానికి కారకులయ్యారు. ఆ దశలో భువీ.. షమితో కలిసి 8వ వికెట్‌కు 19 పరుగులు జోడించాడు. కానీ మళ్లీ భారత్ వరుసగా రెండు వికెట్లు కోల్పోయింది. పదో వికెట్‌కు భువీ.. బుమ్రాతో కలిసి 21 పరుగులు జోడించి వెనుదిరిగాడు.

**స్కోరు బోర్డు: భారత్ తొలి ఇన్నింగ్స్:** విజయ్ (సి)డి కాక్ (బి) రబాడ 8, రాహుల్ (సి) డి కాక్ (బి) ఫిలాండర్ 0, పుజారా (సి) డి కాక్ (బి) ఫెహ్లుక్ వయో 50, కోహ్లి (సి) డి విలియర్స్ (బి) ఎన్‌గిడి 54, రహానే (ఎల్బీ) (బి) మోర్కెల్ 9, పటేల్ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 2, పాండ్య (సి) డి కాక్ (బి) ఫెహ్లుక్‌వయో 0, కుమార్ (సి) ఫెహ్లుక్‌వయో (బి) రబాడ 30, షమి (సి) రబాడ (బి) ఫిలాండర్ 8, ఇషాంత్ (సి) డు ప్లెసిస్ 0, బుమ్రా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు 26, **మొత్తం:** (77 ఓవర్లలో ఆలౌట్) **187**

**వికెట్ల పతనం:** 1-7, 2-13, 3-97, 4-113, 5-144, 6-144, 7-144, 8-163, 9-166, 10-187

**బౌలింగ్:** మోర్కెల్ 17-5-47-2, ఫిలాండర్ 19-10-31-2, రబాడ 19-7-39-3, ఎన్‌గిడి 15-7-27-1, ఫెహ్లుక్‌వయో 7-1-25-2

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** ఎల్గర్ బ్యాటింగ్ 4, మర్క్రమ్ (సి) పటేల్ (బి) కుమార్ 2, రబాడ బ్యాటింగ్ 0, ఎక్స్‌ట్రాలు 0, **మొత్తం:** (6 ఓవర్లలో వికెట్‌కు) 6,

**వికెట్ల పతనం:** 1-3, **బౌలింగ్:** కుమార్ 3-2-3-1, బుమ్రా 3-2-3-0.